జనవరి
2006

1

సంపుటి : 2 సంచిక : 1

మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో.....

వెల: రూ.5/-

స్ఫూర్తి

నియంతృత్వంపై 'కలం దూసిన' రచయిత

"రష్యన్ రాజవంశం రెండు తలల రాబందు... ఒకటి రాజవంశపు రక్షక భట దళానిది. రెండోది బూర్జువా వర్గానిది. మనుషులను పీక్కుతినే ఈ రాబందు రెండు తలలనూ చితగ్గొట్టండి" అని గత శతాబ్దంలోని నిరంకుశ జారు రాచరికానికి వ్యతిరేకంగా ఆ దేశ యువజనులకు తన రచనల ద్వారా పిలుపునిచ్చిన వ్యక్తి ఆయన.

జారిస్టు ప్రభుత్వానికి తలవంచని, ప్రమాదకరమైన శత్రువుగా కన్పించాడాయన. విప్లవకారులతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నట్లు ప్రభుత్వం ఆయనను అనుమానించింది. అయితే ఆయన విప్లవకర కార్యకలాపాల గురించి ఎంతగా ప్రయత్నించినా పోలీసులు తెలుసుకోలేకపోయారు. చమత్కారంతో కూడిన, మనో సమ్మోహనమైన ఆయన రచనలనూ, రోజువారీ సమస్యలనూ పురోగామి ఆదర్శాలతో ముడిపెట్టే సామర్థ్యాన్నీ, జీవితంలోని దౌష్ట్యాన్ని ధైర్యంగా విమర్శించడాన్నీ, పేదలను సమర్థించే విషయంలో ఆయన నిరంతర సంసిద్ధతను లెనిన్ ప్రశంసించాడు. ఆయనే నికొలాయ్ మిహైలోవ్‌స్కీ.



నికొలాయ్ మిహైలోవ్‌స్కీ

మిహైలోవ్‌స్కీ రష్యాలోని కలూగ రాష్ట్రంలో 1842, నవంబర్ 15న జన్మించాడు. ఒక పేద కులీన కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. మొదటి నికోలస్ జారు కాలంలో ఉద్యోగం చేస్తున్న సందర్భంగా ఎదురైన కష్టాల గురించి తన తండ్రి చెప్పిన కథలు బాల మిహైలోవ్‌స్కీ మనస్సులో గాఢంగా నాటుకున్నాయి. మిహైలోవ్‌స్కీ సెకండరీ స్కూల్లో ఫోర్త్‌ఫారమ్ చదువుతుండగా తండ్రి చనిపోయాడు. దానితో సెయింట్ పీటర్‌బర్గ్‌లో బంధువుల ఇంట పెంపకానికి వెళ్లాడు. అయితే బంధువులు మిహైలోవ్‌స్కీ పట్ల అంతగా శ్రద్ధ కనపరిచేవారు కాదు. బంధువులు అక్కడొక మైనింగ్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేర్పారు. ఆ ఇన్‌స్టిట్యూట్ అధికారులు విద్యార్థులను "రాజద్రోహ" భావాల నుంచి (ఈ భావాలు రష్యన్ సమాజపు వివిధ విభాగాల్లో వ్యాప్తిలో ఉన్నాయి.) దూరంగా ఉంచేందుకు ప్రయత్నించారుగానీ వారివల్ల కాలేదు. ప్రభుత్వ వ్యతిరేక మ్యాగజైన్లు ఇన్‌స్టిట్యూట్‌లోకి రహస్యంగా తీసుకువెళ్లబడేవి. విద్యార్థి, యువజనులకు ఆరాధ్యులైన చెర్నిషేవ్ స్కీ, దొబ్రొత్యాబొవ్, కవి నెక్రాసెవ్ వంటివారి వ్యాసాలు ప్రచురింపబడుతుండే "సొవ్రెమేన్నిక్" మ్యాగజైన్‌ను మిహైలోవ్‌స్కీ చదవనారంభించాడు. 1861లో పీటర్‌బర్గ్‌లోని విశ్వవిద్యాలయంలో అల్లర్లు జరిగాయి. ఎంతోమంది విద్యార్థులను అరెస్ట్ చేశారు. విశ్వవిద్యాలయాన్నీ మూసివేశారు. దీనితో ఇతర విద్యాసంస్థలు ఎంతగానో ప్రభావితమయ్యాయి. మైనింగ్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో కూడా విద్యార్థులకూ, ఉపాధ్యాయ సిబ్బందికీ మధ్య ఘర్షణ జరిగింది. మిహైలోవ్‌స్కీ విద్యార్థుల కార్యాచరణలో చురుకైన పాత్ర వహించడమేగాక, విద్యార్థుల అల్లర్లలో కూడా భాగస్వామి అయ్యాడు. తరగతులకు గైరుహాజరయ్యేవాడు. పరీక్షల్లో సమాధానాలు చెప్పడానికి నిరాకరించేవాడు. చివరకు ఆయన 1863లో ఇన్‌స్టిట్యూట్ వదిలిపెట్టాడు. కొంతకాలంపాటు పీటర్‌బర్గ్ విశ్వవిద్యాలయ న్యాయశాస్త్ర విభాగంలో చేరడానికి సన్నాహాలు చేసుకున్నా సఫలీకృతం కాలేదు. ఆయన పూర్తిగా సాహిత్య కృషికి మళ్లాడు.

1859-1861 నాటి విప్లవ పరిస్థితి కారణంగా ఏర్పడిన గందరగోళం నుంచి రాచరిక ప్రభుత్వం అప్పుడే తేరుకొని అత్యంత అభివృద్ధి నిరోధక పథంలో ప్రవేశించిన తరుణంలో మిహైలోవ్‌స్కీ రాజకీయ రంగంలో ప్రవేశించాడు. ప్రభుత్వం ప్రగతిశీల శక్తుల మీద పెద్ద దెబ్బతీసింది. విప్లవకర బృందాలనూ, సంఘాలనూ అణచివేసి వాటి నాయకులను అరెస్టు చేసింది. అత్యుత్తమ వర్గ పత్రికలు మూసివేయబడినాయి. ఆ స్థితిలో సామాజిక ఉద్యమాన్ని తిరిగి పునర్జీవింపజేయడానికి ఏదైనా ఉందా అనిపించింది. అయితే 1860 దశకం చివరికి ప్రగతిశీల శక్తుల తిరిగి జాగృతి పొందడం ప్రారంభించాయి. విద్యార్థి ఉద్యమం తీవ్రతరమైంది. పత్రికలు పునరుజ్జీవం పొందాయి. ఈ క్రమంలో మిహైలోవ్‌స్కీ ఆలోచనలు కూడా వికసించాయి. ఆయన రాసిన తొలి విమర్శనాత్మక వ్యాసం 1860లో "రస్స్వెత్" (ఉషస్సు) అనే పత్రికలో వెలువడింది. అప్పట్లో మిహైలోవ్‌స్కీ యొక్క ప్రాపంచిక దృక్పథం ఆయన రాజకీయ వ్యాసాల్లోనూ, స్త్రీల సమస్యపై వివరణల్లోనూ అత్యంత సమగ్రంగా వెల్లడైంది. ఈ రచనలు 1863-1864 సంవత్సరాల్లో "సొవ్రెమేన్నొయెస్లోవా" (సమకాలిక పదం) అనే వార్తా పత్రికల్లోనూ, "రూస్" (రష్యా), "యాకూర్" (లంగరు) అనే వార్తాపత్రికల్లోనూ ప్రచురణ అయ్యాయి. మిహైలోవ్‌స్కీ తనను చెర్నిషేవ్‌స్కీ అనుచరునిగా పరిగణించుకున్నాడు. మిహైలోవ్‌స్కీ ప్రపంచ దృక్పథం రూపొందే నాటికే చెర్నిషేవ్‌స్కీని అరెస్టు చేశారు. అయినా ఆయన రచనలు మిహైలోవ్‌స్కీ మీద ఎంతగానో ప్రభావం చూపాయి. తన సాహిత్య కృషి పొడవునా చెర్నిషేవ్‌స్కీ స్మృతిని గౌరవించి, విమర్శకుల, ఛాందసుల దాడులనుంచి ఆయనను సమర్థించాడు. 1965-1967 కాలంలో మిహైలోవ్‌స్కీ విప్లవశక్తులతోనూ, సంఘాలతోనూ సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకున్నాడు. ఈ దశలో ఆయన చాలా మ్యాగజైన్లలో పనిచేశాడు.

"సొవ్రెమేన్నిక్" ఆ యుగపు ప్రగతిశీల ఆదర్శాలను వ్యక్తం చేస్తూ పాఠకులను తనవైపు ఆకర్షించుకుంది. 1869లో మిహై

(మిగతా 35వ పేజీలో)

లోపలి పేజీల్లో...

సంపాదక వర్గం

పాటూరు రామయ్య (సంపాదకులు)
ఎస్.వెంకట్రావు (వర్కింగ్ ఎడిటర్)
కొరటాల సత్యనారాయణ
డా. వై. రాధాకృష్ణమూర్తి

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరుఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు : బి.వి.రాఘవులు
సంపాదకులు : పాటూరు రామయ్య
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
1-1-60/2, ఆర్టీసీ క్రాస్ రోడ్స్,
హైదరాబాద్ -20
ఫోన్ : ఎడిటోరియల్ 27665420, 27663761
మేనేజర్: 27673787 ఫ్యాక్స్ : 27639921
EMail: : marxist@cpimap.com
Visit cpi(m) site at : cpim.org

పోయేదెక్కువ వచ్చేది తక్కువ !

హాంగ్ కాంగ్‌లో గత నెల జరిగిన డబ్ల్యుటిఓ మంత్రిత్వ స్థాయి సమావేశం ఎవరికేం ఇచ్చిందని తరచి చూస్తే తేలేదొక్కటే: సమావేశంలో కుదిరిన ఒప్పందం వల్ల భారత దేశానికి లభించేది తక్కువ, దేశం నష్టపోయేది మాత్రం చాలా ఎక్కువ. మనదేశానికే కాదు మొత్తం వర్ధమాన దేశాలకు ఈ సమావేశాల వల్ల అదనంగా ఒనగూడేదేమీ లేకపోగా వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాల్లో ఆ దేశాలు కొల్పోయేది మాత్రం అధికంగా ఉంటుందని నిపుణులు వెలిబుచ్చుతున్న అభిప్రాయం. దీని వల్ల అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు మాత్రం బాగా లాభపడతాయి. డబ్ల్యుటిఓ చర్చలంటేనే ఇచ్చిపుచ్చుకోవడం. కాకపోతే సంస్థ ఏర్పడినప్పటినుండి ధనిక దేశాల వరస 'మీఇంటికొస్తే ఏమిస్తావ్, మా ఇంటికొస్తే ఏం తెస్తావ్' అన్న చందంగానే ఉంది. ఇన్నేళ్లలో వర్ధమాన దేశాలు ధనిక దేశాలకు ఇవ్వడమే గాని ధనిక దేశాలు వర్ధమాన దేశాలకు ఇచ్చింది ఏమీలేదు. ఇప్పుడు హాంగ్ కాంగ్ సమావేశాల్లో కూడా అందుకు భిన్నంగా ఏం జరగలేదు. ఈసారి భారత్, బ్రెజిల్ వంటి దేశాల నాయకత్వంలో వర్ధమాన దేశాలన్నీ ఐక్యంగా నిలబడి జి-110 అనే బృహత్ కూటమి కట్టి అనేక రాయితీలు సాధించుకున్నాయని మన వాణిజ్య శాఖ మంత్రి కమల నాథ్ గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవంగా జరిగింది దీనికి భిన్నం. ధనిక దేశాలు, ముఖ్యంగా ఇయు దేశాలు 2013 నాటికి వ్యవసాయ సబ్సిడీలు తగ్గించుకోడానికి అంగీకరించాయని, ఇది వర్ధమాన దేశాల విజయమని ప్రచారం చేస్తున్నారు. కాని నిజానికి గత ఒప్పందం ప్రకారం అవి 2005 నాటికే సబ్సిడీలు ఎత్తేయాల్సింది. అలా జరగలేదెందుకని వాటిని నిలదీయాల్సిందిపోయి ఇప్పుడు మరో 8 ఏళ్లు పొడించుకోడానికి వర్ధమాన దేశాలు అంగీకరించినట్లయింది. పైగా డబ్ల్యుటిఓ ఒప్పందంతో పనిలేకుండానే 2013 నాటికి ఎగుమతి సబ్సిడీలు ఎత్తేయాలని ఇయు దేశాల మధ్య గతంలోనే ఒప్పందం వుంది. అందువల్ల ఆ దేశాలు వర్ధమాన దేశాకు ప్రత్యేకంగా రాయితీలు ఇచ్చాయనడం వాస్తవం కాదు. దీనికి మారుగా వర్ధమాన దేశాలు పారిశ్రామిక వస్తువుల దిగుమతులపై సుంకాలు తగ్గించడానికి, సర్వీసు రంగాన్ని బహుళజాతి కంపెనీలకు తెరవడానికి అంగీకరించాయి. ఈ చర్యల వల్ల వర్ధమాన దేశాల్లోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది శ్రామికులకు ఉపాధిపోతుంది. అంటే ఇప్పుడు వ్యవసాయ రంగానికి వచ్చిన సంక్షోభం పారిశ్రామికరంగానికి కూడా పాకుతుందన్నమాట. డబ్ల్యుటిఓ ఒప్పందం వల్ల భారత దేశం తన చిల్లర వ్యాపార రంగంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతిస్తే దేశంలో చిన్న వ్యాపారాలు మూతఫడి వాటి మీద ఆధారపడిన 4 కోట్లమంది నిరుద్యోగులవుతారు. సర్వీసు రంగాన్ని విదేశీ సంస్థలకు తెరిస్తే మన దేశ ఆర్ధిక వ్యవస్థ మరింత ప్రమాదంలో పడుతుంది. అందువల్ల ఇన్ని విధాలా అనర్ధ దాయకమైన డబ్ల్యుటిఓ ఒప్పందం విషయంలో కేంద్ర ప్రభుత్వం హాంగ్ కాంగ్‌లో రాజీ పడిపోయింది. ధనిక దేశాలు బిజినెస్ ప్రాసెసింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కొన్ని ఇస్తామని ప్రలోభపెట్టే సరికి కమల్ నాథ్ బృందం అదే పదివేలనుకుని మన దేశ ప్రజల ప్రయోజనాలనూ, ఇతర వర్ధమాన దేశాల ప్రయోజనాలనూ తాకట్టు పెట్టేసింది. హానికరమైన ఈ రాజీధోరణిని వ్యతిరేకించాలి. ఒప్పందంలోని ప్రజావ్యతిరేక నిబంధనలకు వ్యతిరేకంగా భారత దేశం నిలిచేట్లు ప్రజా ఉద్యమం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి చేయడమొక్కటే ఈ ప్రమాదం నుండి బయటపడే మార్గం.

చందా వివరాలు

విడిపత్రిక : రు.5.. సంవత్సర చందా : రు.60
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

చిరునామా

మార్క్సిస్టు
(సైద్ధాంతిక మాసపత్రిక)
వీధి నెం1, ఆశోక్‌నగర్,
హైదరాబాద్-20

రాష్ట్రప్రభుత్వ ఆరోగ్య సంస్కరణలు

ఒక పరిశీలన

డా॥ వై. రాధాకృష్ణ మూర్తి

ఆరోగ్యశాఖామంత్రి రోశయ్య వివరణపత్రంలో "ప్రజలకు మెరుగైన వైద్యాన్ని, ఆరోగ్య సంరక్షణను అందించేందుకు ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తోంది. ఈ సంస్కరణల ప్రక్రియలో భాగంగా కొన్ని చర్యలు ఇప్పటికే తీసుకోవడమైంది. మరికొన్ని పరిశీలనలో ఉన్నాయి" అంటూనే కొన్ని నిర్ణయాలుగానే ప్రకటించేశారు. ఇది వివరణపత్రంలాకాక అస్పష్ట పత్రంగా వుంది. నర్మగర్భమైన వాక్యాలతో నిండివుంది.

నవంబరు మూడో వారంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ వైద్యమంత్రిత్వశాఖ ఒక పత్రాన్ని (చర్చకు) విడుదల చేసింది. చాలా వివరాలతో ఆరు విభాగాలుగా ఆ పత్రం వుంది. ప్రస్తుతం ఉన్న వైద్యరంగ సమస్యల్ని విశ్లేషిస్తూ తమ మనసులో వున్న కొన్ని పరిష్కార మార్గాలను సూచించింది. (దీన్ని ప్రధానపత్రం అందాం) దానిపై ప్రభుత్వం అసెంబ్లీలోని వివిధ పక్షాల నాయకులతో చర్చించింది. కానీ బయట ప్రజా సంఘాలతో, వైద్యరంగ నిపుణులతో, మెడికల్ అసోసియేషన్‌తోగానీ లోతుగా చర్చించిన దాఖలాలులేవు. మీడియాలోకూడా ఈ విషయంపై విశ్లేషణలు, సూచనలతో కూడిన వార్తలుగాని, వ్యాసాలుగాని రాలేదు.

అయితే గత నెల 19న వైద్యశాఖా మంత్రి కొణిజేటి రోశయ్య దీనిపై ఒక వివరణ పత్రం విడుదల చేశారు. అందులో కొన్ని స్థూల విషయాలు ఇచ్చారు. వాటిలో 1. తాము సేకరించదలుచుకున్న నిధులు 2. సిబ్బంది, ఖాళీలను భర్తీ చేసే సదుద్దేశం 3. బోధనా సుపత్రుల్లో నిపుణులను సమకూర్చుకోవడం 4. ప్రభుత్వ డాక్టర్లకు, ప్రయివేటు ప్రాక్టీసును అనుమతించడం 5. పిజి సీట్లలో సర్వీసు డాక్టర్ల కోటా పెంచడం 6. వైద్య, ఆరోగ్య శాఖల విభజన ప్రతిపాదనలు. 7. ప్రయివేటు ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ మొదలైన అంశాలున్నాయి.

ప్రజల సంక్షేమానికి ఆరోగ్యం ఒక ప్రధాన అవసరమని, ఆర్థిక ప్రగతికి ప్రజారోగ్యం కీలకాంశమని డబ్ల్యుహెచ్ఒ, యునిసెఫ్, అమర్త్యసేన్ లాంటి ప్రముఖ ఆర్థిక సామాజిక వేత్తలు నెత్తిన నోరు కొట్టుకుని ఉద్బోధిస్తున్నారు. సర్ జోసెఫ్ కమిటీ మన దేశంలోని వైద్యరంగాన్ని అభివృద్ధి చేయడానికి కొన్ని మౌలిక ప్రతిపాదనలు చేసి 60 సంవత్సరాలు కావస్తోంది. 1983లో ఒకసారి, తిరిగి 2002లో ఒకసారి జాతీయ వైద్య ఆరోగ్య విధానపత్రాలు తయారు చేయబడ్డాయి. మన రాష్ట్రంలో చెన్నారెడ్డి ప్రభుత్వంలో ఒకసారి, తరువాత జనార్దనరెడ్డి ప్రభుత్వంలో, తిరిగి టిడిపి ప్రభుత్వంలో కొన్ని నూతన మార్పులను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా 1997 నుంచి ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన కొన్ని పనులతో పాటు బ్యాంకు ఆదేశించిన విధానాలను కూడా ప్రవేశపెట్టారు. వీటిపైన 2003-2004 సంవత్సరాల్లో జూనియర్ డాక్టర్లు చేపట్టిన రాష్ట్రవ్యాపిత ఆందోళన వైద్య, ఆరోగ్య రంగ సమస్యలను తిరిగి చర్చలోకి తీసుకు వచ్చింది. ప్రస్తుతం 2005లో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ కొన్ని ఆలోచనలతో తిరిగి ముందుకు వచ్చింది.

ఇప్పటి వరకు ఎన్ని మార్పులు, చేర్పులు చేసినా స్థూలంగా ప్రజారోగ్య సూచికలలో గణనీయమైన మార్పుతీసుకురాలేదు. ఇప్పటికీ ప్రతివెయ్యి జననాలకు 40 మంది బిడ్డలు పుట్టిన 4 వారాలలోపే చనిపోతున్నారు. సంవత్సరం నిండకుండా వెయ్యికి 62మంది, 5 సంవత్సరాలు నిండకుండా 87మంది చనిపోతున్నారు. సాధారణ వ్యాధుల సంఖ్యలో పెద్దగా మార్పేమీలేదు. దేశంలో కోటిన్నర మందికి పైగా టిబి వ్యాధితో, 20 లక్షల మంది మలేరియా వ్యాధితో బాధపడుతున్నారు. అతిసార వ్యాధి, జపనీస్ ఎన్‌సెఫలిటీస్, కాలాఅజార్ లాంటి వ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి. ఇక కొత్తగా వస్తున్న హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి బారినపడ్డ రోగులసంఖ్య 50 లక్షలు దాటింది. 1978నాడు అల్మాఆటాలో ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీలో తీసుకున్న "2000 నాటికి అందరికీ ఆరోగ్యం" అన్న నిర్ణయం ఈ నాటికీ అమలుకాలేదు.

మరొకవైపు మనదేశంలో తయారవుతున్న డాక్టర్లసంఖ్య తక్కువేమీ కాదు. ఇప్పటికే ఆధునిక వైద్యులసంఖ్య దేశంలో ఐదు లక్షల నాలుగువేలు వుంది. (అమెరికాలో ఈ సంఖ్య 8లక్షల 40 వేలు) దేశం మొత్తంమీదున్న 250 వైద్య కళాశాలలనుంచి ఏటా 30వేల మంది వైద్యులు బయటకు వస్తున్నారు. అయితే మన వైద్యుల్లో 12శాతం అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా, కెనడా దేశాల్లో పనిచేస్తున్నారు. అమెరికాలోని వైద్యులలో 5శాతం భారతీయ వైద్యులే. ఇంగ్లాండులో 11శాతం, ఆస్ట్రేలియాలో 4శాతం, కెనడాలో 2శాతం ఉన్నారు. అయినా ప్రజలు వైద్యుల నిష్పత్తి మనదేశంలో ఆశించినంతగా లేదు. అమెరికాలో ప్రతి పదివేల మంది

రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

జనాభాకు 35మంది వైద్యులుంటే, మనదేశంలో 5.2 ఉన్నారు. ప్రత్యామ్నాయ విధాన వైద్యులు, శిక్షణలేని వైద్యుల సంఖ్య పరిగణనలోకి తీసుకోలేదు. అలాగే ఆసుపత్రి పడకల సంఖ్య, నర్సుల నిష్పత్తి తగినంతగా లేదు. అతిసంపన్న దేశమైన అమెరికాతో పోల్చడం సరికాక పోవచ్చు. కానీ అతి చిన్నదేశమైన శ్రీలంక, అతి పెద్ద జనాభా కలిగిన మన పొరుగు దేశాలతో పోల్చినా మన సంఖ్య చాలా తక్కువే.

> “ రాష్ట్రంలో గ్రామస్థాయిలో ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా శిథిలమై పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య కార్యక్రమం అంటూ ఏదీ జరగటంలేదు. ప్రపంచబ్యాంకు సహాయంతో చేపట్టిన ప్రాజెక్టుల తరువాత ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వైద్య సంస్కరణలు పరిశీలించాల్సి ఉంది. ”

ఆరోగ్యం అంటే కేవలం జబ్బు లేక పోవడమేకాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. శారీరక, మానసిక, సామాజిక స్వస్థత ఆరోగ్యానికి నిర్వచనంగా చెబుతోంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వాల బాధ్యతగా పలు అంతర్జాతీయ సంస్థలు, మన రాజ్యాంగం కూడా చెబుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యరంగ సంస్కరణల పత్రం ఒకటి రెండు విషయాలు స్పష్టంగా చెప్పింది. 1. గ్రామస్థాయిలోనూ, కమ్యూనిటీ స్థాయిలోనూ ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా శిథిలమైపోయింది. 2. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య కార్యక్రమం అంటూ ఏదీ జరగటం లేదు. 3. ప్రపంచబ్యాంకు సహాయంతో చేపట్టిన ప్రాజెక్టుల తరువాత ప్రజారోగ్య వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో నూతన ఆలోచనలను ప్రభుత్వపత్రం ఆరు అధ్యాయాలుగా విభజించింది. ఒక్కొక్కటి వేరుగా పరిశీలిద్దాం.

1. బోధనా ఆసుపత్రులు : బోధనా ఆసుపత్రులలో 1,024 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగాలకోసం ప్రకటించినా చేరడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. అందువల్ల మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) మన రాష్ట్ర వైద్య కళాశాలల్లో ఉన్న సీట్లను తగ్గిస్తూ నిర్ణయించింది. ఈ పరిస్థితి నుంచి బయట పడటానికి బోధనా సిబ్బంది వేతనాలను యుజిసి వేతనాల స్థాయిలోగానీ నిమ్స్ ఆసుపత్రి స్థాయికిగానీ పెంచాలని సూచించారు. పదవీ విరమణ చేసిన బోధనా సిబ్బందికి పూర్తి వేతనంతో 65 సంవత్సరాల వయస్సు వరకు తీసుకోవాలని, రెగ్యులర్ సిబ్బంది పదవీ విరమణ వయస్సును 65కు పెంచాలని సూచించింది. ఈ బోధనా ఆసుపత్రులకు స్వయం ప్రతిపత్తి స్థాయిని కల్పించాలన్న సూచనవుంది.

బోధనా సిబ్బంది పోస్టుల సంఖ్య ఇంకా పెంచవలసిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించినట్లయితే, వేతన స్కేళ్లు యుజిసివి కాక మన నిమ్స్ ఆసుపత్రిలో ఇస్తున్న స్కేళ్లు అమలు చేయడం సబబుగా ఉంటుంది. దీనివల్ల అదనపు ఆర్థిక భారం సంవత్సరానికి పదికోట్లకు మించదు. కానీ సిబ్బందికి కొంతమేర సంతృప్తి కలిగిస్తుంది. ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో అమలవుతున్న మాదిరిగానే ఇతర సదుపాయా లను నిర్ణయించాలి. పనిగంటలను కూడా అదే పద్ధతిని అనుసరించాలి. అక్కడి మాదిరే ప్రయి వేట్ ప్రాక్టీస్ నిషేధించవచ్చు. కాలేజీ వైద్య విద్య పూర్తికాగానే కనీసం రెండు సంవత్సరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసిన తరువాతే డిగ్రీ ప్రధానం చేసేనిర్ణయం మంచిది. అలాగే పిజి విద్యార్థులకు కూడా 3 సంవత్సరాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సర్వీసు నిర్బంధం చేయవచ్చు. బోధనాసుపత్రుల్లో జూనియర్, సీనియర్, రెసిడెన్సియల్ పద్ధతి ఆహ్వానిం చతగిందే. పత్రంలో సూచించినట్లు వారికి క్వార్టర్లు ఏర్పాటుచేసి నెలకు 15 వేలు, భత్యం కూడా ఏర్పాటు చేయడం మంచిదే. పిజి సీట్ల కేటాయింపును సర్వీసులో ఉన్న డాక్టర్లకు 50 శాతానికి పెంచడం కూడా మంచి సూచనే. ఐతే ఈ ఆసుపత్రులకు కావాల్సిన వ్యాధి నిర్ధారణ పరికరాలను వెంటనే నమకూర్చాలి. ఇందులో ప్రయివేట్ భాగస్వామ్యం చర్చనీయాంశం కావచ్చు. తాత్కాలికంగా ప్రభుత్వ పెట్టుబడి తగ్గినా కాలక్రమంలో అనేక దుష్పరిణామాలు రావచ్చు. ఈ ఆసుపత్రులకు స్వయం ప్రతిపత్తి కల్పించడంకానీ, వైద్యులకు ప్రయివేటు ప్రాక్టీసు అనుమతించడం కాని తగదు. ఏ రకమైన యూజర్ ఛార్జీలు వసూలు చేయడం పనికిరాదు.

ఇబ్బడి ముబ్బడిగా ప్రయివేటు మెడికల్ కాలేజీలను అనుమతించే బదులు ప్రతి జిల్లా కేంద్ర అసుపత్రి స్థాయిని– పడకల సంఖ్యతో సహా పెంచి అతి తక్కువ ఖర్చుతో జిల్లాకు ఒక వైద్య కళాశాలను ప్రభుత్వ రంగంలోనే ఏర్పర్చవచ్చు.

2. వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు : ప్రభుత్వ పత్రంలో ప్రస్తుతం 640 వైద్యుల పోస్టులు, 426 నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. కొన్ని మార్పులతో ఈ ఖాళీలను భర్తీ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తుంది. కాని ఇక్కడ రెండు విషయాలు గమనించాలి. మొదటిది, జిల్లా ఆసుపత్రులలో రోగుల రద్దీని గమనిస్తే తొమ్మిది స్పెషాలిటీలు, 13 మంది వైద్యులు ఏ మాత్రం సరిపోరు. ఎముకల వైద్యులు, ఎనస్థీషియన్ వైద్యులు, శస్త్ర వైద్యులు ప్రతి ఆసుపత్రికి ఇద్దరు చొప్పున అవసరం ఉంది. రెండవది, పెరుగుతున్న ఓపి సంఖ్యగాని, పడకల సంఖ్యగాని చూసినప్పుడు రోగి, వైద్యుల నిష్పత్తిగాని, లేక రోగి నర్సుల నిష్పత్తిగాని ఇప్పుడున్న సంఖ్యకు సరిపోదు. గణనీయంగా పోస్టులను పెంచవల్సివుంది. అలాగే సహాయ సిబ్బంది (పారామెడికల్ స్టాఫ్)ను పెంచాల్సివుంది. సమాంతర ఓపిలు (పార్లల్ ఓపీస్) పే క్లీనిక్‌లు ఎంత మాత్రం సమర్థనీయం కాదు. ఐచ్ఛికంగా అన్ని ఖర్చులు భరించడానికి ముందుకు వస్తే వారికి పే ఇన్‌వార్డ్స్ ఏర్పాటు ఆలోచించవచ్చును. జిల్లా ఆసుపత్రిలో కూడా పరీక్షా పరికరాలను పూర్తిగా సమకూర్చవల్సిన అవసరం ఉన్నది. ప్రయివేటు వారిపై ఆధారపడటం అనేక సమస్యలకు దారితీస్తుంది. ఆసుపత్రులకు పడకల సంఖ్యనుబట్టి నిధులను గణనీయంగా పెంచవల్సిన అవసరం ఉన్నది.

3. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు : 1980లో నిపుణుల కమిటీ ఇచ్చిన రిపోర్టు ప్రకారం ప్రతి 30 వేల జనాభాకు ఒక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (పిహెచ్‌సి) ఉండాలి. మొత్తం సంఖ్య 1570 ఉండాలి. ప్రతి 6 పడకలకూ ఒక ఎంబిబిఎస్, ఒక ఆయుష్ వైద్యుడు ఉండాలి. ప్రతి లక్షమంది జనాభాకు ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఉండాలి. ఇది నలుగురు స్పెషలిస్టులు, ఇద్దరు ఎంబిబిఎస్‌లతో

> **" ఆరోగ్యం అంటే కేవలం జబ్బు లేకపోవడమే కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. శారీరక, మానసిక, సామాజిక స్వస్థత ఆరోగ్యానికి నిర్వచనంగా చెబుతోంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత అని పలు అంతర్జాతీయ సంస్థలు, మన రాజ్యాంగం కూడా చెబుతున్నాయి. "**

30 పడకలతో ఉండాలి. ఇలాంటివి 456 ఉండాలి. ప్రస్తుతం 117 మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం వీటి సంఖ్యను ప్రస్తుతం 250కు పెంచాలని ఆలోచిస్తోంది. అన్వైబుల్ అనే పేరుతో కొన్ని పిహెచ్‌సిలను రద్దుచేయాలని, దగ్గరగా ఉన్నవాటిని కలిపి వేయాలని ఆలోచిస్తున్నది. ప్రస్తుతం 727 వైద్యుల పోస్టులను ఖాళీగా ఉన్నట్లు పత్రం చెబుతుంది. పత్రంలో లేకపోయినా కొన్ని పిహెచ్‌సిలను మినహా ప్రయివేటుధార్మిక సంస్థలకు స్వచ్ఛంద సంస్థలకు దత్తత ఇవ్వాలనే ఆలోచన ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.

వైద్య ఆరోగ్య రంగానికి ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ వెన్నుముక లాంటిది. ముందు ఈ వ్యవస్థను పటిష్టపరిస్తే తప్ప గ్రామీణ పేదల ఆరోగ్య అవసరాలు తీరవు. అందుచేత ప్రభుత్వమూ ప్రజలూ కూడా దీనిపై దృష్టిని కేంద్రీకరించాలి. 1. పిహెచ్‌సిల సంఖ్య 30 వేల జనాభాకు ఒకటిగా ఉండాలి. అలాగే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు కూడా లక్షజనాభాకు ఉండాలి. మూసి వేతలు, కలపడాలు దత్తత ఇవ్వడాలు ఎట్టిపరిస్థితుల్లోను సమర్ధనీయం కాదు. నిజానికి నిపుణుల సూచన ప్రకారం పిహెచ్‌సిల సంఖ్య 18 వందలపై చిల్లర ఉండాలి. 2. ప్రతి పిహెచ్‌సికి ఒక పురుష ఎంబిబిఎస్, మహిళా ఎంబిబిఎస్, ఒక ఆయుష్ డాక్టర్ ఉండాలి. వీరు కాక వ్యాధి నిరోధక విభాగం (ప్రివెంటివ్) కేంద్ర పథకాలు కుటుంబ సంక్షేమం, మొబైల్ సర్వీసులు ఈ నాలుగు విభాగాలను చూడడానికి ప్రత్యేక వైద్యాధికారి అవసరం ఎంతైనా ఉంది. 3. అలాగే ప్రతి పిహెచ్‌సికి నర్సింగ్ అండ్ పారా మెడికల్ స్టాఫ్‌ను తగిన సంఖ్యలో సమకూర్చాలి. 4. పిహెచ్‌సికి పోస్ట్ చేసే వైద్యులకు కనీసం 3 మాసాలు గ్రామీణ పరిస్థితుల్లో కనీస వైద్య పరికరాలు లేకుండా వైద్యం చేయడానికి తగిన శిక్షణ ఇవ్వాలి. వారికి పాలనా సంబంధమైన శిక్షణ కూడా అవసరం. 5. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇతర పిహెచ్‌సి సిబ్బందిపై అజామాయిషీ పూర్తిగా లేదు. అందువలన ప్రజలకు పిహెచ్‌సి లపై ఏమాత్రం విశ్వాసం కలగడం లేదు. ప్రతిచిన్న వైద్య అవసరానికీ జిల్లా ఆసుపత్రులకు వెళ్లడం జరుగుతోంది. దీనివల్ల జిల్లా ఆసుపత్రు లపై అనవసర పనిభారం పెరుగుతోంది. అందువల్ల పిహెచ్‌సి సిబ్బందిపై అజమాయిషీ ఉండాలి. స్థానిక సర్పంచ్‌లు, ఎంపిపి, డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓతో కూడిన ఒక కమిటీకి ఈ అజామాయిషీ ఉండాలి. 6. పిహెచ్‌సిలకు ప్రస్తుత కేటాయింపులు సరిపోవడం లేదు. గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉంది. 7. ఇంతకు ముందు సూచించినట్లు డిగ్రీ ప్రధానం చేసే ముందు ఎంబిబిఎస్‌లకు, పిజిలకు కూడా పిహెచ్‌సి సర్వీసు తప్పనిసరి చేయడం వలన పిహెచ్‌సిల నిర్వహణ మెరుగు పడుతుంది. 8. ప్రతి పిహెచ్‌సి కేంద్రంలో వైద్యులకు, సిబ్బందికి, ఆసుపత్రికి అన్ని సదుపాయాలతో పక్కా భవనాలు ఏర్పాటు చేయడం వల్ల మొత్తం సిబ్బంది అక్కడే ఉండి పనిచేయడానికి అవకాశాలు మెరుగు పడతాయి. 9. పిహెచ్‌సి సిబ్బందికి సాధారణ వేతనాలపై 30 నుండి 50 శాతం పెంచడం వలన కూడా మంచి ఫలితాలు ఉంటాయి. పత్రంలో సూచించినట్లు పిహెచ్‌సిలను పట్టణాల నుంచే దూరాన్ని బట్టి 4 కేటగిరీలుగా విభజించడం పూర్తిగా అనాలోచిత చర్య.

4. విలేజ్ హెల్త్ యూనిట్: 1) ప్రభుత్వ పత్రంలో దీని గురించిన చర్చ చాలా ఉంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేషనల్ రూరల్ హెల్త్ మిషన్ (జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ 2005–2012)ను కూడా కొంత వరకు దృష్టిలో ఉంచుకున్నట్లు కనిపిస్తోంది. మన రాష్ట్రంలో 23 వేల గ్రామాలున్నాయి. ఇవి కాక 35 వేల హ్యాబిటేషన్లున్నాయి. ఇప్పుడున్న 1570 పిహెచ్‌సిలు 12,225 సబ్ సెంటర్లు కూడా 24 వేల హ్యాబిటేషన్స్‌కు అందుబాటులో ఉండవని పత్రం చెబుతుంది. 2) శిక్షణ పొందిన డాక్టర్లు పది వేల జనాభాకు తక్కువగా వున్న గ్రామాల్లో స్థిరపడడానికి ఇష్టపడరు. కానీ 80 శాతం గ్రామాలు 2 వేల లోపు జనాభా ఉన్నవే. ఈ నేపథ్యంలో ప్రభుత్వపత్రం కొన్ని సూచనలు చేసింది. ప్రతి గ్రామంలో వెయ్యి మందిజనాభాకు ఒక గ్రామీణ ఆరోగ్య యూనిట్‌ను ఏర్పర్చాలని ఒక ప్రతిపాదన. ఆ యూనిట్‌లో కనీస శిక్షణ పొందిన ఒక గ్రామీణ వైద్యుడు, ఒక ప్రజారోగ్య కార్యకర్త, స్త్రీ సంక్షేమ కార్యకర్త ఉండాలి. అయితే 1. గ్రామీణ వైద్యుడుగా గ్రామాలలో ఇంతకు ముందే స్థిరపడిన గ్రామీణ వైద్యుడిని (ఆర్ఎంపి) తీసుకుంటారు. ఇతడికి శిక్షణనిస్తారు. ఇతని ఖర్చు గ్రామస్తులే భరిస్తారు. 2. ప్రజారోగ్య కార్యకర్త ప్రభుత్వమే నియమించినా, వేతనం గ్రామీణ ఉపాధిహామీ పథకం నుండి లభిస్తుంది. 3. ఇప్పుడున్న అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో సూచించిన మహిళారోగ్య వాలెంటీర్ (ఆషా), స్త్రీ శిశు సంక్షేమ కార్యకర్త ఉంటారు. ఈ ముగ్గురు కార్యకర్తలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక బాధ్యతలను వహించదు అన్న అర్థం స్ఫురిస్తుంది. ఈ భారమంతా ప్రజలమీద, కేంద్రంమీద మోపే ప్రయత్నంగా తోస్తోంది. ఇదే సందర్భంలో పత్రం యొక్క 22వ పేజీలో ఒక ఆసక్తికరమైన వాక్యంవుంది. "అంగన్‌వాడీ కార్యకర్త, ఎఎన్ఎం యొక్క అవసరం తీరిపోతోందని". అంటే వీరి ఉద్యోగాలను కుదించే విషయంలో ప్రభుత్వం సందిగ్ధంలో ఉన్నట్లు అనిపిస్తుంది. వారికి ఇంతకు ముందు ఇస్తున్న వేతనాలతో ఈ పథకంలో ఇమడ్చాలే తప్ప ఉద్వాసన పలికే ఆలోచనలు ఉంటే అవి ప్రమాదకరమైనవి. **గ్రామీణ ఆరోగ్య యూనిట్ ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒకటి ఏర్పాటు చేసే ఆలోచన చాలా మంచిది. ఒది ఒక (కాన్సెప్ట్)గా లోతుగా ఆలోచించవలసివుంది. దీనిపై కొంత విస్తృతమైన చర్చకూడా వివిధ స్థాయిల్లో చేయవలసివుంది. కానీ ఆర్థిక బాధ్యతవహించడానికి సిద్ధపడకుండా ఇలాంటి బృహత్‌పథకం కేవలం మిథ్యగానే మిగిలిపోతోంది.** అందుచేతనే రోశయ్య వివరణ పత్రంలో ఈ అంశాన్ని సంపూర్ణంగా విస్మరించారని భావిస్తున్నాను.

5. ఆయుష్ (దేశీయవైద్యం) :- ఇది

నూరుశాతం కేంద్ర ప్రభుత్వ పథకం. ప్రధానపత్రంలో సూచించినట్లు ఒప్పుడున్న 1039 డిస్పెన్సరీలస్థానే ప్రతి పిహెచ్‌సిలోనూ ఒక దేశీయ వైద్య పోస్టు కల్పించడం మంచిది. ఇప్పుడు సర్వీసులో ఉన్న వారితోపాటు అవసర మైన మేరకు కొత్తవారిని కూడా నియమించు కోవాలి.

ప్రతి జిల్లా కేంద్ర ఆసుపత్రిలోనూ, కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లోనూ ఒక దేశీయవైద్య స్పెషలిస్టును (పీజి) నియమించాలి. వారికి నాలుగైదు పడకలు కేటాయించవచ్చు. ప్రధాన పత్రంలో నూరు పడకల ఆయుర్వేద ఆసుపత్రి నిర్మించే ఉద్దేశం ఉన్నట్లు ప్రకటించారు. దీనికి కేరళరాష్ట్రం అనుభవాన్ని పరిగణలోనికి తీసుకోవచ్చు.

6.ప్రయివేటు ఆసుపత్రుల నియంత్రణ : దీన్ని గురించి ప్రధానపత్రంలో వివరణ వుంది. ఇటీవలనే శాసనసభలో తత్సంబంధ మైన బిల్లుకూడా హడావిడిగా ఆమోదించ బడింది. ఈ చట్టంలో అంశాలు ధృవీకరిస్తూ నియమనిబంధనలను తయారు చేసే ముందు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్‌తోనూ, ఇతర ప్రముఖ లైన సీనియర్ డాక్టర్లతోనూ చర్చించవలసిన అవసరంవుంది.

ప్రత్యేకించి రిజిస్ట్రేషన్, ఫీజుల క్రమబద్ధీ కరణ, సహాయకుల అర్హతలు వగైరా నిర్ణయించడంలో చాలా ఇబ్బందులు రావచ్చు. ఆచరణసాధ్యం కూడా కాకపోవచ్చు. ఆ పేరుతో ప్రతి జిల్లాకు మరొక అవినీతి గుమ్మాన్ని ఏర్పరిచినట్లవుతుంది. వీటన్నింటినీ మించి ఈనాడు బహుళ విమర్శలకు గురికాబడుతున్న కార్పొరేట్ రంగాన్ని క్రమబద్ధీకరించే అంశాన్ని పరిశీలించాలి. 1996లో శాసనసభ్యుల కమిటీ ఇచ్చిన నివేదిక, ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను దృష్టిలో ఉంచుకోవాలి.

7.ప్రయివేట్ మెడికల్ కళాశాలలు : వీటి తీరుతెన్నులపై కొంతకాలం క్రితం జూనియర్ డాక్టర్లు రెండు దఫాలుగా చేసిన ఆందోళన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. విషయం కోర్టుల దాకా వెళ్లింది. జస్టిస్ జీవన్ రెడ్డి కమిటీ లోతుగా అధ్యయనంచేసి కొన్ని సూచనలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా దీనిపై స్పందించింది. కానీ వైద్య శాఖామంత్రి రోశయ్య వినతిపత్రం దీనిపై భయంకరమైన మౌనం వహించింది. అందుకు మనం 'వివరణ' కోరాలి.

8.సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు : ఇప్పటికే మన రాష్ట్రంలో రెండు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు పని చేస్తున్నాయి. ఇటీవల మరొక రెండు ఆసుపత్రులు నిర్మించ బోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వైద్య విజ్ఞానం అతివేగంగా విస్తృతంగా పెరుగు తున్నది. అనేక వ్యాధులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అవసరమవుతోంది. మరొక వైపున ప్రజల ఆకాంక్షలూ పెరుగుతున్నాయి. ప్రత్యేక నైపుణ్యతతో కూడిన వైద్యం కోసం వారు ఎదురు చూస్తున్నారు. ఈ అవకాశాన్ని కార్పొరేట్ ఆసుపత్రులు దారుణంగా ఉపయోగించుకుంటు న్నాయి. ఈ పరిస్థితికి విరుగుడు ప్రభుత్వరంగం లో మరిన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఏర్పాటు చేయడమే. రాష్ట్రంలోని 24 జిల్లా ల్లోనూ ప్రతి నాలుగు జిల్లాలకు ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చొప్పున పెట్టి ప్రజలకు మేలైన ఆధునిక ఆరోగ్య సేవలు అందించి నట్లువుతుంది. అలాగే కార్పొరేట్ ఆసుపత్రులకు ముకుతాడు వేసినట్లవుతుంది. మన రాష్ట్ర జనాభాను దృష్టిలో ఉంచుకున్నా, పెరుగుతున్న మెడికల్ టూరిజం దృష్ట్యా ఈ విధంగా చేయటం మంచిది.

" రాష్ట్రంలోని 24 జిల్లాల్లోనూ ప్రతి నాలుగు జిల్లాలకు ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి చొప్పున పెట్టి ప్రజలకు మేలైన ఆధునిక ఆరోగ్య సేవలు అందించి నట్లువుతుంది. అలాగే కార్పొరేట్ ఆసువత్రులకు ముకుతాడు వేసినట్లవుతుంది. మన రాష్ట్ర జనాభాను దృష్టిలో ఉంచుకున్నా, పెరుగుతున్న మెడికల్ టూరిజం దృష్ట్యా ఈ విధంగా చేయటం మంచిది. "

ముగింపు : ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్యరంగ సంస్కరణల ప్రధానపత్రం (మెయిన్ డాక్యుమెంట్) లో అనేక విషయాలు చర్చించబడ్డాయి. కొన్ని ప్రతిపాదనలు, ఆలోచనలు విస్తృతమైన చర్చకోసం ఉదహరించబడ్డాయి. కానీ అంతిమంగా ఆరోగ్యశాఖామంత్రి రోశయ్య 'వివరణపత్రంలో' "ప్రజలకు మెరుగైన వైద్యాన్ని, ఆరోగ్య సంరక్షణను అందించేందుకు ప్రభుత్వం మార్గాలను అన్వేషిస్తోంది. ఈ సంస్కరణల ప్రక్రియలో భాగంగా కొన్ని చర్యలను ఇప్పటికే తీసుకోవడ మైంది. మరికొన్ని పరిశీలనలో ఉన్నాయి." అంటూనే కొన్ని నిర్ణయాలుగానే ప్రకటించేశారు.

ఇది వివరణపత్రంలాకాక అస్పష్ట పత్రంగానూవుంది. నర్మగర్భమైన వాక్యాల తోనూ నిండివుంది.

1. వారు వందకోట్ల రూపాయలు నాబార్డు నుంచి, 165 కోట్ల రూపాయలు హడ్కోనుంచి, 85కోట్ల రూపాయలు డిఎఫ్ఐడి నుంచి, కొంత అప్పుగా, మరికొంత గ్రాంటుగా తెస్తున్నామని చెప్పారు. దాతలనుండి కార్పొరేట్ సంస్థలనుండి విరాళాలు సేకరించేందుకు ప్రోత్సహిస్తామని కూడా సెలవిచ్చారు. బడ్జెట్‌లో కేటాయించిన 1825 కోట్లు సరిపోవన్న విషయాన్ని అంగీకరించారు. అప్పులు, గ్రాంట్లు, విరాళాల మాట ఎలావున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య వైద్య రంగాన్ని మెరుగుపరిచేందుకు రానున్న బడ్జెట్‌లోనే అధిక మొత్తాలను కేటా యించడం తప్పనిసరి.

2. వైద్యులు, నర్సులు, సహాయ సిబ్బందికి సంబంధించి ఇప్పుడున్న సంఖ్య ఏమాత్రం సరిపోదు. జనాభా-వైద్యుల నిష్పత్తి, పడ కలు-నర్సుల నిష్పత్తి వగైరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక అవసరాల మేరకు వారి సంఖ్యను పెంచవలసిందే.

3. వారికి వేతనాలు తదితర సదుపాయాలు, ఆకర్షణీయంగా ఉండేట్లు చూడాలి.

4. ఏర్పడుతున్న ఖాళీలను ప్రతి సంవత్స రం నియమబద్ధంగా నింపే ఏర్పాటు చేయాలి.

5. కాంట్రాక్టు ఉద్యోగాలకు (కన్సాలిడేటెడ్ పేతో) అవకాశం ఉండకూడదు. రెగ్యులర్ ఉద్యోగులనే నియమించాలి.

6. పిహెచ్‌సిలను ప్రయివేటు సంస్థలకు దత్తత ఇచ్చే ఆలోచన విరమించుకోవాలి. ఆసుపత్రి సర్వీసులను ప్రయివేటైజేషన్ చేసే ఆలోచ మానుకోవాలి. ప్రయివేట్, పబ్లిక్ భాగస్వామ్యం పేరుతో ప్రభుత్వ సర్వీసులను

(మిగతా 32వ పేజీలో)

ఉపాధిరహిత, ప్రమాదభరిత అభివృద్ధి!

అంతర్జాతీయ కార్మిక సంస్థ వెల్లడించిన వాస్తవాలు

కార్మిక మార్కెట్‌లోని 20 కీలకమైన సూచికల ఆధారంగా అధ్యయనం జరిగింది. దీని ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాల సంఖ్య, నాణ్యతలపై ఈ వ్యాసంలో పేర్కొన్న నిర్ధారణలకు వచ్చారు.

ప్రపంచీకరణ యుగంలో ఆర్థికాభివృద్ధి వల్ల కార్మికులకు ఒనగూడుతున్న ప్రయోజనం ఏమీ లేకపోగా వారికి హానికలిగించే అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని జెనీవాలోని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) పేర్కొంది. ఈ మేరకు 2005 డిసెంబర్ 9న ఒక నివేదిక విడుదల చేసింది. కార్మికులకు కొత్త ఉద్యోగాలు, ఉత్పాదకత పెరుగుదల, వేతనాల్లో మెరుగుదల, పేదరిక నిర్మూలన వంటి విషయాలకు సంబంధించి వివిధ ప్రాంతాలలో వివిధ రకాలైన ఫలితాలు కన్పించాయి. ప్రపంచ కార్మికుల్లో సగం మంది ఇప్పటికీ రోజుకు రెండు అమెరికన్ డాలర్లతో సమాన వేతనాన్ని సంపాదించలేకపోతున్నారని నివేదిక వెల్లడించింది. 'కార్మిక మార్కెట్‌లో కీలక సూచికలు' (కెఐఎల్‌ఎం) 4వ ఎడిషన్‌లో ఈ విషయాలు తెలిపారు. "విధానపరమైన నిర్ణయాలు తీసుకునే సందర్భంగా కార్మికులకు మంచి ఉద్యోగం, వారి ఆదాయావసరాలు అన్న విషయాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు" అని ఐఎల్‌ఓ డైరెక్టర్ జనరల్ జువాన్ సోమావియా చెప్పారు. "ప్రపంచవ్యాప్తంగా సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇప్పటివరకూ ప్రపంచీకరణ ఏ మాత్రం ఉపయోగపడం లేదు. ఈ పరిస్థితిని మార్చాల్సి ఉంది. మంచి ఉద్యోగం అనేది అందరి ఆర్థిక, సాంఘిక విధానాలలో కేంద్ర లక్ష్యంగా ఉండాలని అనేక మంది నాయకులు ఇప్పటికే చెబుతున్న సంగతి తెల్సిందే, ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ నివేదిక ఒక సాధనంగా ఉంటుంది" అని సోమావియా పేర్కొన్నారు.

ఆసియా ఆర్థిక విస్తరణవల్ల కొన్ని ప్రాంతాల్లో ఉద్యోగాలు పెరిగాయని, జీవన స్థితిగతులు మెరుగైనాయని నివేదిక పేర్కొంది. అయితే ఆఫ్రికా, లాటిన్ అమెరికాల్లోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా వ్యవసాయరంగంలో కార్మికుల దుర్భరస్థితి పెరుగుతోంది. లక్షలాది మంది కార్మికులను దారిద్ర్యరేఖ నుంచి పైకి తెచ్చేందుకు అవసరమైన ఆదాయమిచ్చే కొత్త ఉద్యోగావకాశాలు అరుదుగానే అభిస్తున్నాయని కెఐఎల్‌ఎం పేర్కొంది. పనిచేసే స్త్రీ, పురుషుల్లో రోజుకు రెండు డాలర్ల కంటే తక్కువ సంపాదించేవారి సంఖ్య 138 కోట్లని, ఇది గత దశాబ్దకాలంగా తగ్గడం లేదని నివేదిక తెలిపింది. ప్రపంచం మొత్తమ్మీద రోజు ఆదాయం రెండు డాలర్లు దాటని కార్మికులు 50 శాతం ఉన్నారని, 1994 లో ఇది 57 శాతంగా ఉండేదని తెలిపింది. అనేక వర్ధమానదేశాల ఆర్థిక వ్యవస్థల్లో నిరుద్యోగం కన్నా 'మంచి ఉద్యోగాల లేకపోవడం' సమస్యగా ఉందని నివేదిక పేర్కొంది. మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో దీర్ఘకాలంగా స్త్రీ, పురుషులు చాలా తక్కువ వేతనం కోసం కష్టమైన పని చేస్తున్నారు.



ఐఎల్‌ఓ డైరెక్టర్ జనరల్
జువాన్ సోమావియా

కార్మిక మార్కెట్‌లోని 20 కీలకమైన సూచికల ఆధారంగా అద్యయనం చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల సంఖ్య, నాణ్యతలపై కెఐఎల్‌ఎం కింది నిర్ధారణలు చేయగలిగింది.

ఉద్యోగాలు సృష్టించని ఆర్థికాభివృద్ధి

ప్రస్తుత ఆర్థికాభివృద్ధి ఉద్యోగావకాశాలను తగుమోతాదులో పెంచడం లేదు. ఆర్థిక వృద్ధి జరిగినా కొత్త ఉద్యోగాలు సృష్టించబడట్లేదు. నివేదికలోని 'ఉద్యోగాలు పెరగడం-తగ్గడం' సూచికను గమనిస్తే ఉపాధి-ఉత్పాదకతలో సానుకూల, ప్రతికూల మార్పులు రెండూ కన్పిస్తాయి. 1999 - 2003 మధ్య స్థూల జాతీయోత్పత్తిలో ప్రతి ఒక శాతం పాయింట్ అదనపు అభివృద్ధి వల్ల ఉపాధికల్పన 0.30 శాతం పాయింట్లు పెరిగిందని రెండేళ్లపాటు సాగిన అధ్యయనంలో తేలింది. 1995-99 మధ్య 0.38శాతం పాయింట్లుగా ఉన్న ప్రపంచ ఉపాధికల్పన తరువాత కాలంలో 0.08శాతం పాయింట్లకు తగ్గిపోయింది.

పశ్చిమ ఐరోపా, అమెరికాలలో సర్వీసు రంగం మంచి ప్రగతిని సాధించింది. ఉపాధి అవకాశాల పెరుగుదలతోపాటు విలువ ఆధార సేవల విషయంలోనూ ఈ ప్రగతి కన్పిస్తుంది.

పెరుగుతున్న వేతన అసమానతలు

ప్రపంచ వ్యాప్తంగా 1990-2000 మధ్య నైపుణ్యం లేని వృత్తుల్లో కంటే అత్యధిక నైపుణ్యం గల వృత్తుల్లో వేతనాలు వేగంగా పెరిగాయని నివేదిక తెలిపింది. తక్కువ నైపుణ్యం గల

కార్మికుల వేతనాల పరిస్థితి సాధారణ తగ్గుదల ను చూపనప్పటికీ 1990లలో అత్యధికనైపుణ్యం, అల్ప నైపుణ్యం గల కార్మికుల వేతనాలలో అస మానతలు పెరిగాయని అది సూచించింది.

అత్యధిక నైపుణ్యమున్న కార్మికులకు డిమాండ్ పెరుగుతుండటంతో అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో ఈ వేతన అసమానతలు పెరుగుతున్నాయి. నిపుణులైన కార్మికులు తక్కు వగా ఉండటం, తక్కువ విద్య ఉన్న కార్మికులకు డిమాండ్ తక్కువగా ఉండటం కూడా ఇందుకు కారణం.

> ❝ పపంచవ్యాప్తంగా కార్మిక మార్కెట్లలో భాగస్వాము లయ్యేందుకు పురుషులతో మహిళలు పోటీ పడుతూనే ఉన్నారు. అయితే మహిళ లకు తక్కువ వేతనాలు లభిస్తున్నాయి. యువతలో నిరుద్యోగం రేటు పెద్దలతో పోలిస్తే రెండు రెట్లు అధికం. సంపన్న దేశాలు, యూరోపియన్ యూనియన్‌లో కార్మిక వనరులను ఉపయో గించుకోలేకపోవడం బాగా పెరుగుతోంది. ❞

ఉత్పాదకత

వర్ధమాన దేశాల్లో కార్మికులకు తక్కువ వేతనాలు ఉన్నందువల్ల ధనిక దేశాల ఆర్థిక వ్యవస్థల్లోని పోటీతత్వానికి ఎంలాంటి ప్రమా దమూ రాదని ఐఎల్ఓ నివేదిక తెలిపింది. తక్కువ వేతనాల వల్ల ఆయా దేశాల్లో ఉత్పా దకత స్థాయి తగ్గుతుంది.

అమెరికాలో కార్మిక ఉత్పాదకత స్థాయి హెచ్చుగా ఉంది. కొన్ని యూరోపియన్ యూనియన్ దేశాల్లో ముఖ్యంగా కొత్తగా ఇయు లో చేరిన దేశాల్లో ఉత్పాదక వృద్ధిరేటు వేగంగా పెరుగుతున్నప్పటికీ అమెరికాలోనూ, ఇతర సంపన్న దేశాల్లోనూ ఉత్పాదక వ్యత్యాసం పెరుగుతోంది. అమెరికా కంటే యూరోపియన్ దేశాలు ఉత్పాదకతలో ముందున్నాయని, ఇత రుల విషయంలో ఈ తేడా పెద్దగా లేదని అర్థమవుతోంది. అయితే అనేక మంది యూరో పియన్లు అమెరికన్ల కంటే తక్కువ గంటలు పనిచేస్తారు. వారికి ఎక్కువ సెలవులు ఉంటా యి. మధ్య, తూర్పు యూరప్‌లు మార్కెట్ ఆర్థిక వ్యవస్థలోకి మారడం వల్ల ఉత్పాదకత పెరి గింది. అయితే ఉపాధి పడిపోయింది.

నివేదికలోని ఇతర కీలక అంశాలు :

–ప్రపంచవ్యాప్తంగా కార్మిక మార్కెట్లలో భాగస్వాములయ్యేందుకు పురుషులతో మహి ళలు పోటీ పడుతూనే ఉన్నారు. అయితే మహిళ లకు తక్కువ వేతనాలు లభిస్తున్నాయి. ఉత్పాద కత కూడా తక్కువగానే ఉంటోంది. వారిలో ఎక్కువ మంది పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసుకుం టున్నారు. మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా, దక్షిణాసియా వంటి అనేక ప్రాంతాలలో లేబర్ మార్కెట్లలో పాలుపంచుకునే మహిళలు బాగా వెనుకబడి ఉన్నారు.

–ఆఫ్రికాలో తీవ్రమైన పేదరికం పెరుగు తుంటే ఆసియా, మధ్య–తూర్పు యూరప్‌లో తగ్గుతోంది.

–యువతలో నిరుద్యోగం రేటు పెద్దలతో పోలిస్తే రెండు రెట్లు అధికం. కొన్ని సందర్భా లలో అంతకంటే ఎక్కువ కూడా. అయితే అనేక దేశాల్లో పెద్దలలో నిరక్షరాస్యత రేట్లు యువతలో కంటే ఎక్కువగా ఉంది. అంటే లేబర్ మార్కెట్‌కు యువత మరింత సిద్ధంగా ఉన్నారని దీనిద్వారా అర్థమవుతోంది.

–సంపన్న దేశాలు, యూరోపియన్ యూనియన్‌లో కార్మిక వనరులను ఉపయో గించుకోలేకపోవడం బాగా పెరుగుతోంది. నిరు ద్యోగులు, పార్ట్‌టైమ్ కార్మికులు పూర్తికాలపు ఉద్యోగాల కోసం చూస్తున్నారు. ఫ్రాన్స్, ఇటలీలో కార్మికులను తక్కువగా ఉపయో గించుకోవడానికి సంబంధించిన రేటు ఫ్రాన్స్‌లో 1994లో 17 శాతం ఉండగా 2004లో 21 శాతానికి పెరిగింది. అదే కాలంలో ఇటలీలో 12 శాతం నుండి 21 శాతానికి పెరిగింది.

లెక్కకురాని పనిలో ప్రమాద మరణాలు

ప్రపంచ వ్యాప్తంగా పని సంబంధమైన ప్రమాదాలు, వ్యాధుల మూలంగా ప్రతి ఏటా 22 లక్షల మంది మృతి చెందుతున్నారని ఐఎల్ఓకు చెందిన మరో నివేదిక తెలిపింది. పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యం అనే అంశంపై జరిగిన 17వ ప్రపంచ కాంగ్రెస్‌లో విడుదల చేసిన నూతన నివేదిక ఈ విషయం తెలిపింది. వివిధ దేశాల నుంచి సరైన నివేదికలు అందితే ఈ సంఖ్య ఇంకా పెరగవచ్చు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలలో పని సంబంధమైన అనారోగ్యాలు, ప్రమాదాలకు సంబంధించి సరైన సమాచారం రావడంలేదని నివేదిక తెలిపింది. ప్రమాదాల సంఖ్య, ముఖ్యంగా తీవ్ర మైన ప్రమాదాల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. వేగవంతమైన అభివృద్ధి, ప్రపంచీకరణ మూ లంగా పెరుగుతున్న పోటీ మొదలైన వాటివల్ల ఈ ప్రమాదాలు బాగా పెరిగిపోతున్నాయి.

"శ్రమ ఔన్నత్యానికి వృత్తి పరమైన భద్రత, ఆరోగ్యం చాలా కీలకమైనవి" అని ఐఎల్ఓ డైరెక్టర్ జనరల్ జువాన్ సొమావియా చెప్పారు. "ఇప్పటికీ రోజుకు సగటున ఐదు వేలు, అంత కంటే ఎక్కువ మంది స్త్రీ, పురుషులు పని సంబంధమైన ప్రమాదాలు, అనారోగ్యాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు" అని చెప్పారు.

అమెరికాలోని ఆర్లాండోలో 'పనిలో భద్రత, ఆరోగ్యం' అనే అంశంపై జరిగిన ఈ సమావేశంలో ఐఎల్ఓ నివేదిక ఉపోద్ఘాతంలో దీనిని చేర్చారు. దీనికి 'సముచితమైన పని – భద్రత ఉన్న పని' అని పేరు పెట్టారు. ముఖ్యం గా అభివృద్ధిచెందుతున్న దేశాలలో పని సంబంధమైన మలేరియా, అంటువ్యాధులు, ప్రమాదకరమైన పదార్థాల వినియోగం వల్ల వచ్చే క్యాన్సర్ వంటి వ్యాధులు పెద్ద సంఖ్యలో ప్రాణాలను బలిగొంటున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. ప్రపంచ శ్రామికవర్గానికి సరైన ఆరోగ్య సేవలు లోపిస్తున్నాయి.

"తగిన పని భద్రతా సంస్కృతి లోపించ డం వల్ల ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో కార్మికులు మృతిచెందుతున్నారనేది చాలా బాధాకరమైన వాస్తవం" అని ఐఎల్ఓ పని భద్రతా కార్యక్రమం డైరెక్టర్ జుక్కా టకాలా చెప్పారు. "నియంత్రణారహిత అభివృద్ధి కోసం చెల్లిస్తున్న భారీ మూల్యం ఇది. ఈ ధోరణులను వెనక్కు మళ్ళించేందుకు మనం చాలా చురుకుగా పని చేయాలి" అని ఆయన అన్నారు.

పురుషులు రిటైర్‌మెంట్ వయస్సు కంటే ముందే (65 ఏళ్ళ లోపే) మరణించే ప్రమాదం ఉండగా, మహిళలు పని సంబంధమైన అంటు వ్యాధులు, మానసిక, సాంఘిక అంశాలు, దీర్ఘ కాలిక కండరాల, ఎముకల సమస్యల మూలం గా బాధపడుతున్నారని ఆ నివేదిక పేర్కొంది. పలు పారిశ్రామిక దేశాలలో సగానికి పైగా రిటైర్‌మెంట్‌లు ముందుగా జరిగే రిటైర్‌మెంట్లే. పని చేయలేక ముందుగా రిటైర్‌మెంట్

> “ పారిశ్రామిక దేశాలలో ప్రధాన సమస్య పనికి సంబంధించిన వ్యాధులు. కాగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రధాన సమస్య పని ప్రదేశంలో ప్రమాదాలు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో గనులు, నిర్మాణ రంగం, వ్యయసాయ రంగాల్లోని ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. ”

తీసుకొంటున్నవిగానే ఉన్నాయి. సాధారణ పదవీ విరమణ వయస్సుకు చేరుకోక ముందే ఈ రిటైర్‌మెంట్లు జరుగుతున్నాయి. ఈ ధోరణు లన్నీ నేరుగా పనికి సంబంధించినవే కాకపో వచ్చు. మేనేజ్‌మెంట్ విధానాల ద్వారా పని ప్రదేశంలో సరైన సదుపాయాలు కల్పించడం ద్వారా వీటిని తొలగించే అవకాశాలు ఉన్నాయి.

వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యానికి సంబంధించిన వార్తా సేకరణ అనేక అభివృద్ధి చెందిన దేశాలలో చాలా నాసిరకంగా ఉన్నదని, కొన్ని దేశాలలో మరింతగా దిగజారిపో తోందని ఐఎల్‌ఓ నివేదిక తెలిపింది. ఉదాహర ణకు భారతదేశం నుంచి తీవ్ర ప్రమాదాలు జరిగిన కేసులు 222 గా నివేదిక అందగా, భారత కార్మికవర్గంలో ఒక్క శాతంగా ఉన్న చెక్ రిపబ్లిక్‌లో 231 కేసులు జరిగినట్లు నమోద యింది. అయితే వాస్తవానికి భారతదేశంలో తీవ్ర ప్రమాదాలు 40వేల వరకూ జరిగినట్లు అంచనా అని ఆ నివేదిక పేర్కొంది. పని సంబంధమైన మరణాలు, వ్యాధులకు సంబం ధించి పలు వర్ధమాన దేశాల నుంచి సరైన నివేదికలు రావడంలేదనే అంశం దీనిని బట్టి తెలుస్తోందని నివేదిక తెలిపింది.

ప్రమాదకరమైన పదార్థాల వినియోగం వల్ల ఏటా 4,40,000 మంది కార్మికులు మృతి చెందుతున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. ఒక్క ఆస్బెస్టస్ పరిశ్రమలోనే ఏటా లక్ష మంది కార్మి కులు మరణిస్తున్నారు. బ్రిటన్ నుంచి అందిన నివేదికలను బట్టి అక్కడ ఆస్బెస్టస్ పరిశ్రమలో ఏటా సుమారు 3,500 మంది మరణిస్తుండగా, ఇతర ప్రమాదాలలో మృతి చెందినవారి సంఖ్య దానికి పది రెట్లకు పైగా ఉంది. ఐరోపా యూనియన్ దేశాలలో దాని సొంత స్టాటిస్టికల్ పోర్టరయిట్ నివేదిక ప్రకారం పని సంబంధిత మరణాలు లక్షా ఇరవై వేలు ఉండగా, ఐఎల్‌ఓ అంచనా ప్రకారం ఈ సంఖ్య లక్షా ఇరవైరెండు వేలు ఉంది. అమెరికాలో సుమారు లక్షా మూడు వేల మంది మరణిస్తున్నట్లు అంచనా.

పారిశ్రామిక దేశాలలో ప్రధాన సమస్య పనికి సంబంధించిన వ్యాధులు కాగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రధాన సమస్య పని ప్రదేశంలో ప్రమాదాలు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో గనులు, నిర్మాణ రంగం, వ్యయసాయ రంగాల్లోని ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. పారిశ్రామిక దేశాలలో ప్రమాదకరమైన రంగాలలో శ్రామికుల సంఖ్య తగ్గుతూ భద్రతా రంగం లోనూ, సేవల రంగాలలోనూ (ఆఫీసు పని, బ్యాంకింగ్, కామర్స్) ఈ సంఖ్య పెరుగుతున్నది.

మలేరియా, బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వంటి పని సంబంధమైన అంటువ్యా ధులకు పురుషుల కంటే మహిళలే ఎక్కువగా గురవుతున్నట్లు నివేదికలోని నూతన సమాచారం తెలిపింది. పురుషులు ఎక్కువగా ప్రమాదాలు, శ్వాసకోశ వ్యాధులు, ఆస్బెస్టాస్ వంటి వాటి వల్ల వచ్చే పని సంబంధమైన క్యాన్సర్ వంటి వ్యాధులతో మరణిస్తున్నారు. ప్రపంచంలోని కొన్ని ప్రాంతాలలో హెచ్ఐవి/ఎయిడ్స్ వంటి ప్రాణాంతక వ్యాధి కూడా ప్రబలుతోంది. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ, సంధిదశలో ఉన్న ఆర్థిక వ్యవస్థలలోనూ కార్మికుల జీవితకాల పరిమితి రిటైర్‌మెంట్ వయస్సు అంటే 65 ఏళ్ళ కంటే చాలా తక్కువగా ఉంటున్నది. పారిశ్రా మిక దేశాలలో ఇది ఇంకా తక్కువగా 59 నుంచి 61 సంవత్సరాలుగా ఉంది.



ఐఎల్‌ఓ 'పని భద్రతా కార్యక్రమం' డైరెక్టర్ జుక్కా టకాలా

ప్రపంచంలోని అత్యధిక భాగం కార్మికు లకు న్యాయపరమైన సహాయ చర్యలు అందు బాటులో ఉండటం లేదు. ప్రమాదాలు, వ్యాధు లకు గురైన కార్మికుల్లో అత్యధికులకు అసలు నష్టపరిహారమే లభించడం లేదని టకాలా తెలిపారు. అత్యధికులు వృత్తిపరమైన డాక్టర్ నుగానీ, లేబర్ ఇన్‌స్పెక్టర్‌ను గాని కలవడం లేదని ఆయన చెప్పారు.

ప్రపంచ వ్యాప్తంగా మానసిక, సాంఘిక అంశాలు, హింస, మద్యం, మాదక ద్రవ్యాల ప్రభావాలు, ధూమపానం, హెచ్ఐవి/ఎయిడ్స్ వంటి కొత్తగా తలెత్తుతున్న సమస్యలు శీఘ్రంగా పెరుగుతూ ప్రాణాలను బలిగొంటున్నాయని కూడా నివేదిక పేర్కొంది. ధూమపానం వల్ల రెస్టారెంట్లు, ఎంటర్‌టైన్‌మెంట్, సర్వీస్ రంగా లలో పని చేస్తున్న కార్మికులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. వ్యాధుల వల్ల సంభ వించే పని సంబంధమైన మరణాలలో వీరి సంఖ్య 14 శాతంగా లేదా రెండు లక్షలుగా ఉంది. హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధిని గుర్తించిన నాటి నుంచి 2005 వరకూ ప్రపంచ వ్యాప్తంగా 2.8 కోట్ల మంది కార్మికులు మృతి చెందినట్లు ఐఎల్‌ఓ అంచనా వేసింది.

పని ప్రదేశంలో వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపట్ట డంలో, వనరులను సమీరించడంలో అంతర్జా తీయ సహకారాన్ని అభివృద్ధి చేయడం కీలకమని ఐఎల్‌ఓ నూతన ప్రపంచ వ్యూహం భావిస్తోంది. పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్యం కోసం ప్రపంచ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సంవత్సరం 2005, ఏప్రిల్ 28న సుమారు 115 దేశాలు పెద్ద ఎత్తున అనేక జాతీయ కార్యక్రమాలను నిర్వహించాయి. చనిపోయిన, గాయపడిన కార్మికులను సంస్మరిస్తూ ఐఎల్‌ఓ 2005ను అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటించింది.

పరిశీలన

విధానాలు వదిలి వివాదాల చుట్టూ పరిభ్రమణం

తెలుగు పత్రికల తీరుతెన్నులు

పత్రకార్

మీడియా అన్నది వాస్తవానికి ఒక పెద్ద వ్యాపారం. ఆ వ్యాపార ప్రయోజనాలు మీడియా మనుగడకు కీలకమైనప్పుడు వాటిని నొప్పించే సమాచారం ఇవ్వడం కష్టమైనపనే. అంతర్జాతీయంగా పాశ్చాత్యదేశాలకు అనుగుణంగానే వార్తాప్రసారం జరుగుతుంటుందని నామ్‌చోమ్‌స్కీ వంటి మేధావులు నిరూపించారు. ఇటీవల ఇరాక్‌పై దురాక్రమణ తర్వాత ఈ విషయం మరింతగా రుజువైంది. బహుళ జాతి సంస్థలు కూడా ఈ కూటమికి చెందినవే కనక వాటి రాజకీయ ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగానే సమాచార ప్రసారం ఉంటుంది.

వరుస సంచలనాలు, ఎడతెరిపి లేని వివాదాలతో మీడియా ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. ఈ క్రమంలో దానిపైనా ఎన్నో విమర్శలు, వ్యాఖ్యలు వస్తున్నాయి. పత్రికలు తమకు అనుకూలంగా రాయనప్పుడు పాలకులు వాటిపై ఆంక్షలు పెట్టడానికి ప్రయత్నించడం, ఈ ఆంక్షలకు వ్యతిరేకంగా పత్రికా రంగం పోరాడ్డం ఆధునిక చరిత్రలో అంతర్భాగంగా మారిపోయింది. పత్రికలపై ఆంక్షలు పెట్టడమంటే ప్రజాస్వామ్యంపై ఆంక్షలు పెట్టడమే, పత్రికా స్వాతంత్ర్యాన్ని నియంత్రించడమంటే ప్రజాస్వామ్యాన్ని నియంత్రించడమే. అందుకే పత్రికలపై నియంత్రణలు విధించడానికి పాలకులు ప్రయత్నించినప్పుడల్లా ప్రజాతంత్ర శక్తులు వాటికి వ్యతిరేకంగా పోరాడుతుంటాయి.

కనిపించని నియంత్రణలు

పత్రికలపై పైకి కనిపించే నియంత్రణలు, నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడ్డం, ప్రజాబలంతో వాటిని ఎత్తివేసేట్టు చేయడం ఎప్పటికప్పుడు జరుగుతోంది. కాని ఈ బయటకు కనిపించే నింయంత్రణలకు మించి పరోక్షమైన ఒత్తిళ్లు, గుప్త నియంత్రణలు పత్రికలను నడిపిస్తాయనే సంగతి మాత్రం చాలా మందికి తెలియదు. వ్యవస్థాపరమైన అవసరాలు వాటిని శాసిస్తూ.వుంటాయి. మీడియా అన్నది వాస్తవానికి ఒక పెద్ద వ్యాపారం. ఆ వ్యాపార ప్రయోజనాలు మీడియా మనుగడకు కీలకమైనప్పుడు వాటిని నొప్పించే సమాచారం ఇవ్వడం కష్టమైనపనే. అంతర్జాతీయంగా పాశ్చాత్యదేశాలకు అనుగుణంగానే వార్తాప్రసారం జరుగుతుంటుందని నామ్‌చోమ్‌స్కీ వంటి మేధావులు నిరూపించారు. ఇటీవల ఇరాక్‌పై దురాక్రమణ తర్వాత ఈ విషయం మరింతగా రుజువైంది. బహుళ జాతి సంస్థలు కూడా ఈ కూటమికి చెందినవే కనక వాటి రాజకీయ ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగానే సమాచార ప్రసారం ఉంటుంది. దాని తరువాత సత్యానికి స్థానం. దీనికే అంగీకారసృష్టి అని పేరు పెట్టారు. ఆ విధంగా పత్రికా స్వేచ్ఛ మిధ్యగా మారిపోతుంటుంది. ఈ అంగీకార సృష్టి మన రాష్ట్రంలో ఎలా జరుగుతోందో పరిశీలించడానికి ఇటీవలి కొన్ని రోజుల పత్రికలను మచ్చుకు చూస్తే తెలుస్తుంది.

ఇటీవలి కాలంలో రాష్ట్రంలో కీలక స్థానం ఆక్రమించిన సమస్యలు ఇవి: టిఆర్‌ఎస్ సంక్షోభం, మొద్దుశీను వ్యవహారం, కొల్లేరు ప్రక్షాళన సమస్య, పోలవరం, పోతిరెడ్డిపాడు, ముస్లిం రిజర్వేషన్లు, శాసన మండలి పునరుద్ధరణ, స్వర్ణోత్సవాలు, కరెంటు సమస్యలు, అధిక ధరలు, విద్యారంగ సమస్యలు, పత్రికా స్వేచ్ఛపై ఆంక్షల ఉత్తర్వులు.

జాతీయంగా: వోకర్ నివేదిక, ఆపరేషన్ దుర్యోధన్, బీహార్ ఎన్నికల పలితాలు, బిజెపిలో ఉమాభారతి ప్రహసనం, పిఎఫ్ వడ్డీ రేటు తగ్గింపు, హాంకాంగ్ చర్చలలో మన దేశ పాత్ర మొదలైనవి ముఖ్యసమస్యలు.

అంతర్జాతీయంగా: సద్దాంపై విచారణ, వెనిజులా ఎన్నికల ఫలితాలు, ఇరాక్ విషయంలో తప్పును ఒప్పుకుంటూ బుష్ చేసిన ప్రకటన, హాంకాంగ్ చర్చలు మొదలైనవి పరిశీలనకు కొన్ని సూచికలుగా పనికి వస్తాయి.

రాష్ట్ర సమస్యలు

తెలుగుదేశం పాలనలో పదేళ్ల పాటు ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురైనాయి. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం వాటిని పెద్ద ఎత్తున చేపట్టింది. ఇది అంగీరించవలసిన వాస్తవం. ఈ క్రమంలో భారీ ప్రాజెక్టులకు వేల కోట్ల రూపాయల టెండర్లు పిలవడమూ సహజమే. ఆ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ప్రజాధనం పూర్తిగా సద్వినియోగం కావాలని కోరుకోవాలి. కాని ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం తమ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించిన విషయాన్ని దాటవేస్తూ, కేవలం టెండర్లలో గోల్‌మాల్ జరుగుతున్నదనే దాని చుట్టూనే చర్చ తిప్పుతున్నది. ఈ క్రమంలో అది ప్రాజెక్టుల

“ పోలవరం ప్రాజెక్టు వల్ల వందలాది గిరిజన గ్రామాలు మునిగిపోతాయన్న కోణం చాలా పత్రికలకు పట్టలేదు. పాపికొండలు మునిగిపోతాయని, శబరినది అంతరిస్తుందని రాసినంతగా ఈ గ్రామాల సమస్యలకు ప్రాధాన్యత రాలేదు. సిపిఎం ఈ సమస్య మీద తలపెట్టిన ఆందోళన లోతుపాతులు కూడా మొదట్లో అంతగా ప్రతిబింబించలేదు. ”

చుట్టూ ఉన్న విధానపరమైన విషయాలను విస్మరించుతోంది. వాస్తవానికి ఇన్ని ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతున్నప్పుడు విమర్శనాత్మకంగా అధ్యయనం చేయవలసిన విషయాలు చాలా వుంటాయి. విస్తారమైన యంత్రాంగం గల పత్రికలపై ఆ బాధ్యత ఎక్కువగా వుంటుంది. కాని అవి కూడా ప్రతిపక్షం తరహాలోనే టెండర్ల కు సంబంధించిన కథల చుట్టూ తిరుగుతున్నాయి. అసలు ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో వున్న పత్రికలు తక్కువగానే వున్నాయి. సీనియర్ పాత్రికేయులు ఎంతో శ్రమపడి సేకరించితే గాని వివరాలు దొరకవు. గత కొద్ది కాలంగా తెలుగులో ప్రధాన పత్రికల వార్తలను చూస్తే ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి సమాచారం ఇచ్చేందుకు జరిగిన ప్రయత్నం తక్కువగానూ, రాజకీయ సంచలనాలకు ప్రాధాన్యత ఎక్కువగానూ కనిపిస్తుంది. రామాంజనేయ యుద్ధంగా పేరు మోసిన సీతాపతి రావు -మారుతి వాగ్వివాదాలు అవసరానికి మించిన ప్రచారం పొందాయి. ఆ చర్చలో ఎప్పుడైనా అలాంటి వాతావరణం లేకపోతే 'చర్చ చప్పగా సాగింద'నే వ్యాఖ్యలు వెలువడుతుంటాయి.

పోలవరం ప్రాజెక్టు వల్ల వందలాది గిరిజన గ్రామాలు మునిగిపోతాయన్న కోణం చాలా పత్రికలకు పట్టలేదు. పాపికొండలు మునిగిపోతాయని, శబరినది అంతరిస్తుందని రాసినంతగా ఈ గ్రామాల సమస్యలకు ప్రాధాన్యత రాలేదు. సిపిఎం ఈ సమస్య మీద తలపెట్టిన ఆందోళన లోతుపాతులు కూడా మొదట్లో అంతగా ప్రతిబింబించలేదు. రాష్ట్ర కార్యదర్శి బివి రాఘవులు పర్యటన సందర్భంలో ఆ లోటును అధిగమించేలా అన్ని పత్రికలలోనూ వివిధ కథనాలు వచ్చాయి. అక్కడి ప్రజల మనోభావాలు కూడా వెల్లడైనాయి. తర్వాత ప్రధానిని ప్రతినిధిబృందం కలుసుకున్న తర్వాత ఈ సమస్య మరింతగా వెలుగులోకి వచ్చింది. ఇప్పటికి కూడా పోలవరం ముంపు తీవ్రతను గుర్తించవలసే వుంది. ఈ సమస్యను సిపిఎంకూ, కాంగ్రెస్‌కూ మధ్య వివాదంగా తప్ప గిరిజన గ్రామాల కోణం నుంచి చూడటం లేదు. ఆ మాటకొస్తే ప్రాజెక్టును తెలుగుదేశం కూడా బలపరుస్తున్నది. కాని పత్రికలు వార్తా కోణం నుంచి దానికి పెద్దవిలువ ఇవ్వడం లేదు. కేంద్రంలో కాంగ్రెస్‌ను బయటనుంచి బలపరుస్తున్న సిపిఎం నుంచే ఇక్కడ ప్రతికూలత ఎదురవుతోందన్న కోణమే వాటికి ప్రధానమై కూచుంది. సిపిఎం ప్రతినిధి బృందం ప్రధానిని కలుసుకున్న వార్తకు 'ఈనాడు' దిన పత్రిక 'ప్రధాని దగ్గర పంచాయితీ' అని శీర్షికనిచ్చింది. సుందరయ్య అప్పట్లో ఈ ప్రాజెక్టు కట్టాలని డిమాండు చేసినట్టు ప్రభుత్వం విడుదల చేసిన కథనంపై బివిరాఘవులు ఇచ్చిన వివరణను ప్రచురించాయి. కాని అందులో ఆయన కట్టమన్నది బ్యారేజి తప్ప రిజర్వాయరు కాదన్నది కీలకమైన విషయం. దానిపై సరిగ్గా వివరాలు రాలేదు. 2002లో చేసిన తీర్మానంలోనే సిపిఎం రాష్ట్ర కమిటీ పోలవరంలో రిజర్వాయరు, ఎత్తిపోతల పథకాలను పట్టువిడుపులతో ఉపయోగించుకోవాలని సూచించింది. కావాలంటే ఆ వివరాలన్ని అందుబాటులోనే వున్నాయి. కాని ఆ వివరాలు సేకరించే ప్రయత్నం జరగలేదు. అయితే 'ఈనాడు' చైనాలో త్రీగోర్జెస్ ప్రాజెక్టు నిర్మాణం సందర్భంగా పునరావాస కార్యక్రమం అమలుజరిగిన తీరుకూ, మన ప్రాజెక్టు తీరుకూ మధ్య తేడాను చాల వివరంగా ఇచ్చింది. అలాగే పోతిరెడ్డిపాడు, పోలవరం ప్రాజెక్టులపై అఖిలపక్ష చర్చ తర్వాత 'ఆంధ్రజ్యోతి'లో ఐ.వెంకట్రావు రాసిన వ్యాసంలో దీనిపై సిపిఎం వాదన సహేతుకంగానూ, సమర్థంగానూ వుందని మెచ్చుకున్నారు.

ఇక కొల్లేరు సమస్య. కొల్లేరు సరస్సు పునరుద్దరణ, పర్యావరణ పరిరక్షణ వంటి ఆకర్షణీయమైన మాటలు తప్ప అక్కడ వాస్తవాన్ని పూర్తిగా ప్రతిబింబించే కథనాలు రాలేదు. ప్రజాశక్తి, వార్త పత్రికల్లో ఈ కోణంలో కొంత ప్రయత్నం జరిగింది. పోలవరంలాగే కొల్లేరు విషయంలోనూ తెలుగుదేశం, కాంగ్రెస్ ఒకే వైఖరిని అనుసరిస్తున్నాయి. వాస్తవానికి తెలుగు దేశం తెచ్చిన జివో ఆధారంగానే ఇప్పుడు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందుకు ప్రాతిపదిక ఏమిటన్నది పత్రికలను ఆకర్షించకపోవడం విశేషం. అక్కడ సమస్య ఏమీ వుండకపోతే ప్రజల నుంచి అంత ప్రతికూలత ఎందుకు వచ్చింది? 120 జీవో ఇంతకాలం అమలు కాకపోవడానికి కారణమేమిటి? వంటి ప్రశ్నలను లోతుగా పరిశోధించే పరిశీలించే ఓపిక లేకుండా పోయింది. కొల్లేరు చరిత్ర, ప్రభుత్వమే అక్కడ చేపల చెరువులను ప్రోత్సహించడమూ, నిర్బంధం కూడా చేయడమూ, భౌగోళికంగా కొల్లేరును పాత రూపంలో పునరుద్ధరించడంలో వున్న అసంభవతా మొదలైన వాటిగురించి చెప్పడం లేదు. ఆ పత్రికలే గనక ఆపరేషన్ కొల్లేరుకు వ్యతిరేకంగా వుండివుంటే తప్పనిసరిగా చిత్రణ మరో విధంగా వుండేది. ఈ విషయంలో మాత్రం 'ఈనాడు' రాజశేఖరరెడ్డి చర్యలను గట్టిగా బలపరచింది.

మొద్దు శీను వ్యవహారం నిస్సందేహంగా చాలా ఆసక్తికరమైన వార్త. దాని తాలూకూ వివరాలు పాఠకులు తెలుసుకోగోరతారు. కాని అదే సమాచారాన్ని రోజుల తరబడి ఇటూ అటూ తిప్పి ఇవ్వడం వల్ల ప్రయోజనమేమిటి? ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడం అనే లక్ష్యంతో పాటు ఈ ఉదంతంలో ఇమిడి వున్న సంచలన శీలత కూడా ఇందుకు ప్రధాన కారణం కాదా? నేరస్తులను గురించి రాసేప్పుడు ఆకర్షణగా కాక జనాన్ని అప్రమత్తం చేసే విధంగా వ్యవహరించాలన్న సూత్రాన్ని పాటించాయని చెప్పగలవా?

టిఆర్ఎస్ సంక్షోభం

టిఆర్ఎస్‌కు వున్నదానికన్నా ఎక్కువ ప్రచారం రావడంలో పత్రికల పాత్ర తక్కువేమీ కాదు. స్వతహాగా ఆ వాదన పట్ల మొగ్గుతో కొన్నీ, ఆ విషయాలు రాస్తే అమ్మకాలకు దోహదపడుతుందనే కోణం నుంచి కొన్నీ, కాంగ్రెస్‌నూ, వామపక్షాలనూ ఇరుకున పెట్టొచ్చుననే కోణంతో కొన్నీ అవసరాన్ని మించి ప్రచారం ఇస్తూ

వచ్చాయి. అందుకు ఇచ్చిన శీర్షికలు కూడా ఆ కోవలోనే వుండేవి. నరేంద్ర రక్తాభిషేకం గురించి మాట్లాడిన తర్వాత ఈ పరిస్థితి మారింది. కాని టిజెఏస్ కమాండర్, ఆరెస్సెస్ కుదురు నుంచి వచ్చాడన్న విషయానికి పత్రికలు పెద్దగా ప్రాధాన్యత నివ్వలేదు. అసలు దాన్ని ఒక సమస్యగానే చూపించలేదు. తెలంగాణా వాదానికి ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక కొన్ని పత్రికలు, ఆరెస్సెస్ పట్ల అనుకూలత వల్ల కొన్ని పత్రికలు దాన్ని కావాలనే విస్మరించాయి. ప్రజాశక్తి దీన్ని మొదటే ప్రచురించడం గమనించవలసిన విషయం. తరువాత ఆయనను తొలగించారు, అది వేరేవిషయం. తెలంగాణా ఏర్పాటుకు టిఆర్ఎస్ నాయకులు గడువులు పెడుతూ పోతుంటే వాటిని విమర్శనాత్మకంగా విశ్లేషించవలసింది పోయి యధాతధంగా ప్రచురిస్తూ వచ్చాయి. డిసెంబరు నెల మొదటి తేదీ పత్రికలలో కెసిఆర్ పార్టీ తిరుగుబాటు దారులకు వేడుకోలు తరహాలో చేసిన ప్రకటన కూడా తలో రకంగా ప్రచురించాయి. ఆ సందర్భంలో ఆయన ఇరకాటాన్ని బహిర్గతం చేసేందుకు సిద్ధపడలేదు. స్వయంగా సోనియాగాంధీ స్పష్టీకరణ వెలువడ్డాక గాని ఈ ప్రచారాలు తగ్గలేదు. సోనియా ప్రకటనతో టిఆర్ఎస్ నాయకులు చెప్పిన బడాయికబుర్ల బండారం తేలిపోయింది. ఇలాటి తరుణంలో వాటి లోతు పాతులు గుర్తుచేయవలసింది పోయి 'ఆంధ్ర జ్యోతి' పత్రిక 'గాయపడ్డ తెలంగాణా' అంటూ టిఆర్ఎస్‌ను గాక ఇతరులందరినీ కలిపి విమర్శించే ధారావాహిక ప్రచురించింది. అందులోనూ టిఆర్ఎస్ నేతల మాట మార్పు లను, అనిశ్చిత వైఖరిని అంతగా ఎండగట్టక పోగా కమ్యూనిస్టులను సైంధవులుగా అభివర్ణించింది. ఒక విధంగా టిఆర్ఎస్ ఆత్మరక్షణ స్థితిలో పడకుండా ఆదుకోవడం దీని లక్ష్యంగా కనిపించింది. సీతారాం ఏచూరి తెలంగాణా బిల్లును రాకుండా అడ్డుకుంటాం అని చెప్పిన దానిలో శాసనమండలి సమస్యకు దానికి మధ్యన తేడాను వివరించారు. కాని పత్రికా వార్తలలో ఆ స్పష్టత లేదు. శాసనమండలి లాగే ఇది కూడా వచ్చేస్తుంది అన్న భావన కలిగించడానికే అవి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చాయి. యుపిఎ వామపక్షాల సమన్వయ కమిటీ ఆమోదం లేకుండా ఆ బిల్లు రాదన్నది అసలు విషయం. దీనిపై కె.సి.ఆర్ సహజశైలిలో విషపు దాడి చేసి బాగా ప్రచారం పొందారు.

> **"ఈ కాలంలో అనేక ప్రజాసంఘాలు రాష్ట్ర మహాసభలు జరుపుకున్నాయి. రెండు అఖిలభారత మహా సభలు (ఎస్ఎఫ్ఐ, ఎస్టిఎఫ్ఐ) హైదరాబాదులో జరిగాయి. అగ్రనాయకులు పాల్గొన్న తొలిరోజు కార్యక్రమాలు తప్ప వీటిలో ముందుకొచ్చిన విధానపరమైన సమస్యలను గాని, జరిగిన చర్చలను గాని పాఠకులకు అందించే ప్రయత్నం జరగలేదు."**

శ్రామికవర్గ సమస్యలు

సంచలన వార్తలకు ప్రాధాన్యత నిచ్చిన మన పత్రికలు నిజమైన ప్రజా సమస్యల పట్ల, ముఖ్యంగా శ్రామిక వర్గ సమస్యల పట్ల ఎంతటి నిర్లక్ష్యం ప్రదర్శించాయో ఇటీవలి ఆ కొన్ని రోజుల పత్రికలు చూస్తే తెలుస్తుంది. పిఎఫ్ వడ్డీరేటు తగ్గింపుపై పార్లమెంటులోనూ, వెలుపలా వామపక్షాలు చేస్తున్న ఆందోళన వార్త మొదటి పేజీ నోచుకోలేదు. 'ఈనాడు' మూడవ పేజీలో పది పంక్తులలో ప్రచురించింది. 'ఆంధ్రజ్యోతి' లోపలి పేజీలలో ఇచ్చింది. అయితే వివరంగానే ఇచ్చింది.

అలాగే శాసనసభలో పారిశ్రామిక వివాదాల చట్ట సవరణను వ్యతిరేకిస్తూ వామ పక్షాలు వాకౌట్ జరిపిన వార్తకు కూడా ప్రాధాన్యత లభించలేదు. దీన్ని 'ఈనాడు' రెండు కాలాల వార్తా కదంబంలో ఒక చిన్న బిట్‌గా ఇచ్చింది. 'ఆంధ్రజ్యోతి' అసలు ఇవ్వనేలేదు.

ఈ కాలంలో అనేక ప్రజాసంఘాలు రాష్ట్ర మహాసభలు జరుపుకున్నాయి. రెండు అఖిలభారత మహా సభలు (ఎస్ఎఫ్ఐ, ఎస్టిఎఫ్ఐ) హైదరాబాదులో జరిగాయి. అగ్రనాయకులు పాల్గొన్న తొలిరోజు కార్యక్రమాలు తప్ప వీటిలో ముందుకొచ్చిన విధానపరమైన సమస్యలను గాని, జరిగిన చర్చలను గాని పాఠకులకు అందించే ప్రయత్నం జరగలేదు. ఇంకా చాలా దూరంలో వున్న ఎఐసిసి ప్లీనరీ గురించి మాత్రం ఇప్పటి నుంచే కథలు, కథనాలు వస్తున్నాయి.

జంగారెడ్డి గూడెంలో సిపిఎం కార్యాలయాన్ని కూల్చి పార్టీ నాయకులను అరెస్టు చేయడంపై ప్రజలలో నిరసన వస్తే దాన్ని పోలీసు స్టేషన్‌పై గిరిజనులు దాడి పేరుతో 'వార్త' పెద్దగా ఇచ్చింది. అక్కడ ఇమిడి వున్న సమస్యలను విశ్లేషించేందుకు మాత్రం ప్రయత్నించలేదు.

జాతీయ పరిణామాలు

వోకర్‌నివేదికపై బాగా వార్తలు ప్రచురించిన 'ఈనాడు' దానిలో బిజెపి నేతలకూ భాగం వుందని వచ్చిన వ్యాఖ్యలను మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం. రాజకీయంగా మరో కీలకమైన ఉదాహరణ- పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలకు సంబంధించింది. బీహార్‌లో ఎన్నికలు చాలా బాగా జరపడం ద్వారా లాలూ యాదవ్‌ను ఓడించడానికి ప్రధాన కారకుడైన కె.జె.రావును బెంగాల్ ఎన్నికలకు పరిశీలకుడుగా పంపాలన్న సూచనలను ఆంధ్ర జ్యోతి, ఈనాడు వార్తలుగా ప్రచురించాయి. (వాస్తవానికి లాలూ ఓట్లు తగ్గుదల ఒక్కశాతానికి లోపేనన్న లెక్కలు ఈ వాదనను పటాపంచలు చేశాయి) బీహార్ పరిస్థితికి, బెంగాల్‌కు హస్తి మశకాంతరం ఉంది. అక్కడ వామపక్ష ఫ్రంట్ దృఢమైన పునాదులతో సుదీర్ఘ కాలంగా పాలన చేస్తోంది.రాజకీయంగా దాన్ని విమర్శించే హక్కు ఎవరికైనా వుంటుంది. కాని ఈ విజయాలన్నీ శాస్త్రీయమైన రిగ్గింగ్ వల్లనే జరుగుతున్నాయనే పసలేని ఆరోపణలను పనిగట్టుకుని ప్రచారం చేయడం, కె.జె.రావు వెళితే వాటన్నిటిని అరికట్టేసి కమ్యూనిస్టులను ఇంటికి పంపేస్తాడన్న భావం కలిగించడం ఇక్కడ గమనించదగ్గ అంశం. 1972లో ఇందిరాగాంధీ సైన్యం సహాయంతో రిగ్గింగ్ చేసిన రోజున సిపిఎం ఎంత గగ్గోలు చేసినా పత్రికలు పట్టించుకోలేదు. కాని ఈ అవాంతరాలను అధిగమించి అక్కడ పార్టీ బలీయంగా నిలదొక్కు కోవడంతో ఇప్పుడు ఆ పత్రికలే మమతా బెనర్జీ వంటి అదరగణ్ణం నాయకురాలి విషపుదాడికి వంతపాడుతూన్నాయి! డిసెంబరు 18న అద్వాని బహిరంగ ప్రసంగానికి కూడా దాదాపు అదే కోణంలో ప్రచారం లభించింది. బ్రాహ్మ

“ వామపక్షాల విలక్షణతను చూపించే వార్తలను పత్రికల్లో చూడాలని ఆశించడం అసలే సాధ్యం కాని పని. ఆపరేషన్ దుర్యోధన్‌లో గాని, తర్వాత ఎంపిలాడ్స్ కుంభకోణంలో గాని పట్టుబడిన వారిలో కమ్యూనిస్టులు లేక పోవడం ఒక ముఖ్యమైన విషయం. ఆ విషయం ఈ పత్రికల వార్తలలో గాని వ్యాఖ్యలలో గాని ప్రముఖంగా రాలేదు. పైగా అన్ని పార్టీలూ ఒక్కటేనన్న మాట పదేపదే కనిపిస్తోంది. ”

ణుడు- నల్లమేక కథలోలాగా ముందస్తుగా పాఠకులను ప్రభావితం చేసే ఈ ప్రచారాల రాజకీయ సారాంశం విస్మరించరానిది. వామపక్షాలకు సంబంధించి సీతారాం ఏచూరి, బి.వి.రాఘవులు వంటివారి పత్రికా గోష్టులు పత్రికలలో ప్రముఖంగా వచ్చే సందర్భాలున్నాయి. కాని సాదారణ సందర్భాలలో మాత్రం వామపక్షాల ఉద్యమాలు, సంఘాల సభలు వంటివి ప్రాదాన్యతకు నోచుకోవు. ఆ పార్టీలకు చెందిన ముఖ్య మంత్రులో లేదా లేదా ప్రధాన కార్యదర్శులో వచ్చినపుడుమాత్రమే అరుదుగా మొదటి పేజీలో వాటి వార్తలు కనిపిస్తాయి. విధానపరంగా వామపక్షాల విమర్శలను ఇచ్చినపుడు కూడా వాటిని వివాదాలుగా చూపించడం తరచూ జరుగుతోంది.

ఇక వామపక్షాల విలక్షణతను చూపించే వార్తలను పత్రికల్లో చూడాలని ఆశించడం అసలే సాద్యం కాని పని. ఆపరేషన్ దుర్యోధన్‌లో గాని, తర్వాత ఎంపిలాడ్స్ కుంభకోణంలో గాని పట్టుబడిన వారిలో కమ్యూనిస్టులు లేకపోవడం ఒక ముఖ్యమైన విషయం. ఆ విషయం ఈ పత్రికల వార్తలలో గాని వ్యాఖ్యలలో గాని ప్రముఖంగా రాలేదు. పైగా అన్ని పార్టీలూ ఒక్కటేనన్న మాట పదేపదే కనిపిస్తోంది. వామపక్ష సభ్యుల విలక్షతను మెచ్చుకోకపోగా వారినీ మందలో కలిపి చూపడంలో రాజకీయ విముఖత లేదా?

అంతర్జాతీయ వార్తలు

సాధారణంగా మన పత్రికల్లోని అంతర్జాతీయ వార్తలలో సామ్రాజ్యవాద కోణం ప్రతిబింబిస్తుంటుంది. ఈ కాలంలో కూడా అదే ధోరణి కనిపించింది. ఇరాక్‌లో సద్దాంపై విచారణ వార్తను ఈనాడు సింగిల్‌కాలంలో ఇచ్చింది. అయితే యుద్ధం జరగడానికి తనే బాధ్యుడనని, అప్పట్లో ఆ దేశంపై వచ్చిన ఆరోపణలు నిజం కాదని బుష్ చేసిన ప్రకటను పెద్దగానే ఇచ్చింది. వెనిజులాలో ఛావెజ్ విజయం వార్తగా కూడా చిన్నదిగా వచ్చింది.

సరళీకరణ- సామాజిక న్యాయం

ఈ నెలలో పార్లమెంటు రిజర్వేషన్ల బిల్లుపైనా, అవితీని ఎంపిలపైనా ఆమోదించిన బిల్లులు బిజెపి వైఖరికి ఎదురు దెబ్బలు. ఇంగ్లీషు పత్రికలు ఆ అంశాన్ని విశ్లేషించాయి కూడా. కాని ప్రముఖమైన తెలుగు పత్రికలు మాత్రం దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. 'ఈనాడు' రిజర్వేషన్ల బిల్లు వార్తను మొదటి పేజీలో ఇవ్వనే లేదు. లోపల రెండు కాలాలలో మాత్రమే ఇచ్చింది. బిసిలకు అన్యాయం జరిగిందంటూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న విమర్శలను ప్రముఖంగా ప్రచురించడమే గాక ఎస్‌సి స్కాలర్ షిప్పులు అందడం లేదని ఆ పత్రికే వివరమైన కథ ఇచ్చింది. 'ఆంధ్రజ్యోతి' లోనైతే స్కాలర్ షిప్పులు రాని విద్యార్థులు రక్తం అమ్ముకుంటున్నారన్న విషాద వాస్తవాన్ని వెలికి తీసి ఇచ్చింది. అలాగే ప్రైవేటు విద్యా సంస్థలపై హైకోర్టు అభిశంసనలను కూడా ఈ పత్రికలు ప్రచురించాయి. కాని ప్రైవేటీకరణతో దెబ్బ తింటున్న సామాజిక న్యాయం కోణానికీ ఈ పరిణామాలకూ మధ్యగల సంబంధాన్ని కనీసంగానైనా విశ్లేషించే ప్రయత్నాలు చేయలేదు.

రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడుల వల్ల జనాభాలో గణనీయమైన భాగం దెబ్బతింటారన్నది వాస్తవం. వ్యవసాయం తర్వాత ఎక్కువ మంది ఆ చిల్లర వ్యాపారంపైనే ఆదారపడి బతుకుతున్నారు. కాని ఈనాడు వ్యాపార వార్తలలో ఆ సంగతి గాక భారతీయ టోకు వ్యాపార సంస్థల ప్రతిస్పందన తీసుకుని మాకేమీ భయం లేదని చెప్పినట్టు ప్రచురించింది. అలాగే హాంకాంగ్‌లో వాణిజ్య చర్చల కంటే అప్పుడే జరిగిన అందాల పోటీలో సింధూర ఎంపిక అవకాశాలపై ఎక్కువ స్థలం కేటాయించింది.

ఇలాటి ఉదాహరణలు ఇంకా అనేకం ఇవ్వొచ్చు. వీటిపై వ్యాసాలు కొన్ని వచ్చి ఉండొచ్చు. కాని వ్యాసాలు వార్తలకు ప్రత్యామ్నాయం కావు. 'నన్ను హెడ్‌లైన్లు అదుపుచేయనివ్వండి, సంపాదకీయం ఎవరు రాస్తేనేమిటి' అని పాశ్యాత్య మీడియాలో ఒక నానుడి. ఎందుకంటే పాఠకులపై తక్షణ ప్రభావం చూపేవి వార్తలు. ప్రధానంగా వాటినే ఇక్కడ ప్రస్తావించాము. ఇందుకు సంబంధించిన తేదీలు, వివరాలు ఇవ్వడం స్థలాభావం దృష్ట్యా సాధ్యం కాని పని. అంతకంటే కూడా వీటినుంచి తీసుకోవలసిన పాఠాలేమిటన్నది కీలకం.

కొన్ని నిర్ధారణలు

– పత్రికలకు స్పష్టమైన రాజకీయ సుముఖతలూ, విముఖతలూ వున్నాయి. వాటి ప్రకారమే వార్తలకు ప్రాధాన్యత నిర్ణయమవుతోంది.

– విధాన పరమైన అంశాలకన్నా వివాదగ్రస్తమైన విషయాలకు, వ్యక్తిగత విషయాలకు ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది.

– శ్రామిక వర్గ సమస్యలు, సామాజిక న్యాయం పట్ల వీటిలో కొన్నింటికి అసలు ఆసక్తి లేదు.

– ప్రజా ప్రయోజనాల కన్నా సంచలనాలకు, ఆకర్షణలకు హెచ్చు ప్రాధాన్యత లబిస్తోంది.

– వ్యక్తిగత విషయాలపై వున్నంత ఆసక్తి, ఉద్యమాల పట్ల లేదు.

– వినియోగ సంస్కృతి, కాలక్షేపం కబుర్లు, అందచందాలు వంటివాటికి ప్రాధాన్యత పెరుగుతున్నది.

– అవినీతి సమస్యలను పరిశోధనాత్మకంగా వెలికితీయడంలో మంచి కృషి జరుగుతోంది. అదే కోణంతో ప్రజా జీవిత వాస్తవాలను, అందుకు కారణమైన ఆర్థిక విధానాలు దుష్ఫలితాలను కూడా శోధించి రాసే పని జరగడం లేదు. ప్రచురించే వార్తా కథనాలకూ, ప్రచారమిచ్చే ఆర్థిక విధానాలకూ పొంతన వుండడం లేదు.

ఈ రోజులలో అధికతర ప్రభావం చూపుతున్న టివి ఛానళ్ల ధోరణికూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఆ పరిశీలన మరోసారి చేయవలసి వుంటుంది.

రెండు వ్యవస్థలు రెండు ప్రతిస్పందనలు



సుసాన్ హార్లిచ్

అమెరికాకు చెందిన 'పీపుల్స్ వీక్లీ వరల్డ్' పత్రికకు క్యూబాలో నివసిస్తున్న ఒక అమెరికా పౌరుని దగ్గరినుండి లేఖ వచ్చింది. కెనడాలో పుట్టి అమెరికా పౌరసత్వం పొందిన సుసాన్ హార్లిచ్ అనే వ్యక్తి ఈ లేఖ రాశాడు. ఆయన మానవ విజ్ఞాన శాస్త్రవేత్త (ఆంథ్రపాలిజిస్ట్). అమెరికాలోని న్యూఆర్లీన్స్ నగరాన్ని తాకిన పెనుతుపాను 'కత్రినా' మిగిల్చిన విషాదం నుండి నగర ప్రజలను రక్షించడానికి అమెరికా సైన్యం అనుసరించిన పద్ధతులను క్యూబాలో అటువంటి విషాదం వచ్చినప్పుడు అక్కడి సైన్యం వ్యవహరించే తీరుతో పోలుస్తూ ఆయన స్పందించి లేఖ రాశాడు. సుసాన్ 1992నుండి క్యూబాలో ఉద్యోగం చేస్తున్నాడు. 2005 ఆగస్టు 21వ తేదీ సంచికలో ప్రచురితమైన లేఖ పూర్తిపాఠం ఇలా ఉంది:

మిత్రులారా!

న్యూ ఆర్లేన్స్‌తో బాటు (అమెరికాలో పెనుతుపాను 'కత్రినా' తాకిన) ఇతర సముద్ర తీర ప్రాంతాల పరిస్థితిని నేను ఆసక్తితో గమనిస్తున్నాను. ప్రజల కొరకు, ప్రజలచేత, ప్రజలే నిర్వహిస్తున్నట్లు చెప్పుకునే (అమెరికా) ప్రభుత్వం యొక్క దారుణ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాంతాలు వినాశనానికి గురయ్యాయి. అసలా ప్రభుత్వం ఎప్పుడయినా ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల ప్రభుత్వంగా వ్యవహరించిందా అనేదే ప్రశ్నార్థకం.

సహాయం కోసం ఎదురుతెన్నులు చూస్తూ నాలుగైదు రోజులపాటు ఇళ్లకప్పుల మీద తలదాచుకున్నవారు తమ కష్టాలను గురించి చెప్పిన కథనాలెన్నింటినో చదువుతున్నాను.

వారికందిన సహాయం ఎలా ఉంది? తుపాకులు ఎక్కుబెట్టిన (అమెరికా) సైనికులు, ఇరాక్ ప్రజల పట్ల వ్యవహరించినట్లే తమ స్వంతదేశ ప్రజలపట్ల కూడా వ్యవహరిస్తున్నారు. ఇరాక్‌లో జరుగుతున్న దారుణాల్లో ఇరాకీ ప్రజల తప్పేమీ లేనట్లే ఇక్కడ అమెరికాలో దుస్థితికి లోనైన ప్రాంతాల్లో జరుగుతున్న దారుణాల వెనుక నల్లజాతీయులు, పేద తెల్లజాతీయులూ చేసిన తప్పేమీ లేదు. సైనికులు తుపాకులు గురిపెట్టి ఈ ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. "చేస్తున్నది వాళ్ల కోసమే"నన్న వాదనతో తమ చేతలను సమర్థించుకుంటున్నారు. విషాదం, విధ్వంసంలో చిక్కుకున్న ప్రజలు అక్కడే ఉంటామని అనుకోవడమే నేరంలాగా సైనికులు ఆ పేద ప్రజలపై తమ పశుబలాన్ని ప్రయోగిస్తున్నారు.

చాలా సంవత్సరాల క్రితం క్యూబాలోని గ్వాంటనామో ప్రాంతం బీభత్సమైన పెను తుఫాను బారిన పడినప్పుడు ఒక యువ పోలీసు ఉద్యోగి వ్యవహరించిన తీరు నా మదిలో ఇప్పటికీ మెదలుతోంది. ఆ యువ పోలీసు చేతిలో ఎలాంటి ఆయుధమూ లేదు. తన హృదయమూ, నోటిమాటలే ఆయన దగ్గరున్న ఆయుధాలు. ఒక ముసలామెను ఇల్లు వదిలి సురక్షిత ప్రాంతానికి బయలుదేరమని నచ్చజెపుతున్నాడు. ఆమెను ఒప్పించడానికి ఆయన ప్రయత్నించిన తీరు నన్ను కదిలించేసింది. ఆమె గువాసో నది ఒడ్డున నివసిస్తోంది. ఆ పట్టణానికి మూడువైపులా మూడు నదులు ప్రవహిస్తున్నాయి. ఆ మూడు నదులూ కూడా భారీ వర్షాలు, తుఫాన్లు సంభవించినప్పుడు పొంగి పొర్లుతుంటాయి. వరదలతో ఇళ్లను ముంచెత్తుతుంటాయి.

తన ఇల్లు వదిలివెళ్లటం ఆ ముసలి తల్లికి ఇష్టం లేదు. "నేను నది ఒడ్డున మెరకమీదే ఉంటున్నాను కదా! ఎందుకు ఖాళీచేయించడం. నాది గట్టిల్లు. వానలు, వరదలు దాన్నేమీ చేయలేవు. నాకొచ్చిన భయమేం లేదు. నేను సురక్షితంగానే వుంటాను" అని ఆమె మొండికేస్తోంది.

ఆమె తప్ప మిగతా వాళ్లంతా అప్పటికే ఇళ్లు ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లి

> **❝ ప్రకృతి వైపరీత్యం బారిన పడినప్పుడు, మానవుల ప్రాణాలనూ, పశువుల ప్రాణాలనూ కాపాడటం కంటే ముఖ్యమైనది మరేదీ లేదనుకునే దేశంలో (క్యూబాలో) నేను నివసిస్తున్నాను, పనిచేస్తున్నాను. దీనంతటినీ గూర్చి ఆలోచించు తున్నాను. ఒక వంతెన కూలిపోతే తిరిగి నిర్మించ వచ్చు. ఒక భవనం కూలిపోతే మళ్లీ కట్టుకోవచ్చు. అయితే పోయిన ప్రాణాన్ని తిరిగి తేలేము. పోయిన మనిషిని తిరిగి తీసుకురాలేము. ❞**

పోయారు. ఆమె కూడా ఇల్లు వదిలి వచ్చేట్లు నచ్చచెప్పడానికి ఆ యువ పోలీసు ప్రయత్నం చేస్తున్నాడు. "నాకేం ఫర్వాలేదు, నేను కదలను, ఇక్కడే వుంటాను" అని మొరాయిస్తోందామె.

ఎంత ప్రయత్నించినా ఆమెను ఒప్పించ లేకపోవటంతో ఆ యువ పోలీసు ఉద్యోగికి దుఃఖం ముంచుకొచ్చింది. కళ్లనుంచి నీళ్లు బొట బొటా కారాయి. ఆమెను చూస్తే అతనికి తన అవ్వ గుర్తుకొచ్చినట్లుంది. "అవ్వను ఇక్కడ వదిలేసి నేనెలా వెళ్లగలను?" అంటున్నాడు. చివరికి ఆ యువకుని పట్ల జాలితో ఆమె ఎట్టకేలకు ఇంటినుంచి బయటికొచ్చింది.

వృద్ధమహిళ, యువపోలీసు అక్కడ నుండి బయలుదేరారో లేదో అంతలోనే గువాసో నది మరింత ఉధృతంగా విరుచుకుపడింది. ఆ వరద తాకిడికి ఏదీ నిలవలేకపోయింది. ఎంతో గట్టిది, తన ఇంటికి ఎలాంటి భయమూ లేదనుకున్న ఆమె ఇల్లు కూడా వాళ్లు చూస్తుండగానే కొట్టుకుపోయింది. ఆమె ఒక్క ఉదటున శోకాలు పెట్టింది. తన ఇల్లు కొట్టుకుపోయినందుకు కాదు. ఆ యువకుని కన్నీరు ఆమెలో చలనం తెప్పించింది. ఆమె ప్రాణాలను కాపాడింది. అందుకే ఆ యువకుని పట్ల కృతజ్ఞతా భావంతో ఆమె కళ్లవెంట నీరు కారింది. మానవీయత ఉట్టిపడే ఈ ఉదంతాన్ని క్యూబాలోని ఆ రాష్ట్ర రేడియో పదేపదే ప్రసారం చేసింది.

ఈ ఉదంతం గూర్చి నేను పదేపదే తలచుకుంటున్నాను. ఎవరిని చూచినప్పుడు నాకు అది గుర్తుకొస్తున్నదో తెలుసా? ప్రజలకు "సహాయం" చేయటం కోసం తుపాకులు -తూటాలు చేతబూని (అమెరికా) సైనికులు న్యూ ఆర్లేన్స్‌కు తరలి వెళ్లటాన్ని చూసినప్పుడు. తుపాకి ఎక్కుపెట్టి 'సహాయం' చేయబూనుకున్నప్పుడు. ప్రజలకు 'సహాయం' చేయటానికంటూ తుపాకులు ఎక్కుపెట్టడం అంటే, వారిని మరింత భయాందోళనలకు గురిచేయటమే, మరింత కష్టనష్టాలపాలు చేయటమే అవుతుంది. అక్కడి ప్రజలకు కావలసింది తుపాకులతో భయపెట్టే 'సహాయం' కాదు. వారికి కావలసింది ఆప్యాయత, ఆదరణ, తినటానికి తిండి, తాగడానికి శుభ్రమైన నీళ్లు. వాళ్లకు కావలసింది తుపాకి గొట్టం కాదు. తుపాకులు పట్టుకొని వాళ్ల దగ్గరకు వెళ్లటం అంటే; దెబ్బమీద దెబ్బకొట్టడమే. అప్పటికే ఒక దఫా ప్రకృతి దెబ్బకొట్టింది. ఆ దెబ్బపైనే "రక్షకులు" మరో దెబ్బ కొట్టినట్లవుతుంది.

ఇదంతా ఎంతో చికాకు కలిగించింది. దారుణమైన విషాదం ఇది- అని సైనికులలోనే కొందరు ఖిన్నులయినారు.

ఇక్కడ శత్రువు ఎవరు? ఎవరిమీద ఈ దాడి? పాపం నల్లజాతి అమెరికన్లమీదనే ఈ దాడి. వారేమీ చేతగానివారు కాదుకదా. దోపిడీకి వ్యతిరేకంగా, జాతి వివక్షకు వ్యతిరేకంగా శతాబ్దాలుగా పోరాడిన సంప్రదాయం ఉన్న వారు. ప్రపంచ సంగీతపు తీరుతెన్నులనే మార్చేసిన సుసంపన్నమైన సంగీత సాంప్రదాయాల సృష్టికర్తలు వారు. మరెక్కడికైనా వెళ్లిపోవటానికి కావలసిన వనరులు లేనందువల్లనే న్యూఆర్లేన్స్‌లోనే జీవయాత్ర సాగిస్తున్నారు వారు.

ఇదంతా సరే. కత్రినా (తుఫాను)తో జనజీవనం అతలాకుతలం అయిన పరిస్థితిలో రోజుల తరబడి తమ ఇళ్ల కప్పుల మీదనే ఆశ్రయం పొంది బాధలు పడటం, సామూహికంగా పరస్పర సహాయం అందించుకోవటానికి వారు చేసిన ప్రయత్నాలు, ప్రదర్శించిన హుందాతనం బుష్‌కు, ఆయన గ్యాంగుకూ నచ్చలేదు. అందుకే వారిని పెద్దశత్రువుగా పరిగణించాడు. తుదకు ఈ వాస్తవాన్ని గుర్తించటం తప్ప గత్యంతరం లేని పరిస్థితి బుష్‌కు ఎదురయింది. అయితే, హృదయంలేని వారెప్పుడూ హృదయ స్పందన లేకుండానే కొనసాగుతారనుకోండి.

ప్రకృతి వైపరీత్యం బారిన పడినప్పుడు, మానవుల ప్రాణాలనూ, పశువుల ప్రాణాలనూ కాపాడటం కంటే ముఖ్యమైనది మరేదీ లేదనుకునే దేశంలో (క్యూబాలో) నేను నివసిస్తున్నాను, పనిచేస్తున్నాను. దీనంతటినీ గూర్చి ఆలోచించుతున్నాను.

ఒక వంతెన కూలిపోతే తిరిగి నిర్మించవచ్చు. ఒక భవనం కూలిపోతే మళ్లీ కట్టుకోవచ్చు. ఒక చమురు కేంద్రం ధ్వంసమయితే మళ్లీ ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే పోయిన ప్రాణాన్ని తిరిగి తేలేము. పోయిన మనిషిని తిరిగి తీసుకురాలేము.

అందువల్ల ప్రజలను కాపాడుకోవాలి. అసలు సిసలు సంపద ప్రజలే.

పెనుతుఫాను డెన్నిస్ తాకిడికి గురైన జులై 8వ తేదీన క్యూబాలో పదహారుమంది మృతి చెందినప్పుడు ఆ దేశం దేశమే విలపించింది. పదహారుమంది మృతి అంటే వారికి పెను విషాదమే. దుర్భరమైనదే. మనమంతా ఇంత కంటే మరింత జాగ్రత్తపడి వుండవలసింది. పదహారు ప్రాణాలు కోల్పోవలసింది కాదు అని ప్రతి ఒక్కరూ అన్నారు. మేమందరం కన్నీరు పెట్టాం.

క్యూబా ఎన్ని సమస్యలతోనైనా సతమతం అవుతుండనివ్వండి.

మనుషుల ప్రాణాలను ఎంతో అమూల్యమైనవిగా పరిగణించే ప్రజలూ, ప్రభుత్వమూ వున్న దేశం అది. అందువల్లనే అక్కడి పౌరరక్షణ వ్యవస్థ అంత బాగా పనిచేస్తున్నది. ఈ పని చేయటానికి కావలసింది భారీ వనరులు కాదు. ఏదైనా ప్రకృతి విపత్తు ఎదురయినప్పుడు ప్రజలను, అంటే యావన్మంది ప్రజలనూ సురక్షితంగా వుంచాలన్న మానవత్వంతో కూడిన అంకితభావం, రాజకీయ సంకల్పం వుంటే చాలు.

భౌతిక వనరుల రీత్యా చూస్తే, ప్రపంచంలో కెల్లా అత్యంత సంపన్నదేశం అమెరికా. అయినప్పటికీ స్వదేశంలోగాని, విదేశాలలోగాని ప్రజలు సురక్షితంగా వుండేట్లు చేయడం ఆ దేశం వల్ల జరిగేపని కాదు. చెయ్యనూ చెయ్యదు. పైగా ప్రజలకు హాని చేస్తుంది. నిజానికి చేసింది కూడా.

(అనువాదం: వాసిరెడ్డి)

సామ్రాజ్యవాద సేవలో 'ఆధునికానంతర వాదం'

కె. ఆనందాచారి

> **ఆధునికానంతర వాదం ముఖ్యంగా కళాసాహిత్య రంగాల్లోంచి ముందుకొచ్చింది. దీనిని సాహిత్య రంగంలో సామ్రాజ్యవాద సిద్ధాంతంగా మనం గమనించవచ్చు. ఈ వాదం మార్క్సిస్టు సిద్ధాంతంపై దాడిచేస్తుంది. ప్రపంచాన్ని మహోన్నతమైన మానవతా శిఖరాలకు చేర్చేందుకుగాను ఒక ఆయుధాన్ని అందించిన, శ్రామిక జనుల విముక్తికి బాటవేసిన మార్క్సిజంపై ఇది దాడిని ఎక్కుపెడుతుంది. మిడిమిడి జ్ఞానంతోనూ, ఆచరణలో జరిగే కొన్ని ఆటంకాలను చూపిస్తూ మొత్తంగా మార్క్సిజాన్ని తిరస్కరిస్తుంది.**

పెట్టుబడిదారీ వ్యవస్థకు సంక్షోభాలు రావడం సహజమని కార్ల్ మార్క్స్ చెప్పాడు. సంక్షోభాలు పెల్లుబికినప్పుడల్లా పెట్టుబడిదారీ సిద్ధాంత వేత్తలు ఒక నూతన సిద్ధాంతాన్ని, ఒక నూతన వాదాన్ని వాటికి కారణాలుగా ప్రతిపాదిస్తూ వస్తున్నారు. ప్రముఖ శాస్త్రవేత్త, "చరిత్రలో సైన్సు" గ్రంథ రచయిత జె.డి. బెర్నాల్ చెప్పినట్లు పెట్టుబడిదారీ ప్రపంచం తన ఆర్థిక, సామాజిక సంక్షోభం తీవ్రమైన ప్రతి సందర్భంలో ఒక కొత్త సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చింది. ఆర్థిక అల్లకల్లోలానికి వివరణగా ఒకసారి మాల్తస్ జనాభా సిద్ధాంతాన్ని తీసుకు వచ్చింది. జనాభా పెరుగుదలకు సమానంగా సంపద, వస్తూత్పత్తి పెరగడం లేదనీ, ఇదే సంక్షోభానికి కారణమని విశ్లేషించారు. అలాగే ఇంకొకసారి ఫ్రాయిడ్ మానసిక విశ్లేషణ ముందుకు తెచ్చి సామాజిక అరాచకానికి, యుద్ధాలకు వ్యక్తుల మానసిక స్థితి, ప్రవర్తన కారణమంటూ ఓ పెద్ద సూత్రీకరణ చేసి ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేశారు. ఇలా ఎన్నైనా చెప్పవచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని వైరుధ్యాలవల్ల, దాని అసంబద్ధ, అహేతుక, అమానుష విధానాలవల్ల తలెత్తే ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు పెట్టుబడిదారులు ఈ ప్రయత్నాలను ఉద్దేశ్యపూర్వకంగానే చేశారని జె.డి. బెర్నాల్ చెప్పాడు. ప్రస్తుతం ఆధునికానంతరం వాదం (పోస్ట్ మోడర్నిజం) అనేదాన్ని కూడా పెట్టుబడిదారులు ఇదే లక్ష్యంతో ముందుకు తెచ్చారు.

ఆధునికానంతర వాదం ఒక సిద్ధాంతం కాకపోయినా, అది ఒక వాదంగా మనకు అర్థమవుతుంది. ఈ వాదం ముఖ్యంగా కళా సాహిత్య రంగాల్లోంచి ముందుకొచ్చింది. దీనిని సాహిత్య రంగంలో సామ్రాజ్యవాద సాహిత్య సిద్ధాంతంగా మనం గమనించవచ్చు. ఈ వాదం ముఖ్యంగా మార్క్సిస్టు సిద్ధాంతంపై దాడిచేస్తుంది. ప్రపంచాన్ని మహోన్నతమైన మానవతా శిఖరాలకు చేర్చేందుకుగాను ఒక ఆయుధాన్ని, ఒక ఆలోచనను, ఒక ఆచరణను అందించిన, ప్రపంచ సృష్టికర్తలైన శ్రామిక జనుల విముక్తికి బాటవేసిన మార్క్సిజంపై ఇది దాడిని ఎక్కుపెడుతుంది. ఆచరణలో జరిగే కొన్ని ఆటంకాలను చూపిస్తూ, మిడిమిడి జ్ఞానంతోనూ మొత్తంగా మార్క్సిజాన్ని తిరస్కరిస్తుంది.

ఆధునికానంతర (పోస్ట్ మోడర్న్) దశ పారిశ్రామిక అనంతర సమాజానికి చెందినది. అమెరికా ఈ దశకు ఆదర్శరూపం. సమాజ పరిస్థితినంతా ఏకీకృత సిద్ధాంతం కిందకు తేవడం అశాస్త్రీయం అని ఈ సిద్ధాంతం చెబుతుంది. స్థిరత్వం, శాశ్వతత్వం అనే మాటలకు అర్థంలేదంటుంది. ఏకరూపమైన, ప్రజలందరికీ అంగీకారమైన సత్యం ఏదీ లేదంటుంది. ఎవరి అనుభవం వారిది, అన్ని అనుభవాలూ పాక్షికమైనవే అని చెబుతుంది. వర్గ ప్రాతిపదికన అందరి విముక్తినీ సాధించడం సాధ్యం కాదు, ఎవరి పోరాటం వారిదేనని వాదిస్తుంది. జీవితం ముక్కలుగా వుంది, ఆ ముక్కలను ఒకే గొడుగు కిందకు తెచ్చే ప్రయత్నాలు ఫలించవు, ఐక్యతకోసం కృషి చేయకూడదు, సమాజం మరిన్ని ముక్కలు కావడాన్ని ప్రేరేపించాలి అని వాదిస్తుంది.

ఆధునికానంతరవాద రచయిత అయిన తిరుపతిరావు మన తెలుగు సాహిత్యంలో వచ్చిన అభ్యుదయ, విప్లవ, దిగంబర, దళిత, స్త్రీవాద, మైనారిటీవాద సాహిత్యాన్ని పై అంశాల ప్రాదిపదికగా ఇటీవల ఒక వ్యాసంలో విశ్లేషిస్తూ మొదట మార్క్సిజంపై దాడిచేశారు. సోషలిజంలో అణచివేత ఉందనీ, ఇతర ఇజాలతో బాటు మార్క్సిజం మీద కూడా ప్రజలకు విశ్వాసం పోయిందని నిర్ధారణలు తీశారు. 1990లో సోషలిస్టు వ్యవస్థకు తగిలిన ఎదురు దెబ్బతో మార్క్సిజంపై ప్రపంచ ప్రజలకు విశ్వాసం పోయిందని సూత్రీకరించారు. సరిగ్గా సామ్రాజ్యవాదుల వాదనే ఇది. కేవలం సోవియట్‌లో సోషలిజం పతనాన్ని చూపించి, మొత్తం ప్రపంచ ప్రజల్లో మార్క్సిజం విశ్వాసాన్ని కోల్పోయిందని చెప్పడమే ఈ సూత్రీకరణలోని డొల్లతనాన్ని చాటుతోంది.

మానవజాతి చరిత్రలో అనేకమంది మహోన్నత మేధావులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు సమకూర్చడంలోనే మార్క్సు గొప్పతనం ఇమిడి ఉంది. మార్క్సిజం ఒక శాస్త్రంగా, మానవాభివృద్ధి క్రమంలోని వివిధ దశలను విశ్లేషిస్తుంది. అలాచేసే సందర్భంలో అది దోపిడీరహిత సమాజ స్థాపనకై జరిగే పోరాటంలో జనబాహుళ్యపు జోక్యాన్ని గుర్తిస్తుంది. దోపిడీ ఆధార పెట్టుబడిదారీ విధానం స్థానంలో సోషలిజం రావడమనేది దానికదే జరిగే ప్రక్రియకాదు. శ్రామివర్గ ప్రజాపోరాటానికి సరైన సైద్ధాంతిక రాజకీయ, నిర్మాణ నాయకత్వం

రచయిత 'సాహితీ స్రవంతి' నిర్వాహకులు, ఖమ్మం

> **"సంక్షోభంలో కూరుకుపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవీయ విలువతో జీవనం సాగించడం అసాధ్యమని అనుభవంలో తెలుసుకున్న ప్రజలు దీనికి వ్యతిరేకంగా పోరాటానికి సన్నద్ధమౌతారనే వాస్తవాలు సామ్రాజ్యవాదుల్ని భయానికి గురిచేస్తున్నాయి. ఈ భయంతోనే వారు ప్రజలను వాస్తవాలనుండి దూరంగా తీసుకు పోయేందుకు ఆధునికానంతర వాదాన్ని ఎన్నుకున్నారు."**

అందించినప్పుడు మాత్రమే సామాజిక పరివర్తన జరుగుతుంది. ఈ వర్గ చైతన్యం చల్లారినప్పుడు లేదా మొద్దుబారినప్పుడు విప్లవ ప్రతీఘాత శక్తులు తిరిగి తమ వర్గ పాలనను పునరుద్ధరించేందుకు దాన్ని ఉపయోగించుకుంటాయి.

ఇదే పరిస్థితి సోవియట్, తూర్పు యూరప్ దేశాల్లో జరిగింది. పెట్టుబడిదారీ విధానాల నుండి సోషలిజానికి పరివర్తన గురించిన అవగాహనలోపం, పెట్టుబడిదారీ వ్యవస్థ శక్తిని సరిగా అంచనావేయకపోవడం. మార్క్సిజం–లెనినిజం విప్లవకర సారాంశం నుండి వైదొలగడం అనే అంశాలు సోవియట్ కూలిపోవడానికి దారితీసిన ప్రధాన కారణాలు. అక్కడ కూలిపోయింది సోషలిజం కాదు. సోషలిస్టు విలువలు క్రమంగా కోల్పోయిన ఒక నిర్దిష్ట నమూనా మాత్రమే పతనమైంది. ఒక నమూనా విఫలమయినంత మాత్రాన ఆ నమూనాకు ప్రాతిపదికగా ఉన్న దృక్పథమే విఫలమైందని ప్రకటించే ధోరణి ఇది. విశ్వవ్యాప్తమైన, అఖండమైన, చరిత్రతో నిమిత్తం లేని సోషలిజం ఫలానా సరిహద్దులలో ఉంటుందని మార్క్సిస్టు ప్రామాణిక గ్రంధాలు ఎన్నడూ చెప్పలేదు సరికదా అలాంటి ఊహనైనా పెట్టుకోలేదు. వారు కొన్ని ప్రాథమిక సూత్రాలు మాత్రమే చెప్పారు. పోనీ మార్క్సిజాన్ని అధిగమించగల, కనీసం దానితో తూగగల తాత్విక ప్రత్యామ్నాయం ఏదైనా ఉందా అంటే అదీ లేదు. ఈనాడు మార్క్సిజాన్ని తెగనాడడమంటే అభివృద్ధి నిరోధక శక్తులకు, సామ్రాజ్యవాదులకు మేలు చేయడమే.

నేడు ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ దేశాలు, ముఖ్యంగా సోషలిస్టు రష్యా పడిపోయిన తర్వాత దోపిడీని వేగవంతం చేశాయి. గుత్త పెట్టుబడిదారీ అభివృద్ధి ఫలితంగా ఏర్పడ్డ పెద్ద పెద్ద బహుళజాతి కార్పొరేషన్లు ప్రభుత్వాలను శాసిస్తున్నాయి. వాటి ఆర్థిక కార్యకలాపాలు విస్తారమైనవి. దేశాల సరిహద్దులు దాటి విస్తరిస్తున్నవి. చిన్న చిన్న కంపెనీలను దిగమింగి, వర్ధమాన దేశాల జాతీయ సంస్థలపై పూర్తి ఆధిపత్యాన్ని పొంది, సరుకుల స్వభావాన్ని, సరుకుల ధరలను, పంపిణీ సంపూర్ణంగా నియంత్రిస్తున్నాయి. సామర్థ్యము, హేతుబద్ధీకరణ పేరుతో ఉద్యోగులను, కార్మికులను కోట్లాదిగా తొలగించి, పీడనకు, అణచివేతకు గురిచేస్తూ లాభాలన్నీ కేంద్రీకృతంగా తరలించుకుపోతున్నాయి. మరోవైపు వెనుకబడిన దేశాలు పేదరికాన్నీ, అనారోగ్యాన్నీ అనుభవిస్తున్నాయి.

సామ్రాజ్యవాద దశలో దోపిడీ పెరుగుతోంది. సమాజంలో వస్తు వ్యామోహం, జుగుప్సాకరమైన శృంగారము, అమానుష హింస, మానవ సంబంధాలలో వ్యాపార విలు వలు, అంతర్జాతీయ ఉగ్రవాదం, ఏకాకితనంతో ఆత్మహత్యలు మొదలైన క్షీణ విలువలు పెరుగుతున్నాయి. ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా సంక్షోభంలో కూరుకుపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవీయ విలువతో జీవనం సాగించడం అసాధ్యమని సకల ప్రజలకు అనుభవంలో తెలిసిన వాస్తవం. ఈ వాస్తవాలను తెలుసుకున్న ప్రజలు దీనికి వ్యతిరేకంగా సంఘటితమౌతున్న పరిస్థితులు, శ్రామిక వర్గమంతా పోరాటానికి సన్నద్ధమౌతారనే వాస్తవాలు సామ్రాజ్యవాదుల్ని భయానికి గురిచేస్తున్నాయి. ఈ భయంతోనే వారు ప్రజలను వాస్తవాలనుండి దూరంగా తీసుకుపోయేందుకు ఆధునికానంతర వాదాన్ని ఎన్నుకున్నారు. మానవీయ సామాజిక వ్యవస్థ ఏదీ లేదని, వర్గపరంగా విముక్తి సాధ్యం కాదని, సార్వత్రిక సమస్యలు, సార్వత్రిక పరిష్కారాలు అంటూ ఏమీ లేవని ప్రచారం చేస్తూ సామ్రాజ్యవాదానికి వత్తాసు పలికే వాదమే ఆధునికానంతర వాదం.

ప్రపంచీకరణ పేరుతో పెట్టుబడిదారులు ప్రపంచ ప్రజలను ఏకకాలంలో దోపిడీ చేస్తూ, కార్మికుల హక్కులను కాలరాస్తూ, ప్రపంచ దేశాలపై పెత్తనం చేస్తున్న నగ్న సత్యాన్ని చూస్తేనే, దోపిడీ చేసే వర్గమంతా ఒక్కటై సంపదను కొల్లగొడుతున్న వాస్తవాన్ని గమనిస్తూనే కేంద్రీకృత వ్యవస్థ ఏదీ లేదనడం, విశ్వజనీన సూత్రం లేదనడం ఈ వాదంలోని తప్పుడు సూత్రీకరణ. ఇక, ప్రపంచంలో దోపిడీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన సమస్త జనాన్ని ప్రాంతాలుగా, విభాగాలుగా చీలిపోవాలనడం కుట్రతో కూడుకున్న వాదం కాదా?

ఒక వ్యక్తి అనుభవాన్ని సెన్సారు లేకుండా అభివ్యక్తం చేయడమే స్వేచ్ఛకు నిర్వచనంగా పేర్కొనడం జరిగింది. స్వేచ్ఛ గురించి క్రిస్టోఫర్ కాడ్వెల్ చాలా వివరంగా చెప్పిన విషయం ఇక్కడ సరిపోతుంది. అలాగే భాష గురించి ఆధునికానంతర వాదనకు కూడా కాడ్వెల్ వివరణలోనే మనకు సమాధానం దొరుకుతుంది. కాడ్వెల్ ఇలా చెప్పాడు:

ఒక వ్యక్తి యొక్క అనుభవం కంటే సంఘటిత సామాజిక అనుభవం మరింత స్పష్టమైనది. భాషయొక్క సమిష్టి స్వభావమే దాన్ని విశ్వజనీనం చేసింది. దాని అనంతమైన శక్తికి కూడా ఈ సమిష్టి స్వభావమే కారణం. సూర్యుడు, ఆవు, ఇనుము...ఇలా వస్తువులకు సంబంధించిన చైతన్యం సాధారణ సమిష్టి స్వభావం నుండే నిర్మితమవుతాయి. మనిషి సంఘజీవిగా అందరితో కలిసి జీవించడానికిదే కారణం. ప్రకృతి పోరాటంలో మనిషి అభివృద్ధి చేసుకొంటున్న అతిసున్నితమైన ఆయుధం భాష. మనిషి ఒంటరిగా ప్రకృతి లోతులు పరిశోధించలేడు. కానీ ఒక సంఘజీవిగా, ఉత్పత్తికి యజమానిగా ప్రకృతిపై తన ప్రభావాన్ని విస్తరిస్తాడు. సత్యం యొక్క పరిధిని వ్యక్తం చేస్తాడు. శ్రమ నుండి పుట్టిందే సత్యం. వ్యక్తిగత ప్రపంచాలకు అర్థం ఉండదు. అలాగే భాష కేవలం నిర్జీవ బాహ్య వాస్తవికతనే సూచించదు. దానిపట్ల తన ధోరణిని కూడా సూచిస్తుంది. జీవితానుభవం నుండి సత్యం పుట్టింది. ప్రకృతితో మనిషి పోరాటం నుండి భాష పుట్టింది.

మానవ వివిధ శరీరాంగాల విధులు దేనికదే స్వతంత్రంగా ఉంటాయి. అయినా అవి ఒక విస్తృతమైన నాడీమండల వ్యవస్థద్వారా సమన్వయాన్ని కలిగి ఉంటాయి. సమాజ ఆర్థికాంశము కూడా అంతే. ఆర్థికాంశం నిత్యం ప్రత్యేకతను సంతరించుకుంటూ ఏకీకృతమౌతుంది. సమాజం ఎంత అభివృద్ధి చెందితే

కళా, సాహిత్యాలు అంతగా అభివృద్ధి చెందుతాయి. ఈ అభివృద్ధిని సాధ్యం చేసిన మనిషి సమాజంలోని, సంస్కృతిలోని అస్పష్ట లక్షణాలను స్పష్టపర్చాలి. కళ, సాహిత్యాల యొక్క కర్తవ్యం ఇది కాగా ఒక వ్యక్తి అనుభవాన్ని సెన్సారులేకుండా అభివ్యక్తం చేయడమే స్వేచ్ఛకు నిర్వచనంగా పేర్కొనడం సరియైనది కాదు.

పెట్టుబడిదారుడు తనను తానొక హీరోగా తలచుకుంటాడు. ఒంటరి పోరాటం చేస్తున్నాననుకుంటాడు. సహజంగా పుట్టిన మానవునికి సామాజిక బంధాలు కట్టిపడేశాయనుకుంటాడు. తానొకడే వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్నాననుకుంటాడు. బూర్జువా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఈ వ్యక్తి వాదన కూడా పెరిగిపోతుంది. ఉపరితలం భరించలేనంతగా పెరిగి పెరిగి కుప్పకూలిపోతుంది. బూర్జువా కవి కూడా తానొక స్వేచ్ఛా జీవిననుకొంటాడు. తనదైన హృదయోద్వేగంలో మనో ప్రోద్బలంతో అంతర్నిహిత శక్తులు విడుదల చేసి బాహ్య బంధాలను తెంచుకున్నాననుకుంటాడు.

> **“ పెట్టుబడిదారుడు తనను తానొక హీరోగా తలచుకుంటాడు. ఒంటరి పోరాటం చేస్తున్నాననుకుంటాడు. సహజంగా పుట్టిన మానవునికి సామాజిక బంధాలు కట్టిపడేశాయనుకుంటాడు. తానొకడే వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్నాననుకుంటాడు. బూర్జువా కవి కూడా తానొక స్వేచ్ఛా జీవిననుకొంటాడు. తనదైన హృదయోద్వేగంలో మనో ప్రోద్బలంతో అంతర్నిహిత శక్తులను విడుదల చేసి బాహ్య బంధాలను తెంచుకున్నాననుకుంటాడు. ”**

భూస్వామ్య సమాజం యొక్క నిర్బంధాలను నాశనం చేయాల్సిన అవసరాలనుండి బూర్జువా వ్యక్తివాదం పుట్టింది. ఫలితంగా సాంకేతికాభివృద్ధి పెరిగింది. అలాగే కవితారీతులు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందాయి. ఉత్పత్తిని ఉరకలు పెట్టించిన యంత్రం చివరకు పెట్టుబడిదారుణ్ణే పరుగులు పెట్టిస్తోంది. పెట్టుబడిదారుడు ఎప్పుడూ స్వేచ్ఛను గురించి మాట్లాడతాడు. ఎందుకంటే అది ఎప్పుడూ అతని పట్టునుండి జారిపోతుంది. బూర్జువా కవి దారి కూడా అదే. స్వేచ్ఛకు ఒంటరితనమే షరతు అనుకుంటాడు. సామాజికం అన్న ప్రతిదానిని తన మనో నమ్మకం నుండి బయటికి గెంటుతాడు.

ఇదే విధంగా ప్రకృతితోనూ, సామాజికంగానూ మనిషికి ఉన్న సంబంధాల లింకును ఆధునికానంతర వాదం ఎక్కడికక్కడ విడగొడుతుంది. ఈ ప్రాతిపాదికగానే ఆధునికానంతర వాదులు స్త్రీవాద, దళిత, మైనారిటీ వాద సాహిత్యాన్ని విశ్లేషిస్తున్నారు. దళిత వాదం, స్త్రీవాదం మార్క్సిస్టుల్ని మౌలికమైన ప్రశ్నలతో నిలదీస్తూ మొదలైందని వీరి వాదన. ఈ వాదాలు మార్క్సిస్టు సిద్ధాంతాన్నే సంక్షోభంలో పడేశాయని చెబుతారు. భారత దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు స్త్రీల సమస్యలు, కులం, మతం గూర్చి పట్టించుకోలేదని, అందువల్ల ఆధునికానంతర వాదంలో భాగంగా స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద ఉద్యమాలు పుట్టుకొచ్చాయని చెబుతున్నారు.

అయితే స్త్రీవాద, దళితవాద సాహిత్య ఉద్యమాల తాత్విక పునాదిని ఒకసారి పరిశీలించాలి. స్త్రీల సమస్యలను, దళితుల సమస్యలను కమ్యూనిస్టుపార్టీలు, పట్టించుకోలేదన్న వాదనకు బలం లేదు. ఉదాహరణకు తెలంగాణా సాయుధ రైతాంగ వర్గ పోరులో భాగంగా నాటి కుల పీడనపైనా, మత దురహంకారం పైనా కమ్యూనిస్టులు తిరగబడి పోరాటం చేశారు.

కుల సమస్య, మన భారతదేశం లోనే ఉన్న ప్రత్యేక సమస్య. ఇక్కడ కులానికీ వర్గానికీ సంబంధం ఉంది. ఈ సంబంధాన్ని మార్క్సిజమే శాస్త్రీయంగా విశ్లేషించగలదు. దళిత ఉద్యమాన్ని మార్క్సిస్టులు పట్టించుకోలేదనడం సరైంది కాదు. భారతదేశంలో కులం పునాదులు దేనిపై ఆధారపడి ఉన్నాయంటే పెట్టుబడిదారీ పూర్వ ఆర్థిక పునాదిపై ఏర్పడిన ఉపరితలంపై కుల వ్యవస్థ నిలిచిఉంది. ఈ పాపిష్టి వారసత్వాన్ని, అసహ్యకరమైన కుల అణచివేతను కూలదోసే ఏ ప్రయత్నమైనా సరే పెట్టుబడిదారీ పూర్వ ఆర్థిక రూపాల అవశేషాలను తొలగించే లక్ష్యాన్ని కలిగి వుండాలి. దీని అర్థమేమంటే భూస్వామ్య, అర్ధ భూస్వామ్య అవశేషాలను తొలగించడం. “ఆర్థిక పునాదిలో మార్పు తెచ్చిన తరువాత సైతం దాని ఉపరితలమూ దానితో ముడిపడివున్న సామాజిక అవగాహన మిగిలే వుండవచ్చు. దీనిని తుడిచి పెట్టటానికి తీవ్రమైన సైద్ధాంతిక పోరాటం అవసరం” అని ఏంగెల్స్ వివరించారు. అయితే పెట్టుబడిదారీ పూర్వ వ్యవస్థను మార్చడానికి ప్రయత్నం ఏమీ చేయకుండా హృదయాలను, స్వభావాలను మార్చడానికి చేసే విజ్ఞప్తులు, నిరసన ఉద్యమాలు అసహ్యకరమైన సామాజిక అణచివేతను ఎంతమాత్రం తొలగించజాలవు. మనదేశంలో ఈ అణచివేత నిలబడి వుండటానికి ప్రధాన కారణం ఈ సమస్య మూలాలలోకి వెళ్ళి దాన్ని పెకిలించడానికి జాతీయోద్యమ నాయకులు నిరాకరించడమే. కులవ్యవస్థ, కర్మసిద్ధాంతం కలిసి ఈ దేశాన్ని నిర్వీర్యం చేసిన తీరును మార్క్స్ కూడా సవివరంగా రాశాడు.

చాతుర్వర్ణ వ్యవస్థ ఒకనాడు ఎలా వుందో ఈనాడూ అలానే వుందనుకోవడం పొరపాటు. అయితే ఇప్పటికీ అగ్రవర్ణ ఆధిక్యత కొనసాగుతున్నప్పటికీ సమాజంలో ఆర్థిక రాజకీయ మార్పులు వచ్చాయి. ఈ విషయాన్ని కమ్యూనిస్టు నేత రణదివె ఇలా వివరించారు. “కులాలు త్వరగా రెండు ముక్కలవుతున్న విషయాన్ని గమనించాలి. ప్రతికులం ఉన్నవాళ్ళు లేనివాళ్ళుగా చీలిపోతున్నది. దాదాపు మొత్తం రైతాంగ కులాలన్నీ ఈ పరిణామానికి గురవుతున్నాయి. ఈ విధంగా అన్ని కులాలలోని కింది సెక్షన్ల మధ్య బంధం ఏర్పడుతున్నది. ఈ బంధాన్ని ఉమ్మడి పోరాటాల సందర్భంగా బలపరిచి పటిష్టం చేయాలి. ఇక్కడ కుల వ్యత్యాసాలు నిరాకరించి, ఒక్క వర్గ వ్యత్యాసాలను మాత్రమే గుర్తించి, కులం స్థానంలో వర్గాన్ని వుంచే సమస్యే లేదు. కుల వ్యత్యాసాల మధ్యనే దోపిడీకి గురయ్యే వర్గం పెరుగుతున్నదనే వాస్తవ విషయాన్ని గుర్తించాలి. ఈ ద్వంద్వ ప్రమాణాలను అర్థం చేసుకోలేని వారు సంస్కరణ వాదంలో కూరుకుపోయారు”.... ఇదీ కమ్యూనిస్టులకున్న అవగాహన.

నేటి కుల వ్యక్తీకరణలో రెండు కోణాలు న్నాయి. మొదటిది, సామాజిక అణచివేతకు కారణమవుతున్న పరిస్థితులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలన్న చైతన్యం అణగారిన కులాలలో పెరుగుతున్నది. ఇది సానుకూలాంశం. రెండవది, అణగారిన కులాలలో పెరుగుతున్న చైతన్యాన్ని కులం పరిధిలో బిగించడానికి ప్రయత్నం జరుగుతున్నది. ఈనాడు సాగుతున్న కుల ఉద్యమాల నాయకులు

రంగంలో కొన్ని భావజాలాలను సృష్టిస్తుంది. అదే మతపరంగా, కులపరంగా, సంప్రదాయాల పేరుతో, పాపం, పుణ్యం పేరుతో ఏర్పర్చిన భావజాలం. ఈ భావజాలం మాయలో పడిన వారు ఈ వ్యవస్థ సమర్థకులుగా మారిపోతారు. అందుకే స్త్రీ అణచివేతకు మూలమైన వర్గసమాజ దుష్టత్వంపై పోరాటానికి బదులుగా పోరాడే వారి నుండి వారిని వేరు చేయడానికి ప్రయత్నాలు జరుగుతాయి. మనదేశంలో స్త్రీ బానిస భావజాలానికి నైతిక తాత్వికతను ఏర్పరచుతున్న మతతత్వ ఛాందసవాదంపై నేడు మహిళలంతా పోరాడాల్సిన కర్తవ్యాన్ని గుర్తెరగాలి. సమాన వేతనాలకోసం, సమాన అవకాశాల కోసం జరిగే పోరాటాలలో స్త్రీలంతా కదలాలి. వర్గ సమాజ దుష్టత్వాన్ని ఆ స్పృహతోనే ఎదిరించాలి. శ్రామికవర్గ దృక్పథంలోనే స్త్రీ విముక్తి ఉంటుంది.

"సామాజిక విషయాలపై శాస్త్రీయ ఆలోచనను అందించిన మార్క్సిజంపై నిర్హేతుకమైన దాడి చేస్తున్న ఆధునికానంతర వాదపు అసలు స్వరూపాన్ని మనం అర్థం చేసుకోవాలి. మన తెలుగు సాహిత్యంలో నక్సలిజం ప్రభావంతో వచ్చిన విప్లవ సాహిత్యం, దళిత, స్త్రీ, మైనారిటీ వాద ప్రభావంతో వచ్చిన సాహిత్యం - ఎంతో నిజాయితీతో తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించాయి. అయితే ఈ సాహిత్య ఉద్యమాలు శాస్త్రీయ అవగాహన నుండి తొలగడంతో, సరైన తాత్విక పునాది లేమివల్ల నేడు వెనుకపట్టు పట్టాయి."

దీనిని ప్రోత్సహిస్తున్నారు. అంతేకాదు, కుల నిర్మూలనకు పూనుకోవాల్సిన నాయకులు కుల గుర్తింపుకోసం ఉద్యమాలు నడపడం మనం చూస్తున్నాం. ఎన్నో తరాలుగా దళితులను అణచివేస్తూ అగ్రవర్ణాలు అనుభవించిన అవకాశాలను, అంటే ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలను దళితులు కూడా సాధించుకునేదానికి పోరాటం చేయాలి. ఇలాంటి పోరాటం చేయకుండా, వెనుకబడిన సామాజిక దళిత జీవన దృశ్యాల్ని సాహిత్యంలోనూ, కవిత్వం లోనూ చూపించి కుల కోసం ఆవేశపడితే ప్రయోజనం ఉండదు.

అణచివేతతో కూడిన కులవ్యవస్థకు తాత్విక పునాదిని అందిస్తున్న హిందూ మతతత్వ వాదాన్ని విస్తృతస్థాయిలో వ్యతిరేకించాల్సిన తరుణం ఇది. అలాగే మన దేశాన్ని తిరిగి వలసదేశంగా మార్చ జూస్తున్న సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా కూడా పోరాడాల్సిన సందర్భమిది. ఈ సమయంలో, మతం, కులం, స్త్రీ-పురుష, ప్రాంతీయ భేదాల పేరుతో పీడితుల పోరాటాలను విచ్ఛిన్నం చేసేందుకు పాలక వర్గాలు పాల్పడుతున్నాయి. వీటిని గ్రహించి పీడనకు గురయ్యే వాళ్లందరినీ ఐక్యం చేయాల్సిన సమయంలో చీలికలను ఆహ్వానిస్తున్న ఆధునికానంతర వాదం పాలకవర్గాల చేతిలో పావుగా ఉపయోగపడుతోంది.

నేడు స్త్రీ వాదాలలో కూడా కొన్ని తేడాలున్నాయి. ప్రపంచంలో నేడు స్త్రీలు పురుషులతో సమానంగా చూడబడటం లేదు. అణచివేతకు, నిర్బంధానికి, హింసకు గురవు తున్నారు. స్త్రీల హక్కులకోసం, స్వేచ్ఛకోసం పోరాటం చేయవలసిన అవసరం ఉంది. ఈ పోరాటల్లోకి మహిళలు పెద్దఎత్తున రావడం ఆహ్వానించదగ్గ విషయం. అయితే స్త్రీలను పురుషులకు వ్యతిరేకంగా, పురుషులను స్త్రీలకు వ్యతిరేకంగా నిలబట్టే వాదాల గురించి పరి శీలించాలి. అసలు స్త్రీ పురుష భేదాల అంకురార్పణకు గల కారణాలను తెలుసుకోవాలి.

"స్త్రీ పురుషుల మధ్య మొదట సంతానోత్పత్తి కోసం శ్రమ విభజన జరిగింది. దంపతీ వివాహంలో స్త్రీ-పురుషుల మధ్య శ్రమ విభజనా, మొట్టమొదటి వర్గ విభజనా చరిత్రలో ఏకకాలంలో జరిగాయి. స్త్రీజాతిని పురుషజాతి అణచివేయడమే మొట్టమొదటి వర్గపీడన. దంపతీ వివాహ వ్యవస్థ రావడం చారిత్రకంగా ఒక అభివృద్ధే. బానిసత్వం, వ్యక్తిగత ఆస్తితోపాటే ఇదొక నూతన యుగాన్ని ఆరంభించింది. ఆ యుగమే నేటికీ కొనసాగుతోంది. ఈ యుగంలో ముందుకు వేసే ప్రతి అడుగూ సాపేక్షంగా ఒక వెనకడుగే. ఇందులో ఒకందరు దారిద్ర్యాన్ని, హీనజీవితాన్ని అనుభవిస్తే మరికొందరు సంపదనూ, అభివృద్ధినీ అనుభవిస్తారు. ఒక రకంగా చెప్పాలంటే ఈ వివాహ వ్యవస్థ నాగరిక సమాజం యొక్క సూక్ష్మరూపం. సమాజంలో కనపడే వైషమ్యాలు, వైరుధ్యాలూ మనకిందులో కూడా కనిపిస్తాయి. కుటుంబానికి తిండితెచ్చి పోషించవలసిన బాధ్యత మగవానిది. కుటుంబంలో అతని ఆధిక్యతకు మూలం అదే. కుటుంబం లోపల అతను బూర్జువా, భార్య శ్రామికురాలు. పారిశ్రామిక రంగంలో శ్రామికుని అణచిపెడుతున్న ఆర్థిక పీడన తొలగాలంటే, పెట్టుబడిదారీ వర్గానికి న్యాయచట్టాలలో వున్న ప్రత్యేక సౌకర్యాల్ని రద్దుపరచాలి. అలాగే కుటుంబంలో భార్యాభర్తలు సమాన హక్కులు కలిగివుండాలంటే స్త్రీజాతినంతా తిరిగి పారిశ్రామిక రంగంలోకి, ఉత్పత్తి ప్రక్రియలోకి తీసుకురావాలి. అప్పుడే వారు నిజంగా స్వతంత్రులవుతారు." (ఏంగెల్స్ కుటుంబం)

స్త్రీ పరాధీనత ఉత్పత్తి సంబంధాల నుండి పరాయికరించబడి పునరుత్పత్తి సంబంధాలకు పరిమితం చేయడంలోనే వుంది. ఫ్యూడల్ వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థ ఇటు స్త్రీనికానీ, అటు శ్రామికుని కానీ దోచుకుంటున్న విషయాన్ని మరుగుపరచడం కోసం సామాజిక

స్త్రీవాదం తెలుగు సాహిత్యంలో ఒక ఉద్యమంగా వచ్చింది. కానీ స్త్రీవాద ఉద్యమం ఆంధ్రప్రదేశ్‌లో అంతగా ముందుకురాలేదు. మనం ముందుకు వేస్తున్న ప్రతి అడుగూ అభివృద్ధికి సూచకమైనప్పటికీ ఆ అభివృద్ధి ప్రయోజనాలు ఎవరికి ఉపయోగపడుతు న్నాయనే సూక్ష్మ పరిశీలన కూడా చేయడం అవసరం.

ఇలా సామాజిక విషయాలపై శాస్త్రీయ ఆలోచనను అందించిన మార్క్సిజంపై నిర్హేతుకమైన దాడి చేస్తున్న ఆధునికానంతర వాదపు అసలు స్వరూపాన్ని మనం అర్థం చేసుకోవాలి. తెలుగు సాహిత్యంలో నక్సలిజం ప్రభావంతో వచ్చిన విప్లవ సాహిత్యం, దళిత, స్త్రీ, మైనారిటీ వాద ప్రభావంతో వచ్చిన సాహిత్యం - ఎంతో నిజాయితీతో తెలుగు సాహిత్యాన్ని కొత్తపుంతలు తొక్కించింది. కవిత్వం, కథ మొదలైన ప్రక్రియలలో నూతన ఒరవడి సృష్టించాయి. అయితే ఈ ఉద్యమాలు శాస్త్రీయ అవగాహన నుండి తొలగడంతో, సరైన తాత్విక పునాది లేమివల్ల నేడు వెనుకపట్టు పట్టాయి.

చివరిగా ఆధునికానంతర కవిత్వానికి సరిపోయే క్రిస్టఫర్ కాడ్వెల్ విశ్లేషణతో ముగిస్తాను. "కవిత్వం ఉపయోగించే మాటలు నానాటికి వ్యక్తిగతమవుతాయి. చివరకు కవిత్వం వ్యక్తిగతమై, గుప్తమై ఎవరికి అర్థం కానిదిగా మారిపోతుంది. అందువల్ల ప్రజలు కవిత్వాన్ని ఇక ఏ మాత్రం అంగీకరించరు. అది బూర్జువా పరిస్థితుల్లో మునిగిపోతుంది. వాస్తవ పరిస్థితులంటే బూర్జువాకు చిరాకు. వాస్తవ జీవితం దానికి కంటకంగా తోస్తుంది. కవిత్వానికీ అంతే, దానిది తిరుగుబాటు తత్వం. అంతేకాని విప్లవతత్వం మాత్రం కాదు".

భారత్-అమెరికా రక్షణ ఒప్పందం

భాగస్వామ్యమా? లొంగుబాటా?

రఘు

దాదాపు ఐదు దశాబ్దాలుగా ఏకాభిప్రాయంతో అమలవుతూ వచ్చిన భారత విదేశాంగ విధానాన్ని బిజెపి నాయకత్వం లోని ఎన్‌డిఏ ప్రభుత్వం పెద్దఎత్తున మార్చడానికి యత్నించింది. ప్రతి సందర్భంలోనూ అమెరికా మెప్పు పొందాలని యత్నించింది. ఎన్‌డిఏ స్థానంలో యుపిఏ ప్రభుత్వం వచ్చేటప్పటికే భారత్ -అమెరికా రక్షణ సహకారానికి సంబంధించిన ఒప్పందపు నమూనా సిద్ధం చేయబడి ఉంది.

భారత్-అమెరికాలు యిటీవల 10 సంవత్సరాల రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీనిపై రెండు దేశాల రక్షణ మంత్రులు జులై 7న సంతకాలు చేశారు. ఆ తరువాత అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్, భారత ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ 'విస్తృతమైన వ్యూహాత్మక సమస్యలపై' ఉమ్మడి ప్రకటన చేశారు.

ఈ ఒప్పందాన్ని కొందరు స్వాగతించారు. నూతన పథ నిర్దేశంగా అభివర్ణించారు. ఇలాంటి ఒప్పందం ఎప్పుడో జరిగి ఉండవలసింది అన్నారు. దీనివలన భారతదేశం ఆర్థికంగా, వ్యూహాత్మకంగా ప్రయోజనాలు పొందుతుందన్నారు. ప్రపంచంలో ప్రధాన శక్తిగా గుర్తింపు పొందడానికి దోహదపడుతుందన్నారు. మరికొందరు, భారతదేశం అమెరికా ఒత్తిళ్లకు లొంగి కీలకమైన రక్షణ ప్రయోజనాలనూ, సార్వభౌమాధికారాన్నీ తాకట్టుపెట్టింది అన్నారు.

ఈ రక్షణ ఒప్పందాన్నీ, ఉమ్మడి ప్రకటననూ బిజెపి వ్యతిరేకించడం చాలా ఆశ్చర్యకరం. బిజెపి దృష్టిలో దేశభద్రత అనేది దాని వద్దనున్న అణ్వాయుధాలపై ఆధారపడి ఉంటుంది. బిజెపి వైఖరిని వామపక్షాలే గాక విస్తృతమైన శాంతి ఉద్యమం, రక్షణరంగ నిపుణులు, మాజీ సైనికాధికారులు కూడా తప్పుపట్టారు.

భారతదేశ భద్రత, అణ్వాయుధశక్తిపై ఆధారపడి ఉందన్న వాదనను సిపిఐ (ఎం) త్రోసిపుచ్చుతూనే మరోవైపు దేశ సమగ్రతనూ, సార్వభౌమాధికారాన్నీ పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరింది. ఉమ్మడి ప్రకటనలో అంగీకరించిన అంశాలపై దశలవారీగా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ అదే సమయంలో అమెరికా తీసుకొనే నిర్ణయాలపై ఆచితూచి ప్రతిస్పందిస్తూ జాగ్రత్తగా అడుగులు ముందుకు వేయాలని కోరింది. రక్షణ ఒప్పందాన్నీ, ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్న అంశాలనూ సిపిఐ (ఎం) తీవ్రంగా పరిగణించింది. ప్రభుత్వం సామ్రాజ్యవాదంతో ప్రమాదకరంగా రాజీ పడుతోందని విమర్శించింది. కాని మీడియా విశ్లేషకులు "ప్రధానిని విమర్శించిన బిజెపి", "ప్రభుత్వాన్ని నిలదీసిన సిపిఎం" -లాంటి శీర్షికలతో రెంటినీ ఒకే గాటన కట్టారు. సిపిఐ (ఎం) వైఖరిలోని ప్రత్యేకతను, స్పష్టతను గమనించ చేయలేకపోయారు.

అమెరికా రక్షణ వ్యూహం

సోవియట్ యూనియన్‌తో సహా తూర్పు యూరపు దేశాలలోని సోషలిస్టు శిబిరం పతనమవడంతో సైనిక బలం రీత్యా అమెరికాకు ఎదురులేకుండాపోయింది. ఈ నేపథ్యంలో అమెరికా తన సైనిక వ్యూహం రూపొందించుకొన్నది.

అమెరికా రక్షణ వ్యూహం ఆ దేశంలోని డెమొక్రాట్లు, రిపబ్లికన్లు, మోడరేట్లు, కన్సర్వేటివ్‌ల ఏకాభిప్రాయంతో రూపొందించడుతుంది. విదేశీ విధానాన్ని, రక్షణ వ్యూహాన్ని వ్యక్తం చేయడంలో మాత్రం ప్రధాన పార్టీలలోనూ, పాలనా యంత్రాంగంలోనూ కొన్ని తేడాలు ఉంటాయి. కాని విధాన రూపకల్పన మాత్రం అమెరికా కార్పొరేటు సంస్థల ఆయుధ ఉత్పత్తిదారుల ప్రయోజనాలను రక్షించే విధంగా ఉంటుంది. 'కీలకమైన జాతీయ ప్రయోజనాలు' అనే భావన పూసల్లో దారంలా ఉంటుంది.

అమెరికా యొక్క 'ఎదురులేని సైనిక బలాన్ని, రాజకీయ ఆర్థిక బలాన్ని' దృష్టిలో పెట్టుకుని ప్రపంచాధిపత్య లక్ష్యంతో దేశాధ్యక్షుడు జార్జి బుష్ జాతీయ భద్రతా వ్యూహం రూపొందించాడు. సెప్టెంబర్-11 టెర్రరిస్టు దారులను సాకుగా చూపి దీన్ని అమలులోకి తెచ్చాడు. ఇతర దేశాలపైనా, వివిధ దేశాలకు చెందిన సంస్థలపైనా, ప్రత్యేకించి ఐక్యరాజ్యసమితిపైనా ఆధిపత్యం సంపాదించే లక్ష్యంతో అమెరికా ఉన్నట్లు వ్యూహపత్రంలోని వివిధ 'సెక్షన్లు స్పష్టం

> **“ ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, స్వేచ్ఛా వాణిజ్యం, సుపరిపాలన వగైరాలకు అమెరికా యిచ్చే నిర్వచనాలను యితర దేశాలు కూడా అంగీకరించేలా ఒత్తిడి చేయవలసిన అవసరం ఉందని వ్యూహ పత్రంలో పేర్కొన్నారు. 'ప్రపంచశాంతి పరిరక్షణకు ఏ ప్రభుత్వంగాని, ప్రభుత్వేతర సంస్థలు గాని అమెరికాను సవాలు చేయగల స్థితికి ఎదగకుండా చర్యలు చేపట్టడం అవసరం' అని కూడా వ్యూహ పత్రం పేర్కొన్నది. ”**

చేస్తున్నాయి.


జార్జి బుష్, 2001లో మొదటిసారి అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత రష్యాతో కుదుర్చుకున్న క్షిపణి విధ్వంసక ఒప్పందాన్ని అమెరికా ఏకపక్షంగా రద్దు చేయజూసింది. తమ క్షిపణి రక్షణ విధానాన్ని కొనసాగిస్తూ ఇతర దేశాల అణు పరీక్షలను ధ్వంసంచేసే వ్యవస్థలు నిర్మించడానికి శ్రీకారం చుట్టింది. జీవ రసాయనిక ఆయుధాల ఒప్పందంపై సంతకం చేయ నిరాకరించింది. మొత్తంగా ఒప్పందాన్ని సమాధి చేసింది. అంతర్జాతీయ నేరాల కోర్టుల పరిధిని గుర్తించ నిరాకరించింది. ఐక్యరాజ్యసమితి అధికారాలను, దాని పాత్రను తగ్గించ యత్నించింది. ఏకపక్షంగా మిలిటరీ చర్యలు చేపట్టింది.

ప్రజాస్వామ్యం, మానవ హక్కులు, స్వేచ్ఛా వాణిజ్యం, సుపరిపాలన వగైరాలకు అమెరికా యిచ్చే నిర్వచనాలను యితర దేశాలు కూడా అంగీకరించేలా ఒత్తిడి చేయవలసిన అవసరం ఉందని వ్యూహ పత్రంలో పేర్కొన్నారు.

అమెరికా రక్షణ వ్యవస్థలోని అన్ని ప్రధానమైన విభాగాలు వేర్వేరు ప్రయోజనాలను సాధించే లక్ష్యాలతో రూపొందింపబడ్డాయి. అమెరికా సైనిక వ్యవస్థ, తనను అధిగమించే రక్షణ వ్యవస్థను లేక తనతో సమానమైన రక్షణ వ్యవస్థను ఏ దేశం నిర్మించుకోకుండా చూస్తుంది. 'ప్రపంచశాంతి పరిరక్షణకు ఏ ప్రభుత్వంగాని, ప్రభుత్వేతర సంస్థలు గాని అమెరికాను సవాలు చేయగల స్థితికి ఎదగకుండా చర్యలు చేపట్టడం అవసరం' అని కూడా వ్యూహ పత్రం పేర్కొన్నది.

ఈ వ్యూహం అమలుకు ప్రత్యేకించి సెప్టెంబర్ 11 దాడులను అమెరికా ఉపయోగించుకుంది. 'టెర్రరిజంపై యుద్ధం', 'ప్రజాస్వామ్యాన్ని రక్షించడం' అనే పేర్లతో దుందుడుకు చర్యలు ప్రారంభించింది. ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధంతో ఇది ప్రారంభమైంది. ఏ దేశంలోనైనా పాలకులను మార్చే హక్కు తనకు ఉందని ఇరాక్ యుద్ధంతో స్పష్టం

2005 జులై 18న అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సౌత్ లాన్‌లో జార్జి బుష్‌తో చర్చిస్తున్న ప్రధాని మన్మోహన్ సింగ్



చేసింది. సెప్టెంబర్ 11 దాడులకు ప్రతీకారం అనేదాన్ని ఈ రెండు సందర్భాలలో సైనిక చర్యలకు కారణాలుగా చూపింది. ఆల్‌ఖైదాకు, తాలిబాన్లకు స్థావరాలు లేకుండా చేస్తానని ఆఫ్ఘనిస్తాన్‌పై దాడి చేసింది. విధ్వంసక యుద్ధాలను సాకుగా చూపించి కారణాలుగా చూపించి ఇరాక్‌పై దాడి చేసింది. అయితే ఈ సాకులేవీ అమెరికా యుద్ధ లక్ష్యాలను మరుగునపరచలేకపోయాయి.

ఆఫ్ఘనిస్తాన్ యుద్ధం తరువాత అమెరికా సైన్యం అక్కడ శాశ్వతంగా తిష్టవేసింది. ఆఫ్ఘనిస్తాన్ ఇరాన్‌కు పొరుగు దేశం. పశ్చిమాసియా ప్రాంతంలో పూర్వపు సోవియట్ యూనియన్ అనుకుని కీలకమైన ప్రాంతంలో ఉన్నది. మరోవంక అమెరికా హిందూ మహాసముద్రంలోని డిగో గార్షియా సైనిక స్థావరాన్ని కూడా పటిష్టపరుచుకొన్నది. మధ్య ఆసియాలోని ఉజ్బెకిస్తాన్, తజకిస్తాన్, కజకిస్తాన్, కిర్గిస్తాన్‌లలో కొత్త స్థావరాలను ఏర్పాటు చేసింది. టర్కీకి, గల్ఫ్ దేశాలతో రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసుకుంది. పాకిస్తాన్‌లోని జాకోబాబాద్, దల్‌బాడిక, పాశ్ని విమాన స్థావరాలను అవసరాల మేరకు ఉపయోగించుకొంటున్నది. ఇరాక్‌కు సరిహద్దుగా గల పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్ రాష్ట్రంలోని స్థావరాలనుండి సైనిక కార్యకలాపాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుంది. ఇరాక్ యుద్ధంతో అమెరికా పశ్చిమాసియాను చుట్టుముట్టింది. ఇరాక్‌లో పెద్దసంఖ్యలో అమెరికా సైనికులున్నారు. దీంతోపాటు అరేబియా సముద్రంలోని పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో దాని సప్తమ నౌకాదళం, మధ్యధరా సముద్రంలో పంచమ నౌకాదళం మోహరించాయి.

ఈ ఏర్పాట్లన్నిటి తరువాత మధ్య ఆసియా ప్రాంతం యిప్పుడు అమెరికాకు దాదాపు స్వాధీనం అయిపోనుంది. 21వ శతాబ్దంలో కాస్పియన్‌పైనా, మధ్యఆసియాలపైనా అమెరికా సాధించిన పట్టు వల్ల దానికి విస్తారమైన చమురు నిల్వలు అందుబాటులోకి వాచ్చాయి. అంతేగాక మధ్యధరా సముద్రం గుండా యూరపు వెళ్లే నౌకా మార్గాలపైనా, అరేబియా సముద్రం ద్వారా ఆసియా పసిఫిక్ ప్రాంతాలకు చేరే నౌకా మార్గాలపైనా కీలకమైన అదుపు లభించింది.

పోలాండ్‌లో సాలిడారిటీ తిరుగుబాటు, జెకొస్లేవేకియాలోని వెల్వెట్ విప్లవం ఆ యా దేశాలపై అమెరికా పట్టు

సాధించడానికి తోడ్పడ్డాయి. ఈ అనుభవాల ఆధారంగా మధ్య ఆసియాలోని ఒక దేశం తరువాత మరొక దేశంలో 'వర్ణ విప్లవాల'కు పథకాలు రూపొందింపబడుతున్నాయి. 'ప్రజాస్వామ్యం, మానవహక్కుల' పేరుతో అమెరికా బాహాటంగా నిధులు సమకూర్చి, టివి, వార్తాపత్రికల ద్వారా ప్రచారం చేసి జార్జియా, లిథుయేనియా ప్రభుత్వాలను కూల్చివేశారు. అదే నమూనా లెబనాన్‌లో ప్రయోగింపబడింది. కాని ఉజ్బెకిస్తాన్‌లో ఎదురుదెబ్బతిన్నది.

చమురుతో సంపన్నమైన పశ్చిమాసియా, మధ్య ఆసియా ప్రాంతమంతటా అమెరికా సైనిక, రాజకీయ చర్యలు చేపట్టింది. మాట వినని ప్రభుత్వాలను మార్చడం, బెదిరించడం చేస్తోంది. సిరియా, లిబియాల మెడలపై కత్తులు వేలాడదీసింది. అమెరికా తనను విభేదించే యూరపు మిత్ర దేశాలైన ఫ్రాన్స్, జర్మనీలను కూడా లక్ష్యపెట్టడం లేదు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుల విషయంలోగాని, ఖైదీలను యితర దేశాలకు తరలించి చిత్రహింసలకు గురిచేస్తున్న అంశంపై గాని ఇంగ్లండు, ఇటలీలు నోరెత్తకుండా కొరడా ఝుళిపిస్తున్నది. ప్రజాస్వామ్యం మానవహక్కులు గొప్పవే. కాని వాటికి అమెరికా యిస్తున్న నిర్వచనాలేంటి?

అమెరికా-దక్షిణాసియా

అమెరికా తన వ్యూహాత్మక కళ్లద్దాలనుండి భారతదేశాన్ని, దక్షిణాసియాను ప్రత్యేకించి పాకిస్తాన్‌ను చూస్తోంది. భారత్-అమెరికా మధ్య ఇటీవల రక్షణ ఒప్పందం కుదరడం అనేది ఒక్కసారిగా, హఠాత్తుగా జరిగిన పరిణామం కాదు. గత శతాబ్దానికి పైగా యిరుదేశాల దృక్కోణాల్లో మార్పులు రావడం ప్రారంభించాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఏజెండా గల అలీనోద్యమానికి భారతదేశం నాయకత్వ పాత్ర నిర్వహించింది. 'నీవు మాతో లేకపోతే మాకు వ్యతిరేకివే'-అనేది అమెరికా సూత్రీకరణ. దీన్ని అనుసరించి భారతదేశం సోవియట్ శిబిరంలో ఉన్నట్లు అమెరికా పరిగణించింది. అంతేగాక భారతదేశం యొక్క భౌగోళిక ఉనికి కూడా అమెరికా రక్షణ వ్యూహకర్తలు భారతదేశాన్ని గురించి అంతగా పట్టించుకొనలేకపోవడానికి కారణమైంది. మధ్య ఆసియా, తూర్పు ఆగ్నేయాసియా భూభాగాల్లో అమెరికా సైనిక స్థావరాలు ఉన్నాయి. ఈ

> **"పివి హయాంలో భారత విధానాలలో పునరాలోచన ప్రారంభమయింది. ప్రత్యేకించి నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో ఆర్థిక సరళీకరణ, విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరవడం, అమెరికాతో సంబంధాలు మెరుగు పరుచుకొనే ప్రయత్నం మొదలైంది. ఇందులో భాగంగా భారత-అమెరికా రక్షణ మంత్రులు యస్‌బి చవాన్, విలియం పెర్రీలు ఒక అంగీకార పత్రంపై 1995 జనవరిలో సంతకాలు చేశారు. ప్రస్తుత రక్షణ ఒప్పందానికి అది నాంది."**

స్థావరాల నుండి హిమాలయాలు భారతదేశాన్ని వేరు చేస్తున్నాయి. పశ్చిమాసియాకు భౌగోళికంగా, సాంస్కృతికంగా దగ్గరిద్వారంగా పాకిస్తాన్ ఉపయోగపడింది.

1962 భారత-చైనా యుద్ధ సమయంలో తప్ప, భారతదేశం ఏనాడూ చైనాకు ప్రత్యర్థిగా పరిగణించబడలేదు. అమెరికా మాత్రం చైనాను సోవియట్ యూనియన్‌తో సరితూగగల శక్తిగా పరిగణించింది. పాకిస్తాన్ ద్వారా అమెరికా చైనాతో సంబంధాలు పెట్టుకున్నది. పాక్-చైనాల మధ్యవ్యూహాత్మక సాన్నిహిత్యాన్ని అది దీనికోసం ఉపయోగించుకుంది. అయితే ఇప్పుడు ప్రచ్ఛన్నయుద్ధం ముగిసింది. పైగా చైనా ఆర్థికశక్తిగా ఎదుగుతోంది. కనుక ఇప్పుడు భారతదేశాన్ని చైనాపైకి ఉసిగొల్పేందుకు దానితో సరితూగగల శక్తిగా ఎదిగే అవకాశాన్ని గురించి ఆలోచించటం ప్రారంభించింది.

1960, 70 దశాబ్దాలలో అమెరికా పాకిస్తాన్‌కు చాలా ప్రాధాన్యత యిచ్చింది. సోవియట్ వ్యతిరేక, కమ్యూనిస్టు వ్యతిరేక రాజకీయ ఆర్థిక కూటమి అయిన 'సెంటో'లో పాకిస్తాన్ భాగస్వామి. సోవియట్ యూనియన్‌నూ, కమ్యూనిజాన్నీ వ్యతిరేకించి, అమెరికా వ్యూహాత్మక లక్ష్యాన్ని సమర్థించే సైనిక నియంతృత్వాలనూ, నియంతల పాలననూ బాహాటంగా సమర్థించడం అమెరికా విధానంలో అంతర్భాగమైంది. అందుకే పాకిస్తాన్‌లో దశాబ్దాల పాటు సాగిన మిలిటరీ పరిపాలన అమెరికాకు అభ్యంతరకరంగా తోచలేదు. పైగా ప్రయోజనకారిగా ఉంది.

1980 దశాబ్దంలో సోవియట్ సైన్యాన్ని ఆఫ్ఘనిస్తాన్ నుండి వెళ్లగొట్టే పేరుతో, అక్కడ సోవియట్ అనుకూల ప్రభుత్వాన్ని కూలదోసే ఉద్దేశ్యంతో అల్‌ఖైదాతో సహా ఇస్లామిక్ శక్తుల మతయుద్ధాలను అమెరికా ప్రోత్సహించింది. పాకిస్తాన్‌ను వ్యూహాత్మక సరఫరా కేంద్రంగా ఉపయోగించుకొని దానికి పెద్దమొత్తాలలో ఆర్థిక, సైనిక సహాయాన్ని అందజేసింది.

ప్రచ్ఛన్నయుద్ధం అంతం కావడం, తూర్పుయూరపు దేశాలు సోషలిస్టు శిబిరం నుండి వైదొలగడం, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో అమెరికా వ్యూహాత్మకంగా పాకిస్తాన్‌పై ఆధారపడడం తగ్గించింది. పాకిస్తాన్ యితర దేశాలనుండి అణ్వాయుధాలనూ, క్షిపణి సాంకేతిక పరిజ్ఞానాన్నీ రహస్యంగా పొందుతున్న విషయం అమెరికాకు తెలుసు. పాకిస్తాన్ పట్ల అమెరికా నిరాదరణ పెరగడంతో, అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ (సీనియర్) 1990లో పాకిస్తాన్‌కు సైనిక సరఫరాలు నిలిపివేశాడు. పాకిస్తాన్ వద్ద అణ్వాయుధాలు లేవని ధృవీకరించ నిరాకరించాడు. పాక్ డబ్బు చెల్లించినప్పటికీ దానికి ఎఫ్-16 యుద్ధ విమానాల సరఫరాను నిలిపివేయించాడు.

భారతదేశం-అమెరికా

సోవియట్ యూనియన్ పతనానంతరం భారతదేశంతో రక్షణ సంబంధాల విషయంలో అమెరికా వైఖరిలో మార్పు ప్రారంభమయింది. కాని భారత అమెరికా సంబంధాలు మెరుగుపరచుకోవడానికి భారత అణ్వస్త్ర పరీక్షలు, అణ్వస్త్రాల నిరోధక ఒప్పందం, క్షిపణి పరీక్షల నిరోధక ఒప్పందంల పట్ల అంగీకారం, అణు సాంకేతిక పరిజ్ఞానం మార్పిడిపై అమెరికా ఆంక్షలు మొదలైనవి ఆటంకాలుగా నిలిచాయి.

కాని రాజీవ్‌గాంధీ, పివి నరసింహారావు ప్రభుత్వాల హయాంలో భారత ప్రభుత్వం విదేశీ, రక్షణ విధానాలలోనే గాక ఆర్థిక విధానాలలో కూడా పునరాలోచన

> **“ ఒప్పందంలోని ముఖ్యమైన సూత్రీకరణలు, పదజాలం భారతదేశానికంటే అమెరికాకే సన్నిహితంగా ఉన్నాయి. ఒప్పందం యొక్క ఉమ్మడి సూత్రాలు ప్రయోజనాలపై చెప్పిన ముందుమాటలో 'రాజకీయ ఆర్థిక స్వేచ్ఛ, ప్రజాస్వామ్య సంస్థలు, చట్టబద్ధ పాలన, రక్షణ అవకాశాలు' గురించి ప్రస్తావించింది. పాశ్చాత్య తరహా ప్రజాస్వామ్యం పెంపొందించే పేరుతో యితర దేశాలకు షరతులను నిర్దేశించే అమెరికా భావజాలం అది. ”**

ప్రారంభించింది. భారత ప్రభుత్వం, ప్రత్యేకించి నాటి ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో ఆర్థిక సరళీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. భారతదేశంలో విదేశీ పెట్టుబడులకు తలుపులు తెరిచి, అమెరికాతో సంబంధాలు మెరుగుపరుచుకొనే ప్రయత్నం మొదలైంది. ఈ ప్రయత్నంలో భాగంగా భారత-అమెరికా రక్షణ మంత్రులు యస్.బి. చవాన్, విలియం పెర్రీలు ఇరు దేశాల రక్షణ సంబంధాలకు సంబంధించిన ఒక అంగీకార పత్రంపై 1995 జనవరిలో సంతకాలు చేశారు. ప్రస్తుత రక్షణ ఒప్పందానికి అది నాంది.

వాజ్‌పేయి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 1998 జులై-1999 జూన్‌ల మధ్య అమెరికా, భారత రక్షణ మంత్రులు స్ట్రోబ్ టాల్బోట్, జస్వంత్‌సింగ్‌లు ఎనిమిది దఫాలుగా చర్చలు జరిపారు. చర్చల వివరాలు అలా ఉంచి అసలు చర్చలు జరపడంలో రెండు పరిశీలించదగ్గ ముఖ్యాంశాలున్నాయి. మొదటిది, చర్చలు వట్టుదలతో కొనసాగించాలని, అమెరికా విదేశాంగ విధానంలో భారతదేశానికి మంచి ప్రాధాన్యత యివ్వాలని బుష్ ప్రభుత్వం నిర్ణయించింది. రెండవది, ఇరుదేశాల సైన్యాల మధ్య సంబంధాలు పెంచుకోవాలని రెండు దేశాలు నిర్ణయించాయి.

భారతదేశం : వ్యూహాత్మక ఆలోచనా విధానం

సాంప్రదాయకంగా భారతదేశ రక్షణ భాగస్వామిగా వున్న సోవియట్ యూనియన్ పతనంతో రక్షణ వ్యవహారాలను భారతదేశం సర్దుబాటు చేసుకోవడానికి కొంత సమయం పట్టింది. అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా ఎదిగినప్పటికీ దాని పట్ల భారతదేశానికి గల విముఖతకు చాలా కారణాలు ఉన్నాయి. పొరుగుదేశమైన పాకిస్తాన్‌తో అతి సన్నిహితంగా ఉండడం, అణ్వాయుధ వ్యాప్తి, టెర్రిజంల పట్ల అమెరికా ద్వంద్వ వైఖరి, ఒకవైపు పాకిస్తాన్‌కు ఉదారంగా మద్దతు యిస్తూ భారతదేశంపై ఆంక్షలు విధించడం-లాంటివి అమెరికా భారతదేశ సంబంధాల మెరుగుదలకు ఆటంకాలుగా నిలిచాయి. కాని ఆ తరువాత కాలంలో సంబంధాల మెరుగుదలకు అమెరికా చూపిస్తున్న చొరవను అందిపుచ్చుకోవలసిన అదృష్టంగా భారతదేశం భావించింది.

దాదాపు ఐదు దశాబ్దాలుగా ఏకాభిప్రాయంతో అమలవుతున్న భారత విదేశీ విధానాన్ని బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్చడానికి యత్నించింది. ప్రతి సందర్భంలోనూ అమెరికా మెప్పు పొందాలని యత్నించింది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, యుగొస్లావియాలపై అమెరికా నిస్సిగ్గుగా దురాక్రమణ దాడులు చేసినప్పుడు వాటిని ఖండించకుండా మౌనం దాల్చింది. అమెరికా క్షిపణి రక్షణ కార్యక్రమం ఆయుధ పోటీని పెంచుతుందని అత్యధిక దేశాలు భావించి, తిరస్కరించినప్పటికీ దాన్ని బలపరచిన మొట్టమొదటి దేశంగా భారత్ నిలిచింది. ఎన్‌డిఎ ప్రభుత్వం ఇజ్రాయేల్‌తో సైనిక, గూఢచార్య విభాగాలలో సన్నిహిత సంబంధాలు పెంచుకోవడం భారతదేశానికి సాంప్రదాయకంగా మిత్రులుగా ఉన్న పశ్చిమాసియా దేశాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. చైనా కారణంగా అణ్వస్త్ర పరీక్షలు జరిపామని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రకటించడం అమెరికా మెప్పుకోసమే. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా యుద్ధం ప్రారంభించినప్పుడు అమెరికా నౌకలకు, యుద్ధ విమానాలకు ఇంధనం నింపుకొనే సౌకర్యం కల్పిస్తానని ముందుకొచ్చింది. కాని భౌగోళిక పరిసరాలరీత్యా, పాకిస్తాన్ ప్రభుత్వంతో గల సాన్నిహిత్యం రీత్యా అమెరికా ఈ ఆహ్వానాన్ని మన్నించకుండా ఆగిపోయింది. అన్నిటికీ మించి ఇరాక్‌లో అమెరికా దురాక్రమణకు మద్దతుగా భారతసైన్యాన్ని పంపుతామని భారత డిప్యూటీ ప్రధానమంత్రి వాగ్దానం చేశాడు. రక్షణరంగంలో భారత్ సహకారం కోసం అమెరికా ప్రయత్నిస్తుండగా, అమెరికాతో సన్నిహిత సంబంధాల కోసం భారతదేశం ఆరాటపడింది.

ఎన్‌డిఎ స్థానంలో యుపిఎ ప్రభుత్వం వచ్చేటప్పటికే భారత-అమెరికా రక్షణ సహకారానికి సంబంధించిన ఒప్పందపు నమూనా సిద్ధం చేయబడి ఉంది. చర్చలు, సైనిక విన్యాసాలు, సమావేశాలు, సెమినార్లు చాలా జరిగాయి.

ఒప్పందం

ఇక భారత్-అమెరికాల మధ్య కుదిరిన రక్షణ ఒప్పందాన్ని పరిశీలిద్దాం. ఒప్పందంలోని ముఖ్యమైన సూత్రీకరణలు, పదజాలం భారతదేశానికంటే అమెరికాకే సన్నిహితంగా ఉన్నాయి. ఒప్పందం యొక్క ఉమ్మడి సూత్రాలు ప్రయోజనాలపై చెప్పిన ముందుమాటలో 'రాజకీయ ఆర్థిక స్వేచ్ఛ, ప్రజాస్వామ్య సంస్థలు, చట్టబద్ధ పాలన, రక్షణ అవకాశాలు' గురించి ప్రస్తావించింది. ఇతంగా అమెరికా భావజాలం. పాశ్చాత్య తరహా ప్రజాస్వామ్యం పెంపొందించే పేరుతో యితర దేశాలకు షరతులను నిర్దేశించే అమెరికా భావజాలం అది. 'టెర్రిజాన్నీ, హింసాత్మక మత తీవ్రవాదాన్ని ఓడించడం' ఉమ్మడి ప్రయోజనంగా పత్రంలో పేర్కొన్నారు. ఉభయ దేశాల భావాలను, లక్ష్యాలను పరిరక్షిస్తున్నప్పుడు ఎవరి పదజాలం ఉపయోగిస్తే ఏమిటి అని కొందరనవచ్చు. కాని అవి అలా పరిరక్షిస్తున్నాయా? అన్నదే అసలు ప్రశ్న.

'రెండు దేశాల రక్షణ బలగాలు ఉమ్మడి ప్రయోజనాలరీత్యా బహుళజాతుల కార్యకలాపాలలో సహకరించుకోవాలి' అన్నది ఒప్పందంలో ఒక నిబంధన (క్లాజు 4బి). అయితే ఎవరి ఆధ్వర్యంలో సహకరించుకోవాలో పత్రంలో ప్రస్తావించబడలేదు. '4బి'తో చేర్చి చదువుకోవాల్సిన మరొక క్లాజు '4జె' ఉంది. 'జయప్రదంగా శాంతిస్థాపన చర్యలు చేపట్టేందుకు ప్రపంచవ్యాప్త శక్తిని నిర్మించడం' అనేది ఈ 4జె క్లాజులో ముఖ్యాంశం. ఈ రెండింటిలో దేనిలోనూ కూడా ఐక్యరాజ్య సమితి ప్రస్తావన లేదు.

భారతదేశ సైన్యాలు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో పనిచేయాలి-అనేది భారతదేశ విధానం. అందుకే భారతదేశం ఇరాక్‌కు సైన్యాన్ని పంపించలేదు. ఇరాక్‌లో ఇష్టపడి వచ్చే వారితో కలిసి బహుళజాతి సైనిక కార్యకలాపాలు నిర్వహించడం అమెరికా విధానం. గతంలో యుగోస్లావియాలోనూ, ఆఫ్ఘనిస్తాన్‌లోనూ, ఇటీవల ఇరాక్‌లోనూ సైన్యాలు అమెరికా ఆదేశాల మేరకు పనిచేశాయి. సమర్థవంతంగా సైనిక కార్యకలాపాలు నిర్వహించేందుకు 'ఒకే ట్రిగర్‌పై రెండు వేళ్లను నివారించేందుకు' అలా చేయాలి అంటుంది అమెరికా. ఐక్యరాజ్యసమితి పతాకం కింద పనిచేయడం పట్ల విముఖత చూపడం, అమెరికా నాయకత్వంలోని కూటములకు ప్రాధాన్యత యివ్వడం కూడా అమెరికా సాధారణంగా చేసే పనులే.

ఒప్పందం కేవలం ఒక చట్రం మాత్రమేనని అది ఏ దేశాన్నీ ఒక ప్రత్యేక కార్యక్రమానికి కట్టుబడి ఉంచలేదని, ఐక్యరాజ్యసమితి జెండా కింద మాత్రమే భారత సైన్యాలు పనిచేస్తాయని మనం పట్టుపట్ట వచ్చునని రక్షణమంత్రి ప్రణబ్ ముఖర్జీ చెప్పారు. మరి అలాంటప్పుడు ఇరు పక్షాలు అంగీకరించిన విషయాలే ఒప్పందంలో ఉన్నాయని ఎలా అనగలరు? ఎందుకంటే ఐక్యరాజ్యసమితిని లెక్కచేయకుండా స్వంతంగా కార్యకలాపాలు నిర్వహించాలని ఒప్పందంలో అమెరికా చెబుతోంది. మరి అలాంటప్పుడు ఒప్పందానికి భారత్ కట్టుబడ్డం అంటే ఐక్యరాజ్యసమితిని కాదనడమే అవుతుంది కదా! ఈ డొంకతిరుగుడంతా ఎందుకంటే భారతదేశం ఒప్పందంపై సంతకం చేయడం ద్వారా అమెరికా మెప్పు పొందదలచుకొన్నది. ఒప్పందంలో ఆధిపత్యం వహించేది అమెరికా వైఖరి. భవిష్యత్తులో ఎవరికి ఏం చేయాలో నిర్ణయించేది అమెరికా. మాటలకంటే చేతలు బలమైనవి కదా!

> “ విధ్వంసక ఆయుధాల వ్యాప్తిని నిరోధించే పోరాటానికి సిద్ధం కావాలని ఒప్పందంలోని క్లాజు-4ఇ నిర్దేసిస్తుంది. చర్చల ఫలితంగా ప్రజా విధ్వంసక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం ఎగుమతిపై కంట్రోళ్లను కఠినతరంచేస్తూ భారతదేశం చట్టాన్ని ఆమోదించింది. అంటే “మారణాయుధాలు వ్యాప్తిగా కుండా” అమెరికా నాయకత్వంలో పనిచేయడానికి భారత్ సంసిద్ధతను తెలిపిందన్న మాట. అమెరికా నాయకత్వానికి భారత దేశపు ఆమోదాన్ని ఈ క్లాజు సూచిస్తుంది. ”

భారత-అమెరికా సైనిక కార్యక్రమాలకు చెందిన ఒక ఘటన ఒప్పందంలోని ప్రమాదాలకు ఉదాహరణగా నిలుస్తుంది. 2003లో బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం 'స్వేచ్ఛావాణిజ్యానికి రక్షణ కల్పించేందుకు' భారత యుద్ధ నౌకలను మలాకా జలసంధి గూండా పోయే అమెరికా వ్యాపార నౌకలకు రక్షణగా పంపించింది. తీరప్రాంత దేశాలైన మలేషియా, ఇండోనేషియాలు విదేశీ నౌకల చొరబాటు పట్ల తీవ్రమైన అంసతృప్తిని వ్యక్తం చేశాయి. ఇలాంటి స్థితిలో ఈ ప్రాంతంలో అమెరికా జోక్యాన్ని ప్రోత్సహించాలా? లేక సామ్రాజ్యవాద, దాని మిత్రదేశాల మిలిటరీ బలాలను దూరంగా వుంచేందుకు భావ సమైక్యతగల ఆగ్నేయాసియా దేశాలతో సహకరించాలా? ఈ రెంటిలో దేనిలో భారత ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయనేది భారతదేశం నిర్ణయించుకోవాలి. బిజెపి నాయకత్వంలోని గత ప్రభుత్వం యిచ్చిన ప్రాధాన్యత చాలా స్పష్టమే. ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాల్సి ఉన్నది.

ఎన్‌డిఎ ప్రభుత్వం 'క్షిపణి విధ్వంసక ఇజ్రాయిల్ యారో' కొనాలని ప్రయత్నించింది. అణ్వస్త్ర వ్యాప్తి నియంత్రణకు సంబంధించి సూక్తులు వల్లించే అమెరికా ఈ కొనుగోలును అడ్డుకొన్నది. అదే సమయంలో మొదటి ఇరాక్ యుద్ధంలో సరిగా పనిచేయని అమెరికా 'క్షిపణి విధ్వంసక-పేట్రియాట్' క్షిపణులను భారతదేశానికి అమ్ముతానన్నది. కాని దాని విలువలపట్ల, పనితీరుపట్ల నిపుణులు సందేహాలు వ్యక్తం చేయడంతో ఆగిపోయింది.

విపరీతమైన ఖరీదుగల క్షిపణి విధ్వంసక పేట్రియాట్/యారోలు కొనడం మంచిదే అని కళ్లకు సైనిక పొరలు కమ్మిన బిజెపి నాయకత్వంలోని ప్రభుత్వం అనుకోవచ్చు. అలాంటి వాటి అమ్మకాలతో రేధియాన్ లాంటి అమెరికా కంపెనీలు వేలకోట్ల డబ్బు గడించ వచ్చు. కాని భారతదేశ రక్షణకు అవి అవసరమా అన్నది ముఖ్య విషయం. భారత-పాకిస్తాన్ సంబంధాల దృష్టితో చూసినప్పుడు అవి అవసరంగా భావించవచ్చు. కాని వాటి పరితీరు చాలా సందేహాస్పదంగా ఉంది. దీనికి మారుగా అణ్వాస్త్రాలను, ఇతర విధ్వంసకాయుధాలను పరిమితం చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం భారత-పాకిస్తాన్‌లకు ప్రయోజనకారిగా ఉంటుంది. కాని ఈ పనిచేయకుండా అమెరికా అంటకాగితే నక్షత్ర యుద్ధాలు, క్షిపణి విధ్వంసకాయుధాలు, వాటి పరిశోధన అభివృద్ధిలో భారతదేశం భాగస్వామిగా మారాలని అమెరికా ఆహ్వానించిందని కొందరు అశాభావం వ్యక్త చేస్తున్నారు. ఇది సైన్సుతో మేళవించిన కట్టుకథగా మరికొందరు వర్ణించారు. అలాంటివి అమెరికాకు వదిలివేయడం మంచిది. అమెరికా కావాలనుకొంటే తన డబ్బుతో తానేమైనా చేసుకోవచ్చు. ఆచరణ సాధ్యం గాని, అధిక వ్యయంతో కూడిన ఆయుధ పోటీలోకి భారత్‌ను లాగడం వలన అమెరికా ఆయుధ కంపెనీలు లాభాలు పొందుతాయి. కాని భారతదేశం పొందే ప్రయోజనమేమీ ఉండదు.

విధ్వంసక ఆయుధాల వ్యాప్తిని నిరోధించే పోరాటానికి సిద్ధం కావాలని ఒప్పందంలోని క్లాజు-4ఇ నిర్దేసిస్తుంది. దీనిపై భారతదేశంలోనూ, పొరుగుదేశాలలోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమయింది. చర్చల ఫలితంగా ప్రజా విధ్వంసక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం ఎగుమతిపై కంట్రోళ్లను కఠినతరంచేస్తూ భారతదేశం చట్టాన్ని ఆమోదించింది. అంటే "మారణాయుధాలు వ్యాప్తిగాకుండా" అమెరికా నాయకత్వంలో పనిచేయడానికి భారత్ సంసిద్ధతనుతెలిపిందన్న మాట. అమెరికా నాయకత్వానికి భారతదేశపు ఆమోదాన్ని ఈ క్లాజు సూచిస్తుంది. ఆస్ట్రేలియా, జపాన్, పోలాండ్ లాంటి అమెరికా అత్యంత మిత్రదేశాల సరసన భారతదేశాన్ని కూడా అమెరికా చేర్చింది. దీనిననుసరించి విధ్వంసకర ఆయుధ పరికరాలు తీసుకుపోతున్నాయనే

> **"ప్రభుత్వం కీలకమైన జాతీయ ప్రయోజనాలను గుర్తించి, రక్షణ విధానాన్ని సమీక్షించి, వీలైనంత విస్తృతమైన ఏకాభిప్రాయాన్ని సాధించి, స్వతంత్రమైన ముందు చూపుగల రక్షణ విధానాన్ని రూపొందించాలి. అప్పుడు భారతదేశం తన అవసరాలకు, ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా నిర్దిష్టమైన చర్యలు చేపట్ట గలుగుతుంది. ఇది దేశ ప్రయోజనాలరీత్యా అవసరం."**

అనుమానంతో సభ్యదేశాలు ఇతర దేశాల విమానాలనూ, సముద్రంలోని నౌకలనూ తనిఖీ చేయవచ్చు. అందరికీ హక్కున్న సముద్రజలాలలో అలాంటి తనిఖీలకు పాల్పడ్డం సముద్ర చట్టాన్ని ఉల్లంఘించడమేనని వచ్చిన విమర్శలను అమెరికా త్రోసిపుచ్చింది. అమెరికా దురాక్రమణదారీ చర్యలలో భాగస్వామి కావాలని భారతదేశం ఎందుకు కోరుకోవాలి? భారతదేశానికి దొంగరవాణా నిరోధించడానికీ, సముద్రాలపై జరిగే దొంగతనాలను నిరోధించడానికీ భారత్ పూనుకుంటే చాలా సమస్యలు వస్తాయి. సమస్యల పరిష్కారానికి మార్గం ఆలోచించాలిగాని అనవసర జోక్యాల వలన ఒనగూడే దేమిటి? అమెరికా నౌకల్ని అంటిపెట్టుకొని ఉండడం తప్ప.

'రెండుదేశాల సైన్యాల మధ్య సంబంధాలకు అవకాశాలు కల్పించే క్లాజులు' ఉమ్మడిగా పనిచేసే సామర్థ్యాన్ని పెంచుతాయి. రక్షణ వ్యవస్థల మధ్య అవగాహనను పెంపొందిస్తాయి. రెండు దేశాల సైన్యాలు కలిసి పనిచేసేందుకు యుద్ధ పరికరాలు ఒకే మాదిరిగా ఉండాలి. లేక వీలైనంత వరకు పరస్పరం మార్చుకొనగలిగినవిగా ఉండాలి. కాని ఇప్పుడు రెండు దేశాల ఆయుధాలు అలా లేవు. అందువల్ల ప్రస్తుత పరిస్థితులలో రెండు దేశాలు కలిసి పనిచేయడం అంటే మన రక్షణ వ్యవస్థలోని బలహీనతలను అమెరికా అంచనా వేయడానికి తోడ్పడమే అవుతుంది.

ఒప్పందం వల్ల ఇరుదేశాల మధ్య 'రక్షణ పరికరాల వాణిజ్యం విస్తరిస్తుందని' క్లాజు 4ఎఫ్ గురించి చెబుతున్నారు. కాని ఆచరణలో అమెరికా అమ్మడం భారతదేశం కొనడం జరుగుతుందని కొద్దిమంది మాత్రమే గుర్తించారు. అమెరికా రక్షణ రంగానికి చెందిన ఉన్నతాధికారులు రావడం, భారత మంత్రులు స్వాగతాలు చెప్పడం వచ్చిన అధికారులు యుద్ధ విమానాల లాంటి మిలిటరీ సాధనాలను సమకూర్చుతామనడం, భారతదేశానికి గతంలో లేని దాదాపు ఎప్పటికీ సాధ్యపడని అధునాతన యుద్ధ పరికరాలు కుప్పలు తెప్పలుగా వచ్చిపడతాయని సమ్మబలకడం లాంటి ప్రచారాల పట్ల ప్రచార సాధనాలు అత్యుత్సాహం ప్రదర్శించాయి. అమెరికా యుద్ధ పరికరాలనూ, ఆయుధాలనూ అమ్మడమే గాక సాంకేతిక పరిజ్ఞానం అందజేయడం కలిసి ఉత్పత్తి చేయడం, పరిశోధన అభివృద్ధి ఉమ్మడిగా సాగించడానికి అంగీకరించిందని ప్రచారాలు జరిగాయి.

ఒప్పందంపై సంతకాలు జరగక ముందే అమెరికా యఫ్-16, 18 హార్నెట్ యుద్ధ విమానాలను కొనమని భారతదేశానికి చెప్పింది. ఈ విమానాలు తయారు చేసే కంపెనీలతో కలిసి భారత దేశం విమానాల ఉత్పత్తిలో పాల్గొనవచ్చునని చెప్పింది. కొనవలసిన జాబితాలో వాటిని చేర్చమని కోరింది. భారతదేశం వెంటనే జాబితాలో చేర్చింది. ఆ కంపెనీల ప్రతినిధులు భారత్‌తో బేరసారాలకు వచ్చారు. అయితే అమెరికన్ కంపెనీలతో కలిసి విమానాలు తయారు చేయడమంటే సాంకేతిక పరిజ్ఞానం మార్పిడి కాదని, పరికరాలను కలిపి కూర్చడమేనని చావు కబురు చల్లగా చెప్పారు. అది కూడా కేవలం ఎఫ్-16కి మాత్రమే వర్తిస్తుంది గాని హార్నెట్స్‌కి కాదని నెమ్మదిగా చెప్పారు. అదీ కూడా ఎఫ్-16 పెద్ద సంఖ్యలో కొంటేనేనని తెలియజెప్పడంతో భారత్ చల్లబడపోయింది. యుద్ధ విమానాలు తీసుకుపోయే ఆయుధాల ప్రసక్తి లేకుండానే విమానాలు అమ్మజూపారని, ఆ అంశం తరువాత అవసరాలను బట్టి పరిశీలించడం జరుగుతుందని తెలియవచ్చింది.

ఇక ఈ యుద్ధ విమానాలు భారత దేశానికి అవసరమైనవీ కావు, అమెరికా నమ్మబలికినట్లు అత్యంతాధునిక సాంకేతిక పరిజ్ఞానంగలవీ కావు. ఎఫ్-16 కాలం చెల్లిపోయిన యుద్ధ విమానాలు. వాటికి ఆర్డర్లు లేవు. కంపెనీ మూసివేతకు సిద్ధమవుతోంది. అంతేగాక అమెరికా సరఫరాలు, విశ్వసనీయత కూడా అంతంతమాత్రమే. విడి పరికరాలు నాసిరకానికి చెందినవి. పాకిస్తాన్ డబ్బు చెల్లించినప్పటికీ ఎఫ్-16 యుద్ధ విమానాలు సరఫరా చేయకపోడానికి కారణం అమెరికా రాజకీయ జోక్యమేనని కూడా అందరికీ తెలిసిందే.

సంక్షిప్తంగా చెప్పాలంటే భారత దేశం కావాలని కోరిన యుద్ధ పరికరాలను అమెరికా అమ్మదు. ఇతర దేశాల నుండి కొనాలని ప్రయత్నిస్తే అడ్డుపడుతుంది. అడ్డుపడడానికి కారణం భారత ఉపఖండంలో బలాల సమతుల్యతను కాపాడడం అంటుంది. మరో వైపు భారతదేశానికి అమ్మజూపే యుద్ధ పరికరాలు నాసిరకానికి చెందినవి. పొరుగు దేశాలలో లభ్యమయ్యేవే. అంతకంటే మంచివీ, షరతులు లేకుండా లభించే వనరులూ చాలా ఉన్నాయి. అయినా ఈ ఆయుధాలను అడ్డం పెట్టుకుని ఉపఖండంలో భారతదేశపు బలం పెరగకుండా అమెరికా జాగ్రత్తపడుతోంది.

భారతదేశం రక్షణ వ్యూహాన్ని సక్రమంగా రూపొందించుకోక పోవడం వలన చాలా సమస్యలుత్పన్నమవుతున్నాయి. రక్షణ వ్యూహంపై విస్తృతమైన ఏకాభిప్రాయ సాధనకు రాజకీయ సంస్కృతి అడ్డుపడుతోందని కొందరు అభిప్రాయపడుతున్నారు. చాలా బూర్జువా పార్టీలకు విదేశాంగ విధానంపై స్పష్టమైన వైఖరి లేకపోవడం వాస్తవమే. అవి అధికారంలో ఉన్నప్పుడు ఒకపాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక పాట అందుకొంటు న్నాయి నిజమే. అయినప్పటికీ ప్రభుత్వం కీలకమైన జాతీయ ప్రయోజనాలను గుర్తించి, రక్షణ విధానాన్ని సమీక్షించి, వీలైనంత విస్తృతమైన ఏకాభిప్రాయాన్ని సాధించి, స్వతంత్రమైన ముందు చూపుగల రక్షణ విధానాన్ని రూపొందించాలి. అప్పుడు భారతదేశం తన అవసరాలకు, ఆశయాలకు, లక్ష్యాలకు అనుగుణంగా నిర్దిష్టమైన చర్యలు చేపట్ట గలుగుతుంది. ఇది దేశ ప్రయోజనాలరీత్యా అవసరం.

(అనువాదం: కె. కేశవరెడ్డి)

విశ్లేషణ

మార్క్సిజం-వ్యక్తి-సమాజం

జి. సిమిర్‌నోవ్

మార్క్స్ మానవ స్వభావాన్ని శాస్త్రీయంగానూ, విప్లవాత్మకంగానూ, లోతుగానూ అధ్యయనం చేసి వ్యక్తిని గురించి తన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. ఆయన కృషిని అర్థం చేసుకోవాలంటే మానవుడి పరాయీకరణ, స్వేచ్ఛ, సంపూర్ణ అభివృద్ధి అనే మూడు అంశాలను పరిశీలించాలి.

వ్యక్తిని గురించిన అధ్యయనం మార్క్సిజం-లెనినిజంలో చాలా ప్రాధాన్యం ఉన్న అంశం. మార్క్సిస్టులు వ్యక్తి సమస్యల గురించి, అతని స్వేచ్ఛ, సృజనాత్మక సామర్థ్యాల గురించి అంతగా పట్టించుకోరనే విమర్శ ఇవాళ కొత్తేం కాదు. కమ్యూనిస్టు వ్యతిరేకులెప్పుడూ పాడే పాట ఇది. వాస్తవానికి వ్యక్తిని గురించి ఒక లోతైన శాస్త్రీయ అవగాహనను మార్క్సిస్టు సిద్ధాంతకర్తలు అభివృద్ధిచేశారు.

వ్యక్తి స్వభావం, స్వేచ్ఛ, వికాసాలు సమాజంతో పెనవేసుకుని ఉంటాయని మార్క్స్ అభిప్రాయం. మార్క్స్ తన విశ్లేషణ ప్రారంభానికి ఎన్నుకున్నది వ్యక్తిని కాదు, సమాజాన్ని. వివిధ వర్గాలకు చెందిన మానవుల కార్యాచరణను నిర్దేశించేది వారి వారి ఆర్థిక ప్రయోజనాలేనని మార్క్సిజం చెప్తుంది. వ్యక్తి యొక్క ఆర్థిక ప్రయోజనాలూ, ఆ వ్యక్తి ఒక వర్గానికి చెంది ఉండడమూ అనే ఈ రెండు అంశాలు మానవుల లక్షణాలనూ, ప్రవర్తననూ నిర్దేశిస్తాయి. వారిలో విభిన్న సామాజిక నమూనాలను రూపుదిద్దుతాయి. ఆ విధంగా ఏర్పడ్డ సంబంధాల నుండి మానవుల ప్రవర్తనను నిర్ణయించే విభిన్న సైద్ధాంతిక ఆలోచనలు కూడా ఆవిర్భవిస్తాయి. ఈ ఆలోచనా విధానాన్ననుసరించి మార్క్స్ వ్యక్తి స్వభావం గురించి అత్యంత ప్రాముఖ్యతగల నిర్ధారణలు చేశాడు.

"మానవ స్వభావం నైరూప్యం కాదు. అది వాస్తవ లక్షణం. ఒక వ్యక్తి మానసిక ఔన్నత్యం అతని వాస్తవ సంబంధాల స్థాయిపై ఆధారపడి ఉంటుంది" అని మార్క్స్ చెప్పాడు. ఈ అవగాహన నుండే విప్లవాత్మక సమాజ పునర్నిర్మాణం అనే ఆలోచన వచ్చింది.

వ్యక్తి భవితవ్యం, స్వేచ్ఛ, అభివృద్ధి మొదలైన వాటికి మానవాళి భవితవ్యంతోనూ, వివిధవర్గాల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మానసిక అభివృద్ధితోనూ గల దగ్గర సంబంధాన్ని మార్క్సిజం నొక్కిచెప్తుంది. 'నైరూప్య మానవుడు' (ఆబ్‌స్ట్రాక్ట్ హ్యూమన్) అనే భావనను మార్క్స్ తుడిచివేశాడు. ఆ స్థానంలో వాస్తవ మానవుని అధ్యయనం చేసే శాస్త్రాలను ఆవిష్కరించాడు. మార్క్స్ మానవ స్వభావాన్ని శాస్త్రీయంగానూ, విప్లవాత్మకంగానూ, లోతుగానూ అధ్యయనం చేసి వ్యక్తిని గురించి తన సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాడు. ఆయన కృషిని అర్థం చేసుకోవాలంటే మానవుడి పరాయీకరణ, స్వేచ్ఛ, సంపూర్ణ అభివృద్ధి అనే మూడు అంశాలను పరిశీలించాలి.

పరాయీకరణ

శ్రమ పరాయీకరణకు గురవడం చరిత్రలో ఏర్పడ్డ తాత్కాలిక పరిస్థితి. శ్రమ పరాయీకరణకు గురవడం అంటే దోపిడీ వర్గాలు అదనపు ఉత్పత్తిని సొంతం చేసుకోవడమే. ఎవరీ దోపిడీ వర్గాలు? చరిత్రలో చూశాం. బానిస యజమానులు, భూస్వామ్య ప్రభువులు, పెట్టుబడిదారులు. దోపిడీ ప్రైవేటు ఆస్తి ఆవిర్భావంతోనే ప్రారంభమైంది. ఆస్తి అనేది ఏర్పడిన తర్వాత మానవుడి శ్రమ నుండి ప్రోగుపడ్డ సంపదే అతడిని దోచుకునే సాధనంగా తయారైంది. అంతేకాదు, ఈ అదనపు సంపదే మరోవైపు మానవుని మానసికంగా మంచిచేసుకోవడానికీ, రాజకీయంగా జేబులో వేసుకోవడానికీ, ఆర్థికంగా లొంగదీసుకోవడానికీ దోపిడీదారుడికి సహకరిస్తుంది. అదనపు సంపద మానవుని మోసానికి గురిచేస్తుంది. ఇలాంటి పరిస్థితులలో శ్రామికుడు తన శ్రమద్వారా వచ్చిన ఉత్పత్తి తనదనుకుంటాడా? అనుకోడు. దానితో నాకేమీ సంబంధం లేదను కుంటాడు. శ్రమ సృష్టించిన ఉత్పత్తి పరాయీ కరణకు గురవడమే కాదు అసలు ఉత్పత్తే మానవుని పరాయీకరణ గావించింది.

శ్రామికుడి శ్రమ అతడి స్వంతం కాకుండా పోయింది. ఉత్పత్తి విధానం మానవుని అతని ఉత్పత్తినుంచి దూరం చేసింది. ఈ విధానంలో శ్రామికుడు తన శ్రమ ఫలితాన్ని ద్వేషిస్తున్నాడు. నేను సంతోషంగా ఉత్పత్తి చేశాననుకోవడం లేదు అనుకుంటున్నాడు. ఈ విధానంలో అలసిపోతున్నాడు. ఈ పరిస్థితిలో శ్రామికుడు మానసికంగా అభివృద్ధి చెందే అవకాశం కనిపించడం లేదు. ఈ వాతావరణంలో శ్రామికుడు శ్రమకాలంలో తనను తాను నిరాకరిస్తాడు. పని గంటలు పూర్తయిన తర్వాత మాత్రమే తన ఉనికి తాను గుర్తిస్తాడు. కాబట్టి శ్రామికుడు తన శ్రమద్వారా తనను తాను పోగొట్టుకుంటున్నట్లు భావిస్తాడు.

ఉత్పత్తి, శ్రమ పరాయీకరణకు గురికావడం వల్ల మానవుడు తోటి మానవుడి నుండి పరాయీకరణ చెందుతాడు. బూర్జువా సమాజంలో శ్రామికుడి శ్రమ, ఉత్పత్తి శ్రామికుడికి చెందవు. పెట్టుబడిదారుడి స్వంతమవుతాయి.

" పెట్టుబడిదారీ దోపిడీ, ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యం అంతమయినప్పుడే శ్రామికుడికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని మార్క్సిజం-లెనినిజం చెప్తుంది. కమ్యూనిస్టులు ఆస్తిహక్కును రద్దు చేయడం ద్వారా వ్యక్తి స్వేచ్ఛను ధ్వంసం చేస్తారని వ్యతిరేకులు నిందిస్తుంటారు. వీరికి కావలసింది శ్రమను దోపిడీ చేసే స్వేచ్ఛ అనీ, మెజారిటీ ప్రజలను కొద్దిమంది అణచి ఉంచే స్వేచ్ఛ అనీ, అందు కోసం వ్యక్తి సాధారణ స్వేచ్ఛ అనే భావనను ముసుగులాగా వాడుతుంటారనీ మార్క్స్, ఎంగెల్స్ నిరూపించారు. "

అందువల్ల వారి మధ్య సంబంధాల్లో అసమానత ఉంటుంది. అణచివేత ఉంటుంది. పరస్పర అపనమ్మకం ఉంటుంది. స్నేహరాహిత్యం ఉంటుంది. శత్రుభావం ఉంటుంది. సహజంగానే వర్గ వైరుధ్యం ఉంటుంది. పెట్టుబడిదారీ విధానంలో శ్రామికుడి పరిస్థితిని శ్రమ పరాయీకరణ, ఉత్పత్తి పరాయీకరణ, శ్రామికుడి పరాయీకరణ అనే మూడు లక్షణాలు వెల్లడిస్తాయని మార్క్స్ భావించాడు. మార్క్స్ అనంతరం కాలగమనంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కాని దోపిడీ మూల స్వభావం మాత్రం మారలేదు. బూర్జువా సమాజంలో పరాయీకరణ అనేది కొనసాగుతూనే ఉంది. నిపుణుల అంచనాల ప్రకారం అమెరికన్ కార్మికుడి శ్రమకాలంలో పెట్టుబడిదారుడి లాభం కోసం పనిచేసే భాగం 40 శాతం నుండి 66 శాతానికి పెరిగింది. ఇప్పుడు దోపిడీకి గురవుతున్నది శారీరక శ్రమ మాత్రమే కాదు, మానసిక శ్రమ కూడా.

పరాయీకరణను అంతం చేయాలంటే ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యజమాన్యాన్ని రద్దుచేసి, సమాజపరం చేయాలనీ, అది విప్లవం ద్వారా సాధ్యమనీ మార్క్స్ చెప్పాడు. అయితే ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేసినంత మాత్రాన ఉత్పత్తిలోనూ ప్రజా చైతన్యంలోనూ విప్లవం దానంతటదే వస్తుందనీ, ప్రజల్లో సమిష్టి మనస్తత్వం దానంతటదే నెలకొంటుందనీ భావించడం పొరపాటు. సంక్లిష్టమైన, వైరుధ్య భరితమైన సమాజ పునర్నిర్మాణ క్రమంలో ఈ మార్పులు నిదానంగా రావలసిందే గాని ఒక్కసారిగా రావు. అదే సమయంలో సామాజిక ఆస్తి కున్న పాటవమూ, ప్రజల సమైక్యశక్తీ ఆర్థిక విజయాలు సాధించడానికే కాకుండా సోషలిస్టు సంస్కృతి అభివృద్ధి చెందడానికీ, ప్రజల్లో ఉన్నతమైన చైతన్యం వ్యాపించడానికి కూడా పునాదులవుతాయి.

ఆస్తి సమాజపరం కావడంతో సమాజం స్వేచ్ఛ పొందిన శ్రామికుల సంఘంగా రూపుదిద్దుకుంటుది. సామాజిక సంపదలన్నీ శ్రామికుల అవసరాలను తీర్చడానికి, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించడానికి ఉపయోగపడటం మొదలవుతుంది. సోషలిస్టు సమాజంలో శ్రమ శ్రామికుడికి కేవలం జీవనాధారం, వ్యక్తిగత సంక్షేమ సాధనం మాత్రమే కాదు, సమాజానికి మేలు చేయడానికి, ప్రజలకు సేవ చేయడానికి పనికి వచ్చే ఉపకరణం కూడా. దోపిడీ సమాజంలో శ్రమ మానవుడి పరాయీకరణకు కారణమవుతుంది. సోషలిస్టు సమాజంలో శ్రమ శ్రామికుడిని గౌరవప్రదమైన స్థానంతో నిలబెడుతుంది.

మార్క్సిజాన్ని, సోషలిజాన్ని వ్యతిరేకించే వారు చేసే వాదనొకటుంది. సోషలిజంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో శ్రామికుడి ఉత్పత్తిలోంచి ఒక భాగాన్ని గుంజుకోవడం జరుగుతుందని వారంటారు. వారి అభిప్రాయం ప్రకారం ఉమ్మడి అవసరాల (విద్య, రక్షణ, కార్యనిర్వహణ లాంటివి) కోసం ఉత్పత్తి లోంచి కొంత భాగాన్ని వినియోగించడాన్ని కూడా 'పరాయీకరణ' గానే చూడాలంటారు. ఇలాంటి వాదనల ఉద్దేశ్యం పెట్టుబడిదారీ విధానానికి, సోషలిజానికి తేడా అర్థం కాకుండా అయోమయాన్ని సృష్టించడమే. 'పరాయీకరణ' అనేది ఉత్పత్తి సాధనాల ప్రైవేటు యాజమాన్యంతో పాటు ఏర్పడిన చారిత్రక పరిణామం అనే విషయాన్ని గ్రహించాలి.

స్వేచ్ఛ

పెట్టుబడిదారీ దోపిడీ, ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్యం అంతమయినప్పుడే శ్రామికుడికి నిజమైన స్వేచ్ఛ లభిస్తుందని మార్క్సిజం-లెనినిజం చెప్తుంది. కమ్యూనిస్టులు ఆస్తిహక్కును రద్దు చేయడం ద్వారా వ్యక్తి స్వేచ్ఛను ధ్వంసం చేస్తారని వ్యతిరేకులు నిందిస్తుంటారు. వీరికి కావలసింది శ్రమను దోపిడీ చేసే స్వేచ్ఛ అనీ, మెజారిటీ ప్రజలను కొద్దిమంది అణచి ఉంచే స్వేచ్ఛ అనీ, అందు కోసం వ్యక్తి సాధారణ స్వేచ్ఛ అనే భావనను ముసుగులాగా వాడుతుంటారనీ మార్క్స్, ఎంగెల్సులు నిరూపించారు. మనిషిని మనిషి దోపిడీచేసే విధానాన్ని అంతం చేయాలని కమ్యూనిస్టులు వారి మొదటి కార్యక్రమ పత్రంలో ప్రకటించారు. వర్గాలు, వర్గ వైరుధ్యాలతో నిండిన పాత సమాజం స్థానంలో శ్రామి కుల సంఘటనగా రూపుదిద్దుకున్న కొత్త సమాజం అవతరిస్తుందనీ, ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందే అవకాశం ఆ నూతన సమాజంలో ఉంటుందనీ కమ్యూనిస్టు కార్యక్రమం చెప్తుంది.

ఇక్కడ రెండు అంశాలను జాగ్రత్తగా గమనించాలి. మొదటి విషయం : సమాజంలోని ప్రతి వ్యక్తికీ అవధుల్లేని స్వేచ్ఛ లభించినప్పుడే దాన్ని స్వేచ్ఛా సమాజంగా గుర్తించాలని కొందరంటారు. వారు కోరే పరిస్థితి అరాచకానికి దారితీస్తుంది. ప్రతి సమాజంలోనూ కొన్ని ఆంక్షలూ, నియమనిబంధనలూ, నిషేధాలూ వుంటాయి. ఇవన్నీ స్వేచ్ఛకు పరిమితులు విధిస్తాయి. మార్క్స్, ఎంగెల్సులు స్వేచ్ఛ అంటే దోపిడీ నుండి, వర్గ అణచివేత నుండి, వర్గ వైరుధ్యాల నుండి విముక్తి అని చెప్పారు. ఈ విషయం కమ్యూనిస్టు ప్రణాళిక చదివితే అర్థమవుతుంది. కాబట్టి పెట్టుబడిదారీ దోపిడీ రద్దు చేయని సమాజాన్ని స్వేచ్ఛా సమాజంగా గుర్తించడానికి వీలులేదు.

రెండవ అంశం - పెట్టుబడిదారుడి స్వేచ్ఛా, సంక్షేమం అతడి సంపదల్లోనూ, శ్రమ దోపిడీ సాగించడంలోనూ ఉంటే శ్రామికుడి స్వేచ్ఛా, సంక్షేమాలు దోపిడీ నుండి విముక్తి పొందడంలోనూ, ఉత్పత్తి స్థానాలపై ఉమ్మడి యాజమాన్యం సాధించడంలోనూ, సృజనాత్మక వ్యక్తి వికాసంలోనూ, వ్యక్తిగత శక్తి సామర్థ్యాల అభివృద్ధిలోనూ వుంటాయి. అందువల్ల శ్రామికుడికి బూర్జువా స్వేచ్ఛ ఆమోదం కాదు. అలాగే బూర్జువా వర్గానికి 'కమ్యూనిస్టు ప్రణాళిక' నిర్వచించిన స్వేచ్ఛ ఆమోదం కాదు. ఎందుకంటే ఆస్తిహక్కుల రద్దునూ, ఆధిపత్యపు రద్దునూ బూర్జువాలు ఒప్పుకోరు.

ప్రతి వ్యక్తీ తన ప్రాథమిక హక్కుల కోసం, స్వేచ్ఛకోసం ప్రయత్నించడమనే ఆలోచననే

బూర్జువావర్గాలు భరించలేవు. తమ సంపదలు, ఉన్నతస్థితి ఎక్కడ చేయి జారిపోతాయోనని భయపడతారు. అందుకని వారి ప్రయోజనాలను కాపాడుకోవడానికి మిగిలిన వారికి స్వేచ్ఛా యుత పరిస్థితులను నిరాకరిస్తారు. అందువల్ల, పెట్టుబడిదారీ దోపిడీ నుండి విముక్తి అనేది శ్రామికుడి స్వేచ్ఛలో అత్యంత ప్రధానమైన భాగం. అయితే అది ఒక భాగం మాత్రమేననే విషయాన్ని గుర్తించాలి. స్వేచ్ఛ అంటే కేవలం విముక్తి పొందడంతో ఆగిపోయేది కాదు. స్వేచ్ఛ అంటే వ్యక్తి వికాసం కూడా. ప్రజల మధ్య సమానత్వం ఉన్నప్పుడే, ఉత్పత్తి సాధనాలపై సమానహక్కు ఉన్నప్పుడే, ప్రజలంతా ఉమ్మడి లక్ష్యాలు, ఆలోచనలతో సమైక్యమైనప్పుడే, ప్రజల మధ్య సామాజిక, రాజకీయ, సైద్ధాంతిక ఐక్యత నెలకొన్నప్పుడే మానవుడి స్వేచ్ఛను హరించే వర్గ విభేదాలు అదృశ్యమవుతాయి. అప్పుడు మాత్రమే మానవుడి ప్రయత్నాల స్వేచ్ఛాయుత వ్యక్తీకరణకూ, అందరూ కలిసికట్టుగా సామాజిక కృషిలో పాల్గొనడానికీ సానుకూల పరిస్థితులేర్పడతాయి. ఇంతకాలం ప్రజలను అణచివేసిన వర్గాలు ఇకమీదట ప్రజల చెప్పుచేతల్లోకి వస్తాయి. ఎంగెల్సు చెప్పినట్లు ఈ విధంగా మానవాళి ఆవశ్యకత (నెసెసిటీ) అనే పరిస్థితి నుండి స్వేచ్ఛ (ఫ్రీడం) అనే పరిస్థితికి అధిరోహిస్తుంది.

నిస్సందేహంగా ఇలాంటి స్వేచ్ఛ పెట్టుబడిదారుడికి ఏమాత్రం గిట్టదు. సహజంగానే ఈ స్వేచ్ఛకు వ్యతిరేకంగా వారు పోరాడుతారు. యజమానుల స్వేచ్ఛకోసం, దోపిడీ స్వేచ్ఛకోసం, వారి ఆర్థిక, రాజకీయ పెత్తనాన్ని నిలబెట్టుకోవడం కోసం పోరాడుతారు. అయితే వారి పోరాటం సమాజంలోని ప్రజలందరి తరఫునా చేస్తున్నామని చెబుతారు.

మార్క్సిస్టు సిద్ధాంతమూ, కమ్యూనిస్టు విద్యావిధానమూ వ్యక్తిస్వేచ్ఛను హరించివేస్తాయనీ, ఫలితంగా వ్యక్తి ప్రత్యేకతను పోగొట్టుకొని మందలో భాగంగా మిగులుతాడనీ కమ్యూనిస్టు వ్యతిరేకులు ప్రచారం చేస్తుంటారు. కాని వీరి వాదన తప్పు. శ్రామికుడి సృజనాత్మక కార్యకలాపాల అభివృద్ధికి, కోట్లాది ప్రజల చొరవకు, వారి శక్తి సామర్థ్యాల వినియోగానికి సోషలిజమే నిజమైన అవకాశాలను కల్పిస్తుంది.

కొందరు సోషలిజానికి ప్రత్యామ్నాయంగా 'సోషల్ డెమోక్రసీ'ని ప్రతిపాదిస్తుంటారు. సైద్ధాంతిక, రాజకీయ బహుళత్వానికి అవకాశమిచ్చేదే సోషల్ డెమోక్రసీ. బూర్జువా సమాజంలో రూపొందిన బహుళత్వం క్లిష్టమైనది, వైరుధ్యభరితమైనది. యధాలాపంగా చూస్తే అది వివిధ రాజకీయ శక్తుల మధ్య న్యాయంగా జరిగే పోటీగాను, అందులో ఎవరు సమర్థులో వారే గెలుస్తారనీ అనిపిస్తుంది. అయితే మొత్తం ఆర్థికబలం, రాజ్యం, సైన్యం, సమాచార వ్యవస్థ అన్నీ పెట్టుబడిదారుల గుప్పెట్లో వున్న విషయాన్ని కాదనగలరా? అయితే ఈ వాస్తవాన్ని బూర్జువా బహుళత్వ సిద్ధాంత ప్రచారకులు దాటేస్తుంటారు.

> **"కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే సమాజానికి చోదకశక్తిగా ఉండే రాజకీయ వ్యవస్థలో కూడా భిన్న ప్రయోజనాలు, దృక్కోణాలు, శ్రామికుల వైవిధ్యభరిత అభిప్రాయాలకు ప్రాతినిధ్యం లభిస్తుంది. మరోమాటలో చెప్పాలంటే ఒక సోషలిస్టు సమాజంలో విభిన్నమైన కార్యకలాపాలు, ప్రయోజనాలు, ప్రయత్నాలు ఉంటాయి. అయితే ఇది విమర్శకులు చెప్పే బహుళత్వం మాత్రం కాదు. వారు కోరే బహుళత్వం బూర్జువా వ్యవస్థను నిలబెట్టేది. అలాంటి బహుళత్వానికి లక్ష్యం శ్రామికుల ప్రయోజనాలను దెబ్బతీయడమే."**

శ్రామికవర్గంలో రాజకీయ కార్యాచరణ పెరగడం, వివిధ రాజకీయ పార్టీలు ప్రజల నుండి ఒత్తిడులెదుర్కొనడం ఇదంతా రాజకీయ బహుళత్వానికి నిదర్శనంగా గుత్తాధిపత్య వర్గాలు చూపుతాయి. ఆ తరహా ప్రజాస్వామ్యంలో రాజకీయ అధికారం ఒక బూర్జువా పార్టీ నుండి మరొక బూర్జువా పార్టీకి మారుతూ వుంటుంది. మొత్తంమీద అధికారం పెట్టుబడిదారీ వర్గం చేయి దాటిపోదు.

శ్రామికవర్గం తన రాజకీయ పార్టీల ద్వారా పార్లమెంటరీ పద్ధతులు, ఇతర పద్ధతుల ద్వారా కొన్ని హక్కులు, రాయితీలు సాధించిన మాట నిజమే. ఈ అంశానికున్న ప్రాధాన్యాన్ని తక్కువ చేయకూడదు, ఎక్కువా చేయకూడదు. ఎందుకు తక్కువ చేయకూడదంటే, శ్రామికవర్గం తీవ్ర రాజకీయ పోరాటాల ద్వారా హక్కులను సాధించుకుంది, ఈ అనుభవాలు భవిష్యత్ పోరాటాలకు మార్గం చూపుతాయి గనుక. ఈ అంశానికి మితిమీరిన ప్రాధాన్యమిస్తే వాస్తవాలను విస్మరించే ప్రమాదం ఉంది. బూర్జువా వర్గం తనకున్న ఆర్థిక, రాజకీయ అధికారాన్ని, సైద్ధాంతిక యంత్రాంగాన్ని వినియోగించి కార్మికవర్గ ప్రయోజనాలు, హక్కులపై నిరంతరం దాడులు చేస్తూనే వుంటుంది.

చరిత్ర మరొక అనుభవాన్ని సంపాదించింది. అదే సోషలిస్టు దేశాల అనుభవం. శ్రామికులలోని వివిధ శ్రేణులకు ప్రాతినిధ్యం వహించే వివిధ రాజకీయ పార్టీల సంఘటన కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పనిచేయడాన్ని పలు సోషలిస్టు దేశాలలో గమనిస్తాము. శ్రామికుల విభిన్న ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే విభిన్న రాజకీయ పార్టీలిక్కడ వున్నాయి. ఇది రాజకీయ బహుళత్వమే. కాని ఇది సంస్కరణ వాదులు కోరే బహుళత్వం మాత్రం కాదు. వారి కోరేది బూర్జువా ప్రజాస్వామ్యం.

కమ్యూనిస్టు పార్టీ ఒక్కటే సమాజానికి చోదకశక్తిగా ఉండే రాజకీయ వ్యవస్థలో కూడా విభిన్నమైన ప్రయోజనాలు, దృక్కోణాలు, శ్రామికుల వైవిధ్యభరితమైన అభిప్రాయాలకు ప్రాతినిధ్యం లభించడం, విమర్శ, ఆత్మవిమర్శలకు ప్రోత్సాహం ఉంటాయి. మరోమాటలో చెప్పాలంటే ఒక సోషలిస్టు సమాజంలో విభిన్నమైన కార్యకలాపాలు, ప్రయోజనాలు, ప్రయత్నాలు ఉంటాయి. అయితే ఇది విమర్శకులు చెప్పే బహుళత్వం మాత్రం కాదు. వారు కోరే బహుళత్వం బూర్జువా వ్యవస్థను నిలబెట్టేది. అలాంటి బహుళత్వానికి లక్ష్యం శ్రామికుల ప్రయోజనాలను దెబ్బతీయడమే.

పెట్టుబడి దోపిడీ నుండి శ్రామికులకు విముక్తి కల్పించని స్వేచ్ఛ, స్వేచ్ఛ కాదు, మోసం అని లెనిన్ చెప్పాడు.

మానవుడి సంపూర్ణ వికాసం

మానవుడి సామర్థ్యాల సర్వతోముఖాభివృద్ధి ఒక వాస్తవమైన సామాజిక అవసరం అని మార్క్సిజం శాస్త్రీయంగా నిరూపిస్తున్నది. మార్క్స్, పెట్టుబడి మొదటి సంపుటిలో భారీ పరిశ్రమలో యంత్రాల ప్రవేశం వల్ల ఉత్పన్నమైన పరిస్థితిని

(మిగతా 32వ పేజీలో)

కమ్యూనిస్టు ప్రణాళిక - వర్గ పోరాటం

పెట్టుబడిదారీ సమాజంలోని వైరుధ్యాలను శాస్త్రీయ సోషలిజం సృష్టికర్తలు బట్టబయలు చేశారు. శత్రువైరుధ్యాలు గల వర్గాలమధ్య సామరస్యం ఏర్పడటం అసాధ్యమని నిరూపించారు. విప్లవం అనివార్యమని, కార్మికవర్గ విజయమూ అనివార్యమని తేల్చారు.

పెడ్రో సర్విరాట్

కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ రచించిన 'కమ్యూనిస్టు ప్రణాళిక', శాస్త్రీయ కమ్యూనిజపు మొట్టమొదటి కార్యక్రమం. మార్క్సిజంలోని మూడు అంతర్భాగాలైన తత్వశాస్త్రం, అర్థికశాస్త్రం, శాస్త్రీయ సోషలిజం అందులో వివరించబడినాయి.

"మేధోవంతమైన స్పష్టత, నిశిత దృష్టితో గూడిన ఈ రచన, నూతన ప్రాపంచిక దృక్పధాన్ని, నికరమైన భౌతిక వాదాన్ని చిత్రీకరిస్తుంది. అభివృద్ధి క్రమానికి సంబంధించిన అత్యంత సమగ్రమైన, లోతైన సిద్ధాంతంగా గతితర్కాన్ని గురించి, సాంఘిక జీవన సారాంశాన్ని గురించి పేర్కొంటుంది. వర్గపోరాట సిద్ధాంతాన్ని గురించి, నూతన కమ్యూనిస్టు సమాజ సృష్టికర్త అయిన కార్మికవర్గం యొక్క ప్రపంచ చారిత్రక విప్లవ కర్తవ్యాన్ని గురించి స్పష్టీకరిస్తుంది" అని కమ్యూనిస్టు ప్రణాళికను గురించి లెనిన్ పేర్కొన్నాడు.

పెట్టుబడిదారీ సమాజంలోని వైరుధ్యాలను శాస్త్రీయ సోషలిజం సృష్టికర్తలు బట్టబయలు చేశారు. శత్రువైరుధ్యాలు గల వర్గాలమధ్య సామరస్యం ఏర్పడటం అసాధ్యమని నిరూపించారు. విప్లవం అనివార్యమని, కార్మికవర్గ విజయమూ అనివార్యమని తేల్చారు. తమ సిద్ధాంతం ప్రపంచ పరిణామానికి మీటగా పనిచేయగలదని, పెట్టుబడిదారీ వ్యవస్థను రూపుమాపి, నవసమాజాన్ని నిర్మించడం చారిత్రక కర్తవ్యంగా గలిగిన అగ్రగామి వర్గమైన కార్మికవర్గ పోరాటానికి మార్గదర్శిగా ఉపకరించగలదనీ మార్క్స్, ఏంగెల్సు తమ విప్లవ సిద్ధాంతాన్ని రూపొందించే సందర్భంలో భావించారు.

కార్మికవర్గ అగ్రగామి దళంగా ఉండే పార్టీ ఆవశ్యకత

కార్మికవర్గపు అగ్రగామి దళంగా, సంఘటిత చైతన్య శక్తిగా పనిచేసే పార్టీని నెలకొల్పటానికి మార్క్స్, ఏంగెల్స్ కృషి చేశారు. ఈ మార్గంలో వారు తీసుకున్న మొట్టమొదటి చర్య కమ్యూనిస్టు లీగ్‌ను స్థాపించడం. ఇది తేలికయిన పని కాదు. పాత అశాస్త్రీయ, ఊహాజనిత ధోరణులనే పట్టుకు వేలాడుతున్న గ్రూపుల భావాలను ఎదుర్కోవడం కోసం బెల్జియం, ఇంగ్లండు, జర్మనీలలో మార్క్స్, ఏంగెల్స్ అనేక సంవత్సరాలపాటు కేంద్రీకరించి పనిచేయాల్సి వచ్చింది. అనేక మందితో సిద్ధాంత రాజకీయ చర్చలు జరపాల్సి వచ్చింది.

లీగ్ ఆఫ్ ది ఫెయిర్ (న్యాయం కోసం పనిచేసే సంఘం) మహాసభ 1847 జూన్‌లో లండన్‌లో జరిగింది. ఆ మహాసభ చర్చనీయాంశాలలోని మొదటి అంశం నూతన నియమావళి ముసాయిదా. "బూర్జువా వర్గాన్ని కూలదోయడం, కార్మికవర్గ ఆధిపత్యాన్ని స్థాపించడం, వర్గ వైరుధ్యాలు ప్రాతిపదికగా గల పాత బూర్జువా సమాజాన్ని రూపుమాపడం, వర్గాలుగాని, వ్యక్తిగత ఆస్తిగాని ఉండని నూతన సమాజాన్ని నెలకొల్పడం ఈ సంస్థ లక్ష్యం" అని సభ ఆమోదానికి ఏంగెల్స్ ప్రవేశపెట్టిన నియమావళిలో స్పష్టంగా పేర్కొన్నాడు. ఆ సంస్థ పేరును మార్చాలని మార్క్స్, ఏంగెల్స్ ప్రతిపాదించారు. మహాసభ ఆ ప్రతిపాదనను ఆమోదించింది. ఆ క్షణం నుండి అది కమ్యూనిస్టు లీగ్‌గా వ్యవహరించ నారంభించింది.

కమ్యూనిస్టు సంస్థ నిర్మాణం

సిద్ధాంతం, కార్యక్రమం, నిర్మాణం...వీటిని బట్టి చూస్తే, కమ్యూనిస్టు లీగ్ శాస్త్రీయ సోషలిజం సూత్రాలకు అనుగుణంగా ఉన్నదని చెప్పవచ్చు. ఈ సంస్థ పేరుతోనే మార్క్స్, ఏంగెల్స్ తమ 'కమ్యూనిస్టు ప్రణాళిక'ను రచించారు. నూతన విప్లవ సంస్థకు పునాది కార్మికవర్గ అగ్రగామి బృందాలు. సంస్థ కేంద్రకమిటీకి గాని, మహాసభకు గాని, ఏ స్థానానికయినా ఎన్నుకోబడేందుకు ప్రతి ఒక్కరూ అర్హులే. నిర్మాణ స్వరూపం దృష్ట్యా చూస్తే ఈ సంస్థ కార్మికోద్యమ పురోగతిని కుంటుపరిచిన ఇతర సంకుచిత, ఒంటెత్తు సంస్థలకంటే అత్యుత్తమమైనది.

బూర్జువావర్గంతో తలపడేందుకు అవసరమైన సత్తా కార్మికవర్గానికి ఉన్నదని, కార్మికవర్గం ఏ మేరకు సంఘటితపడి ఉన్నది అన్నదానిపై విప్లవ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయని ఫ్రెంచ్ విప్లవం, ఇతర ఐరోపా దేశాలలో 1848 నాటి విప్లవం విదితం చేసింది.

ఆ తర్వాత అనేక సంవత్సరాలకు, 1864 సెప్టెంబర్‌లో, మార్క్స్, ఏంగెల్స్ అంతర్జాతీయ కష్టజీవుల సంఘాన్ని స్థాపించారు. అదే మొట్టమొదటి ఇంటర్నేషనల్. ఆ శకంలోని కార్మికోద్యమంలోగల వివిధ ధోరణులను

సమీకరించే అత్యంత ప్రధానమైన కేంద్రమది. మార్క్సిజం సిద్ధాంతంతో ప్రభావితమైన ఆ ఇంటర్నేషనల్, కార్మికవర్గ పోరాటాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకుపోయింది. కార్మికవర్గ అంతర్జాతీయతను పెంపొందించింది. ఐరోపా, అమెరికా ఖండాలలోని అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడింది. తన మహాసభలలోనూ, తన ప్రారంభ ప్రణాళికలోనూ, తన నియమావళిలోనూ కూడా -అరాచక వాదం, ట్రేడ్ యూనియనియనిజం, లాసల్లీయిజం వంటి అశాస్త్రీయ ధోరణులన్నింటికి వ్యతిరేకంగా పోరాడింది. అంతర్జాతీయ కార్మికవర్గ సభ్యులంతా, నూతన విప్లవ సిద్ధాంతంలోని సంపన్నమైన శాస్త్రీయ సంపదను వంటబట్టించుకోవాలని, నూతన సమాజాన్ని నిర్మించేందుకు సాగించే పోరాటంలో దానిని మీటగా ఉపయోగించుకోగలగాలని మార్క్స్, ఏంగెల్స్ కోరారు. సిద్ధాంతం ప్రజల చేతుల్లో ఒక శక్తివంతమైన భౌతికశక్తిగా రూపొందుతుందని వారు గుర్తించారు.

'అన్ని దేశాలకు, అన్ని పరిశ్రమలకూ చెందిన కార్మికులారా, ఏకం కండు' అనే నినాదంతో పనిచేస్తున్న అంతర్జాతీయ కష్టజీవుల సంఘం, 1864 నుండి 1872 మధ్య కాలంలో కార్మిక ఉద్యమంలోని అత్యుత్తమ, అత్యంత విలువైన శక్తులతో నిండి ఉంది.

ఫ్రెంచి కార్మికవర్గ సభ్యులు 1871లో, ప్రష్యన్ దండయాత్రకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. అయితే విద్రోహుల మూలంగా ఈ తిరుగుబాటు విఫలమయింది.

అపూర్వమైన పారిస్ కమ్యూన్

అదే సంవత్సరం మార్చి 18వ తేదీన పారిస్ నగర్ వీధుల్లోనూ, ఇతర ప్రాంతాలలోనూ కార్మికవర్గం భీషణ పోరాటం సాగించింది. అనంతరం మొట్టమొదటి కార్మివకర్గ ప్రభుత్వంగా, పేద ప్రజల ప్రభుత్వంగా పారిస్ కమ్యూన్ ఏర్పాటు చేయబడింది. ఫ్రాన్ చరిత్రలో యితర రాజ్యాలు, ప్రభుత్వాలు అన్నీ చేసిన దానికంటే 72 రోజులు అధికారంలో ఉన్న పారిస్ కమ్యూన్ కష్టజీవులకు ఎక్కువ ప్రయోజనకరమైన చర్యలు తీసుకుంది.

సమాజంపై కార్మివర్గం తన ఆధిపత్యాన్ని సాధించిన వెంటనే అది బూర్జువావర్గపు రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేయాలని మార్క్స్ భావించాడు. ఆయన భావన సరైనదే

> **“ వివిధ యూరప్ దేశాలలో నేడు మనం రిట్రెంచ్‌మెంట్లను చూడొచ్చు. సంక్షేమ పథకాలయిన 'సిక్ పే'లోనూ, పెన్షన్లలోనూ కోత మొదలయింది. నిరుద్యోగ భృతిని కత్తిరించారు. విద్యా, వైద్యం, సామాజిక సేవల రంగాల్లో వసూలుచేసే ఫీజులు, ఛార్జీలు పెంచారు. లాభదాయకంగాలేవన్న పేరుతో గృహనిర్మాణ పథకాలను అటక ఎక్కించారు. ”**

అని పారిస్ కమ్యూన్ నిరూపించింది. అందువల్ల అది కార్మిక వర్గానికి గొప్ప ఆదర్శాన్నీ, అత్యుత్తమ గుణపాఠాన్నీ నేర్పింది.

అయితే పారిస్ కమ్యూన్ నిలబడలేకపోయింది. అలాంటి మహత్తరమైన కార్మికవర్గ యత్నం ఫలప్రదమయ్యేందుకు అవసరమైన చారిత్రక పరిస్థితులు ఆ సమయంలో లేకపోవడం, అది అనేక పొరపాట్లు చేయడం అందుకు కారణం. అయినా పారిస్ కమ్యూన్ యోధులు చూపించిన ఆదర్శం, కష్టజీవుల చరిత్రలోనూ, పెట్టుబడి పీడనకు వ్యతిరేకంగా పోరాడే యితర పీడిత ప్రజల చరిత్రలోనూ అజరామరమైన సంఘటనగా మిగిలిపోతుంది. పారిస్ యోధులు 'స్వర్గాన్ని దద్దరిల్లచేసిన' వారని మార్క్సు అభివర్ణించాడు!

పారిస్ కమ్యూన్ యోధుల పరాజయానంతరం బూర్జువా ప్రభుత్వాలు బీభత్సం సృష్టించాయి. కార్మికోద్యమాన్ని నిర్బంధకాండకు గురిచేశాయి. దాంతో కార్మికోద్యమానికి గొప్ప చిక్కులెదురయినాయి. అయితే దీని తరువాత కూడా మార్క్సిజం మూలపురుషులు, సిద్ధాంత రంగంలోనూ, నూతన శకంలో పోరాటాన్ని జరిపే శక్తి, విప్లవ స్వభావం గల కార్మికవర్గ పార్టీలను ఏర్పాటు చేయటంలోనూ తమ కృషిని కొనసాగించారు.

మార్క్స్ అనంతరం ఏంగెల్సు కృషి

ఆలోచనలలోను, కార్యాచరణలోను మేరు సమానుడైన కారల్ మార్క్స్ 1883లో మృతిచెందాడు. దాంతో సిద్ధాంత, నిర్మాణ కృషి ముందుకుతీసుకుపోడానికి ఆటంకం ఏర్పడింది. అయినా ఆ కృషి కొనసాగింది. ఆయనకు అత్యంత సన్నిహిత సహచరుడయిన ఫ్రెడరిక్ ఏంగెల్స్ ఈ కృషిని ముందుకు తీసుకుపోయాడు. విశ్వాసపాత్రులైన సహాయకుల బృందం ఈ కృషిలో ఆయనకు తోడ్పడింది. బూర్జువా వర్గపు కొత్త ఎత్తుగడలవల్లనూ, కార్మికోద్యమంలోని అరాచక వాద, రివిజనిస్టు ధోరణు వల్లనూ ప్రమాదాన్నెదుర్కొంటున్న కార్మికవర్గ సిద్ధాంతపు శాస్త్రీయ నైర్మల్యాన్ని కాపాడటమే ఆయన ప్రధాన ధ్యేయం. సాంఘికంగా అనేక పరిణామాలు జరిగినప్పటిక ఈ దశలో కూడా, కమ్యూనిస్టు ప్రణాళిక అత్యంత పలుకుబడి గల విప్లవ పత్రంగానే ఉండింది. అంతిమ విమోచనకోసం సాగించే పయనంలో కార్మివకార్గనికది మార్గాన్ని చూపుతూనే ఉంది.

మార్క్సిజానికి పుష్టి కలిగించిన లెనిన్

మార్క్సుకు మిత్రుడు, మేధాసంపన్నుడు అయిన ఫ్రెడరిక్ ఏంగెల్స్ 1895లో మృతిచెందాడు. పెట్టుబడిదారీ విధానం, సామ్రాజ్యవాదంగా పరిణమించుతున్న దశలో అది సంభవించింది. అదొక యుగానికి నాంది. దానినే 'సామ్రాజ్యవాదం, కార్మికవర్గ విప్లవాల యుగం'గా లెనిన్ ఆ తర్వాత అభివర్ణించాడు.

కమ్యూనిస్టు ప్రణాళికలోని భావాలను ఆచరణలో పెట్టేందుకు అనువైన చారిత్రక పరిస్థితులు ఏర్పడినాయి. సామ్రాజ్యవాద యుగంలో కార్మికవర్గానికి మహానాయకుడుగా, రాజకీయ నిర్మాణ కర్తగా ఎదిగిన లెనిన్ ఆ భావాలను ఆచరణలో పెట్టి, మరింత పెంపొందించి, నూతన పరిస్థితులలో మార్క్సిస్టు సిద్ధాంతానికి పుష్టిని చేకూర్చాడు.

ఐరోపాలో 1848 విప్లవాల అనుభవాలు, మొదటి ఇంటర్నేషనల్ అనుభవం, పారిస్ కమ్యూన్ అనుభవం.... లెనిన్ నిర్మించిన కొత్త పార్టీ వీటన్నిటినీ 1905 విప్లవంలోనూ, 1917 ఫిబ్రవరి, అక్టోబరు విప్లవాలలోనూ సృజనాత్మకంగా అన్వయించుకొన్నది. వర్గపోరాటాలు అంతకుముందెన్నడూ వివిధ

రూపాలలో, ప్రత్యేకించి రాజకీయ, సిద్ధాంత రంగంలో ఇంతటి ఉన్నతస్థాయికి చేరుకోలేదు. బూర్జువావర్గంలోనూ, చివికిపోతున్న జారు రాచరికంలోనూ గల వైరుధ్యాలన్నీ రంగంమీది కొచ్చాయి. కార్మికవర్గ నాయకత్వాన, రైతాంగం మైత్రితో పాత రాజ్యాధికారాన్ని ఓడించి, దాని శిధిలాలపై నూతన రాజ్యాధికారాన్ని నెలకొల్పటం జరిగింది.

అక్టోబరు సోషలిస్టు విప్లవ ప్రభావం

అక్టోబరు సోషలిస్టు మహా విప్లవం, నమకాలీన బూర్జువా ప్రపంచాన్ని కుదిపివేసింది. మానవ జాతి చరిత్రలో నూతన శకానికి నాంది పలికింది., పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించి సోషలిజానికి పరిణామంచెందే శకం అది. కమ్యూనిస్టు ప్రణాళికలో పొందుపరచబడిన మౌలికభావాలు, చరిత్రలో మొట్టమొదట సరిగా ఆచరణలోకొచ్చాయి.

ఆ చారిత్రక పత్రం రచించబడి ప్రచురించబడి 150 సంవత్సరాలకు పైనే గడిచిపోయాయి. ఈలోగా కార్మికవర్గం అమూల్యమైన అనుభవం గడిచింది. గొప్ప చారిత్రక ప్రాధాన్యత గల మార్పులనేకం ప్రపంచంలో సంభవించాయి. దోపిడీకి, పేదరికానికి కారణమయిన పెట్టుబడిదారీ పాలన నుండి కొన్నివందల కోట్ల ప్రజలు బయటపడ్డారు. అయితే ఇంకా అనేకకోట్ల ప్రజలు ఇప్పటికీ పెట్టుబడిదారీ ప్రభుత్వాల క్రిందగల దేశాలలో ఆకలిబాధతో, దారిద్ర్యంతో, భయానక పరిస్థితుల్లో జీవయాత్ర సాగిస్తున్నారు. వారందరికి కమ్యూనిస్టు ప్రణాళిక, అందునా ప్రత్యేకించి వర్గపోరాటాలకు సంబంధించి అందులోగల విప్లవ భావాలు, ఎంతో ప్రాధాన్యతగలవి. వాటిని సృజనాత్మకంగా ఉపయోగపెట్టుకోవలసి ఉంది. సోషలిస్టు దేశాలలోనూ, పెట్టుబడిదారీ దేశాలలోనూ ప్రపంచమంతటా గల విప్లవకారులందరికీ కమ్యూనిస్టు ప్రణాళిక విప్లవ కార్యాచరణకు అమూల్యమైన మార్గదర్శిగా కొనసాగుతూనే వుంది. సైద్ధాంతిక పోరాటంలో శక్తివంతమైన సాధనంగానూ కొనసాగుతూనే ఉంది.

రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య సంస్కరణలు

(7వ పేజీ తరువాయి)

నిర్వీర్యపరిచే ఆలోచన మంచిదికాదు. దీనిపై రోశయ్యగారి వివరణపత్రం పేరా 11 గందరగోళంగానూ, తెలుగువారికి కూడా అర్థంకాని పద బంధాలతో ఉంది.

7. ప్రయివేటు ప్రాక్టీసుకు సంబంధించిన సమస్య రోశయ్య వివరణపత్రంలో ఉంది. "ఆసుపత్రి డ్యూటీ తరువాత నివాసాల్లో కన్సల్టేషన్ ప్రాక్టీసు చేసుకోవడానికి డాక్టర్లను అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించిందని" వివరణ పత్రంలో సెలవిచ్చారు. దానికి పొరుగు రాష్ట్రాలను ఉదహరించారు. కానీ ఈ విషయంపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు, తదితరులతో జరిపిన విస్తృతస్థాయి సంప్రదింపులలో ఏకాభిప్రాయం ఉన్నట్లు సత్యదూరమైన వివరణ ఇచ్చారు. నాకు తెలిసినంతవరకూ ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం, మరో ముఖ్య రాజకీయపార్టీ సిపిఎం నిర్ద్వందంగా ఆ ప్రతిపాదనను వ్యతిరేకించాయి.

అలాగే ప్రభుత్వ ఆలోచనల్లోవున్న పే క్లినిక్‌లు, సమాంతరక్లినిక్‌లు (పారలల్ క్లినిక్‌లు, స్పీడ్ ఒపిలు) పూర్తి అనర్థదాయకం, సాధారణ ప్రజలకు నష్టదాయకం.

8. ఎఎన్ఎంలనూ, అంగన్‌వాడీ కార్యకర్తలనూ, గ్రామీణ ఆరోగ్య యూనిట్లలో భాగస్వాములను చేసుకోవాలి. వారిని వారివారి సదుపాయాలతో తీసుకోవాలి. ఉద్వాసన పలికే ఆలోచన పనికిరాదు.

9. అనేక మంచి ఆలోచనలు మార్పులు, చేర్పులు, పథకాలు విఫలమవ్వడానికి ప్రధానమైన కారణం సరైన అజమాయిషీ వ్యవస్థ లేకపోవడం. దీన్ని పటిష్టపరచడానికి ప్రాధాన్యతనివ్వాలి. పంచాయతీరాజ్ వ్యవస్థకూ బాధ్యత ఉండాలి.

10. ఆరోగ్య శాఖామంత్రి కె.రోశయ్య తన వివరణపత్రంలోనూ, బయటకొన్ని వేదికలమీదా ఒక మంచి ఆలోచన వెలిబుచ్చారు. అదే వైద్య ఆరోగ్యరంగాన్ని రెండు లేక మూడుగా విభజించడం.

ఆరోగ్య (హెల్త్), వైద్య (క్యూరేటివ్), పాలన (అడ్మినిస్ట్రేషన్) ఈ మూడు విభాగాలను వేరు పరచి రాష్ట్ర కార్యదర్శి స్థాయినుంచి, గ్రామ స్థాయి వరకు విభజించగలిగితే ఎవరిపనిలో వారికి నిర్దిష్టత వస్తుంది. ఈ విభజన బోధనా దశలోనూ ఉండాలి. తద్వారా మంచి ఫలితాలు వస్తాయి.

మార్క్సిజం: వ్యక్తి-సమాజం

(29వ పేజీ తరువాయి)

గురించి ఇలా చెప్పాడు. "పరిశ్రమ అభివృద్ధి చెందడంతో కొత్త అవసరాలు ముందుకు వచ్చాయి. పాక్షికమైన సాధారణ శ్రామికుడి స్థానంలో అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన కార్మికుడి అవసరం ఏర్పడింది. ఉత్పత్తి అభివృద్ధి చెందడంతో, ప్రత్యేక విభాగాలలో విడివిడిగా పనిచేసే పాక్షిక శ్రామికుడి బదులు అనేక విభాగాలలో పనిచేసే బహుముఖ సామర్థ్యం గల శ్రామికుడు అవసరమయ్యాడు. పాక్షిక శ్రామికుడు ఉత్పత్తిలో పాల్గొనడం కేవలం పొట్టగడిచే మార్గంగా చూస్తే అభివృద్ధి చెందిన శ్రామికుడు ఉత్పత్తిలో పాల్గొనడాన్ని ఒక సజీవ కార్యకలాపంగా చూస్తాడు, తనలోని శక్తిని తెలుసుకుంటాడు. ఇది చారిత్రకంగా ఏర్పడిన లక్షణం.

ఈ లక్షణం సంపూర్ణ స్వరూపాన్ని సంతరించుకునేది శ్రామిక వర్గ విప్లవానంతరం, ఉత్పత్తి సాధనాల సామాజిక యాజమాన్యం ఏర్పడి ప్రణాళికాబద్ధ ఆర్థిక వ్యవస్థ, విస్తృత విద్య అభివృద్ధి చెందినప్పుడే. కాబట్టి సమస్య వ్యక్తులు విడివిడిగా అభివృద్ధి చెందడం కాదు. శ్రామికులందరి అభివృద్ధి ప్రధానం. వ్యక్తి బహువిధాలా అభివృద్ధి చెందడమనేది కేవలం ఒక మానవతావాదానికి సంబంధించిన ఆలోచన కాదు, ఒక వాస్తవమైన, చారిత్రకమైన సామాజిక అవసరం.

కారల్‌మార్క్స్ పెట్టుబడిదారీ విధానపు లక్షణాలను అధ్యయనం చేసి మానవుడి అభివృద్ధితో పాటు సమాజ పురోగతి గురించి శాస్త్రీయంగా చేసిన సూత్రీకరణలు సరైనవని జీవితానుభవం రుజువు చేస్తున్నది.

(అనువాదం: డా॥ పి. విజయకుమార్)

ప్రాజెక్టులపై సమగ్ర దృక్పథం ఉండాలి

- బి.వి. రాఘవులు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై ఇతర పార్టీల వైఖరికీ, మార్క్సిస్టు పార్టీ వైఖరికీ తేడా ఏమిటి?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో మార్క్సిస్టు పార్టీకి ఒక సమగ్ర దృక్పథం వుంది. మౌలిక విషయం గోదావరి నదీజలాలను సద్వినియోగం చేసుకోవడం. ఈ విషయంలో ఎవరికీ భిన్నాభిప్రాయం లేదు. అయితే ఈ జలాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలనేదే ముఖ్యమైన సమస్య. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఇందిరాసాగర్ ప్రాజెక్టు డిజైన్ మూలంగా 9 మండలాలు, 276 గ్రామాలు, 8 వేల ఎకరాల అడవి, 2 లక్షల ఎకరాల పొలాలు మునిగిపోతాయి. 2 లక్షల మంది ప్రజలు నిర్వాసితులవుతారు. ఇందులో 60 శాతానికి పైగా గిరిజనులు. మునిగిపోయే 2 లక్షల ఎకరాల భూమి అత్యంత సారవంతమైనది. ఇతర ప్రాంతాల భూముల ఉత్పాదకతతో పోల్చితే 4 లక్షల ఎకరాలతో సమానం. మునిగిపోయే ప్రాంతమంతా షెడ్యూల్డ్ ఏరియాలో వుంది. ఈ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా గిరిజనులకు ప్రత్యేక హక్కులు, అభివృద్ధి పథకాలు కల్పించబడ్డాయి. దశాబ్దాల పాటు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయి. ముంపు మూలంగా నాశనమయ్యే ప్రజాజీవనానికి లెక్కగట్టలేనంత నష్టం జరుగుతోంది. ఆర్థికంగా లెక్కగట్టగల్గే అంశాలను పరిగణనలోకి తీసుకున్నా వేల కోట్లలోనే వుంటుంది. ప్రాజెక్టు కోసం త్యాగం చేసే ఈ ప్రజలను సర్వనాశనం చేయడమే అభివృద్ధి అని ఎవరూ అనరు. లేదా ఈ నష్టాన్ని పూడ్చగల్గినంత సహాయం చేయాలనుకున్నా ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టాల్సివస్తోంది. ఇంత భారీగా ముంపునకు గురిచేసే ప్రాజెక్టు ప్రపంచంలోనే బహు అరుదు. మన రాష్ట్రంలో ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులను నాశనం చేయడం తప్ప ఆదుకున్న దాఖలా ఇప్పవరకూ లేదు. అందుకే ముంపునకు గురయ్యే ప్రజలు ఎందుకు త్యాగం చెయ్యాలని ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితి తమకే ఎదురైతే ఎవరైనా ఇలాగే ప్రశ్నిస్తారు.

మరి ప్రాజెక్టులు . కట్టాలంటే ముంపు లేకుండా ఎలా సాధ్యమవుతుందని కొందరు ప్రశ్నిస్తుంటారు. ఇలా ప్రశ్నించేవారు రెండు విషయాలను అర్థం చేసుకోవాలి. ముంపు అనివార్యమైతే మునిగిపోయే వారి బాధ్యతను సంపూర్ణంగా ప్రభుత్వమూ, ప్రాజెక్టు నుండి లబ్ది పొందేవారూ తీసుకోవాలి. మా అభివృద్ధి కోసం మీరు త్యాగం చేయాలనీ, మిమ్మల్ని ఆదుకునే పని మాదికాదని ప్రభుత్వం అన్నా, లబ్ది పొందేవారు అన్నా బాధ్యత అన్పించుకోదు. ముంపు అనివార్యం కాకుండా నదీ జలాలను వినియోగించుకునే ఇతర మార్గాలుంటే అటువంటి మార్గాలను అన్వేషించాలి. వాటికి ప్రాధాన్యత ఇవ్వాలి. 'వరల్డ్ కమిషన్ ఆన్ డ్యామ్స్' తాజాగా ఈ విషయాన్నే నొక్కిచెప్పింది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన నిర్వాసిత, పునరావాసిత విధానాలు ముంపులేని లేదా ముంపు తక్కువగా వుండే ప్రత్యామ్నాయాలు ఎంచుకోవాలని పేర్కొన్నాయి. గిరిజన సంక్షేమంపై యుపిఎ ప్రభుత్వం నియమించిన సలహా కమిటీ కూడా ప్రాజెక్టుల పేరుతో గిరిజనుల భూములు స్వాధీనం చేసుకోకూడదని సూచించింది. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణం కోసం రూపొందించిన మార్గదర్శక సూత్రాల్లో కూడా ప్రత్యామ్నాయ పద్ధతులన్నింటినీ పరిశీలించాలని పేర్కొన్నది. గోదావరి నదీజలాలను వినియోగించుకోవడానికి ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఇందిరాసాగర్ ప్రాజక్టు కన్నా మెరుగైన ముంపులేని ప్రత్యామ్నాయా లున్నాయని మార్క్సిస్టు పార్టీ అభిప్రాయం. అనేక మంది ప్రముఖ ఇంజనీర్లు ఇటువంటి ప్రత్యామ్నాయాలు ప్రతిపాదించారు. ఈ ప్రత్యామ్నాయాలు వేటినీ ప్రభుత్వం లోతుగా పరిశీలించడానికి సిద్ధంగాలేదు. అటువంటి ముంపులేని ప్రత్యామ్నాయాలను ఎంచుకొని గోదావరి నదీజలాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవచ్చని మార్క్సిస్టు పార్టీ అభిప్రాయపడుతున్నది. మిగతా పార్టీలకు ఇటువంటి స్పష్టమైన, సమగ్రమైన దృక్పథం లేదు.

గోదావరి నదీజలాలను వినియోగించుకోవడమనేది ఒక ఇందిరాసాగర్ ప్రాజెక్టుకే కాదు. ఎగువనున్న దుమ్ముగూడెం, ఇచ్చంపల్లి, ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు కూడా నిర్మాణం కావాలి. ఒకవైపున పుష్కరం, తాడిపూడి లిఫ్ట్‌ల నిర్మాణం చేస్తూనే, ఇందిరాసాగర్ నిర్మాణం చేపట్టినట్లుగానే ఇచ్చంపల్లి కూడా వెంటనే చేపట్టాల్సివుంది. దేవాదుల లిఫ్ట్ చేపట్టాలనే పేరుతో ఇచ్చంపల్లి పనులు చేపట్టకపోవడం సమంజసం కాదు. అందుకే గోదావరి నదీజలాలను వినియోగించుకొని అన్ని ప్రాజెక్టుల మధ్య సమన్వయం వుండాలి. సమగ్ర దృక్పథంతో చేపట్టాలని మార్క్సిస్టు పార్టీ అభిప్రాయం.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణంపై ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జివోను మార్క్సిస్టు పార్టీ ఆమోదిస్తోందా?

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచుతూ గతంలో విడుదల చేసిన 170 జివోను పక్కనబెట్టి కొత్తగా 233 జివోను ప్రభుత్వం జారీ చేసింది. వివిధ ప్రాంతాల ప్రజల మధ్య అపోహలు, వైషమ్యాలు సృష్టిస్తుందని 170 జివోను పక్కనబెట్టి అపోహలను తొలగిస్తూ సరైన పద్ధతిలో కొత్త జివోను విడుదల చేయాలని మొదట నుండీ మార్క్సిస్టు పార్టీ చెప్తున్నది. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ విమర్శలను ఖాతరుచేయకుండా చాలా కాలం వ్యవహరించింది. ఆఖరికి ఒత్తిడికి తలొగ్గి కొత్త జివోను తీసుకొచ్చింది. అదనపు జలాలను మాత్రమే వినియోగించుకోవడం జరుగుతుంది అని పేర్కొనడం, 68వ జివోలో గతంలో నిర్ణయించిన ప్రాధాన్యతలకు కట్టుబడి ఉంటామని అనడం ద్వారా ప్రజల్లో వచ్చిన అనుమానాలను, అపోహలను తొలగించింది. ఆ మేరకు చేసిన మార్పులను మార్క్సిస్టు పార్టీ ఆమోదించింది. వరద జలాలను అదనంగా వినియోగించుకొని రాయలసీమ కరువు ప్రాంతాలకు సహాయపడటానికి ప్రయత్నించడాన్ని మార్క్సిస్టు పార్టీ సమర్థిస్తున్నది.

అయితే ఇదే ఆలోచన మిగతా వెనుకబడిన ప్రాంతాలు, కరువు ప్రాంతాలకు కూడా వర్తించాలని ప్రభుత్వాన్ని మార్క్సిస్టు పార్టీ కోరింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి సంవత్సరం 500 టిఎంసీల నీరు కృష్ణానది నుండి సముద్రం పాలవుతున్నది. ఈ అదనపు జలాల్లో

(మిగతా 34వ పేజీలో)

కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల అంతర్జాతీయ సమావేశం

ప్రపంచం నలుమూలలనుండి వచ్చిన 73 కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీలు 2005 నవంబర్ 18 నుండి 20 వరకు గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో సమావేశమై "పెట్టుబడిదారీ వ్యవస్థలో ధోరణులు. ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రభావం. కమ్యూనిస్టు ప్రత్యామ్నాయం" అన్న అంశంపై చర్చించాయి. సమావేశానికి హాజరు కాలేకపోయిన అనేక పార్టీలు సందేశాలనూ, రాతపూర్వక అభిప్రాయాలనూ పంపాయి. 3 రోజులు పార్టీల ప్రతినిధులు సృజనాత్మకంగా చర్చలు జరిపారు. అంతర్జాతీయ పరిస్థితుల మీదా, ఉద్యమాల్లో పనిచేసేటప్పుడు వచ్చే అనుభవాలమీదా, ప్రజల ఆందోళనలు, కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల కార్యకలాపాలు మొదలైన వాటి మీదా ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా సంభవిస్తున్న అనేక సమస్యలపై సౌహార్ద్ర తీర్మానాలు ఆమోదించారు.

ప్రస్తుత పెట్టుబడిదారీ ప్రపంచంపై వక్తలు తమ అభిప్రాయాలు తెలియజేశారు. సామ్రాజ్యవాదం అన్ని రంగాల్లోనూ దుందుడుకుగా వ్యవహరిస్తోందని, సామాజిక, కార్మిక హక్కులపై దాడి చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోషలిజం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 21వ శతాబ్దంలో ఈ లక్ష్యాన్ని సాధించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్య, ప్రజా ఉద్యమాల మధ్య సౌహార్ద్రత, మద్దతు అభివృద్ధి చేసుకోవడం అవసరమని గుర్తించారు. అవకాశం ఉన్న మేరకు సంయుక్త కార్యాచరణలు కూడా చేపట్టాలని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల మధ్య సౌహార్ద్రత, సహకారం మరింత పెంపొందించేందుకు సమావేశం కొన్ని చర్యలు ప్రతిపాదించింది. అవి:

1. అమెరికా జైళ్లలో ఉన్న అయిదుగురు క్యూబా దేశ భక్తులను విడుదల చేయాలి. వీరిని జైళ్లలో సందర్శించడం కోసం అవసరమైతే అమెరికాకు ఒక ప్రతినిధి బృందాన్ని పంపాలి.
2. క్యూబా, వెనిజులాలకు సౌహార్ద్రత తెలపడం కోసం ఒక అంతర్జాతీయ ప్రతినిధి బృందాన్ని ఆ దేశాలకు పంపాలి.
3. యూరోపియన్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన కమ్యూనిస్టు వ్యతిరేక తీర్మానానికి నిరసనగా సంయుక్త కార్యాచరణ, ఆయా దేశాల్లో నిరసన ప్రదర్శనలు, కార్యక్రమాలు చేయాలి.
4. 2007 అక్టోబర్ విప్లవదినం రోజున ప్రచారం చేయాలి.
5. 2006 మే దేను నయాఉదారవాద విధానాల వల్ల శ్రామిక వర్గానికి, వర్ధమాన దేశాలకు జరుగుతున్న నష్టాలపూ ప్రచారం జరపాలి.
6. కమ్యూనిస్టు పార్టీలపై నిర్బంధాలపై నిఘావేయాలి.
7. ఇరాక్‌లో యుద్ధానికి, విదేశీ సైనిక స్థావరాలకు వ్యతిరేకంగానూ ప్రచారం చేయాలి.
8. ఉత్తర కొరియాకు సంఘీభావం తెలపాలి.
9. మధ్య ప్రాచ్యంలో అమెరికా కుట్రలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలి.
10. పార్టీల మధ్య అంతర్జాతీయ సంఘీభావాన్ని పెంపొందించుకోవాలి.

వీటితో పాటు మరో ఆరు అంశాలపై కార్యాచరణకు సమావేశం పిలుపునిచ్చింది.

సందేహాలు-సమాధానాలు

(25వ పేజీ తరువాయి)

పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్ ద్వారా సామర్థ్యం పెంచిన తరువాత కూడా 100 టిఎంసీలు మాత్రమే వినియోగించబడుతోంది. మిగిలిన 400 టిఎంసీలు కూడా ఎందుకు వృధా కావాలి? శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్ టన్నెల్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా అదనపు నీటిని నల్గొండ జిల్లా కరువు ప్రాంతాలకు వినియోగించుకోవాలి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో అదనపు మోటార్లను పెట్టడం ద్వారా ఎక్కువ నీటిని మహబూబ్‌నగర్ జిల్లాకు వినియోగించాలి. వెలుగొండ టన్నెల్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ప్రకాశం జిల్లా కరువు ప్రాంతాలకు నీటిని అందించాలి. కృష్ణానదిలో వరద 30 రోజుల పాటే వస్తున్నందున ఆ పరిమిత రోజుల్లోనే ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని పెంచాల్సి వస్తున్నదని ప్రభుత్వం చెప్పింది. ఈ సూత్రమే శ్రీశైలం లెఫ్ట్ బ్రాంచ్ కెనాల్‌కి, కల్వకుర్తికి, వెలుగొండకు కూడా వర్తిస్తుంది. అందుకు మార్క్సిస్టు పార్టీ ఈ మూడు ప్రాజెక్టుల సామర్థ్యాన్ని పెంచుతూ 233 జివోలో పొందుపర్చాలని కోరింది. అలా కాకపోతే ప్రత్యేక ఉత్తర్వునైనా విడుదల చేయాలని సూచించింది. ఇటువంటి ఉత్తర్వు విడుదల చేయనంత కాలం ప్రభుత్వం పాక్షికంగానే వ్యవహరిస్తుందన్న అపోహను ఎదుర్కొంటూనేవుంటుంది.

ఆదర్శ గ్రామాల పేరుతో రాష్ట్రప్రభుత్వం చేపడు తున్న కార్యక్రమం వల్ల ఎంతవరకు అభివృద్ధి జరుగుతుందనుకుంటున్నారు?

ఆదర్శ గ్రామాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమం పసలేని ప్రచార కార్యక్రమం. ఉన్న స్కీంలను పోగుజేసి ఒక పేరు పెట్టారు అంతే. ఎంపిక మంత్రులకు అప్పజెప్పారు. కొలబద్ద లేమీలేవు. అందుకే రాజకీయ తంతుగా మారిపోయింది. మున్సిపల్ వార్డులు ఎంపిక చేసిన తీరు ఇప్పటికే తీవ్ర విమర్శలకు గురయింది. గ్రామ సీమలు ఆదర్శంగా తయారుకావాలంటే మొదట అభివృద్ధి కావాల్సింది దళిత పేటలు, గిరిజన గూడాలు, లంబాడీ తండాలు. వాటిని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక కార్యక్రమం తీసుకుంటే అది ఆదర్శమనిపించుకునేది.

లంచాలు పుచ్చుకుని ప్రశ్నలు అడుగుతున్న ఎంపీలను పార్లమెంటు నుండి బహిష్కరించిన సందర్భంగా ప్రజా ప్రతినిధులను వెనక్కు పిలిచే చట్టంపై చర్చ జరుగుతోంది. దీనిపై పార్టీ అభి ప్రాయం ఏమిటి?

ప్రశ్నించడానికి పైకం తీసుకున్న పార్లమెంటు సభ్యులు ఆధారాలతో సహా దొరికిపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రజా ప్రతినిధుల్లో అవినీతిని అరికట్టడానికి అనేక సూచనలు వస్తున్నాయి. అవినీతికి పాల్పడుతూ దొరికిపోయిన వారిని శిక్షించడంతోపాటు అసలు అవినీతికే ఆస్కారంలేని పద్ధతులు రూపొందించడం గురించి చర్చ జరుగుతున్నది. ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల్లో డబ్బు ప్రమేయాన్ని తగ్గించే సంస్కరణలు, దామాషా ఎన్నికల పద్ధతులు వంటి అనేక సూచనలు వచ్చాయి. ప్రజా ప్రతినిధులను వెనక్కు రప్పించే చట్టం చేయాలన్న సూచన కూడా మరొకటి. అయితే రీకాల్ పద్ధతిలో ఒక్క అవినీతిపరుల్నే కాదు అత్యధిక ప్రజల నమ్మకాన్ని వమ్ముజేసిన ఏ ప్రజాప్రతినిధినైనా వెనక్కు పిలిపించే అవకాశం అటువంటి చట్టాల్లో వుంటుంది. ఇటువంటి రీకాల్ చట్టం సూచన కూడా మంచి సూచనే.

రచయిత

(వెనక పేజీ నుంచి)

లోవస్కీ ఆ మ్యాగజైన్ నిర్వాహకుడయ్యాడు. క్రమక్రమేణా యువకుల్లో ఆయనపట్ల ఎంతో గాఢమైన ఆదరాభిమానాలు ఏర్పడ్డాయి. మిఖైలోవస్కీ పేరు ఎంతో వైవిధ్యభరితమైన అంశాలపై రచించబడిన వ్యాసాల కింద కన్పిస్తుండేది. ఆయన మౌలిక నిర్ధారణలు, అభిప్రాయాలు పలు రచనల్లో, సీరియస్ వ్యాసాల్లో వివరించబడినాయి. ఆయన రహస్య జీవితం గడుపుతున్న విప్లవకారులకు కూడా దగ్గరవుతూ వచ్చాడు. 'నరోద్నయా వోల్య'తో ఆయన సహకారం క్రమంగా విస్తరిస్తూ వచ్చింది. ఆ సంఘం ప్రచురించిన 'లిస్తోక్' (కరపత్రం) పత్రిక సంపాదకవర్గ సభ్యుల్లో ఆయన ఒకడయ్యాడు. ఆయన ఆ వ్యాసాల్లో పాలకవర్గాల నిరంకుశత్వాన్ని తీవ్రంగా ఖండించాడు. "గ్రొవ్సర్" (మొరటి భాషతో గొణిగేవాడు) అనే కలం పేరుతో ఆయన రాసిన వ్యాసాలు ప్రజాస్వామిక యువకుల్లో ప్రసిద్ధి చెందినవి.


1882 నాటికి మిఖైలోవస్కీకి, "నరోద్నయా వోల్య" ఉద్యమ సభ్యులకూ మధ్య కొన్ని సమస్యల మీద అభిప్రాయ భేదాలు ఏర్పడ్డాయి. 'నరోద్నయా వోల్య' సభ్యులు రాజకీయ పోరాటం అనవసరమని, అది బూర్జువా వర్గాలకు మాత్రమే ఉపయోగపడుతుందని భావించడాన్ని వ్యతిరేకించారు మిఖైలోవస్కీ. దీనిని బాహాటంగా వ్యతిరేకించాడు. అనేక రచనల్లో మిఖైలోవస్కీకి రాజకీయ పోరాట కర్తవ్యం పట్ల ఉన్న స్పష్టమైన అవగాహన ప్రస్ఫుటమైంది. అందులో భాగంగా, ఆయన ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అప్పుడప్పుడు జరిపే ఉగ్రవాద కార్యకలాపాల వల్ల ప్రయోజనం ఉండదని, నిరంకుశ రాజరికాన్ని కూలదోయాలని ఆయన పేర్కొన్నాడు. అందుకే జారిస్టు ప్రభుత్వానికి మిఖైలోవస్కీ ప్రమాదకరమైన, విలువైన వ్యక్తిగా కనిపించాడు. అయితే ఆయన రహస్య ఉద్యమంతో గల సంబంధం కారణంగా ఆయన విప్లవకర కార్యకలాపాలను గురించి సాక్ష్యం సంపాదించేందుకు పోలీసులు ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో వారాయనను మొదట నొవ్‌గొరోడ్ రాష్ట్రానికి, ఆ తర్వాత వీబోర్గ్‌కూ ప్రవాసిగా పంపడంతో సరిపెట్టుకోవలసి వచ్చింది. వీబోర్గ్‌లో ఉండగానే మిఖైలోవస్కీ "బయటి వాడి లేఖలు" పేరిట తన రాజకీయ వ్యాసాలు రాశాడు.

మిఖైలోవస్కీ రాజధానికి తిరిగి వచ్చేందుకు 1885లో అనుమతి లభించింది. అక్కడకు చేరుకున్న వెంటనే రాజకీయ జీవితంలో చురుగ్గా పాల్గొనసాగించాడు. రెండో ప్రవాసానంతరం ఆయన అనేక పత్రికల్లో పనిచేసినా ఏ ఒక్కదానికీ దృఢంగా కట్టుబడలేదు. 1892లో ఆయన "రూస్కోయె బొగాత్‌స్త్వో" (రష్యన్ సంపద) పత్రికలో చేరాడు. 1894 నుంచి ఆయన దానికి అధిపతిగా ఉంటూ మరణించేవరకూ దానికి సంపాదకుడిగా పనిచేశాడు. మిఖైలోవస్కీ తనకున్న భావవాద తాత్త్విక అభిప్రాయాల కారణంగా మార్క్సిస్టులను వ్యతిరేకించేవాడు. ఆయన సైద్ధాంతిక సూత్రీకరణల్లో 'ప్రగతి' అంశం ఒకటి. వ్యక్తి (అవిభాజ్య) సర్వతోముఖ సమగ్ర అభివృద్ధి సిద్ధాంతం అనేదాన్ని ఆయన రూపొందించాడు. మిఖైలోవస్కీ అభిప్రాయంలో అలాంటి అభివృద్ధి ఫ్యూడల్, పెట్టుబడిదారీ క్రమ వికాస దశలు రెండింటిలోనూ పొసగలేదు అంటాడు. వ్యక్తి అవిభాజ్యంగా, ఒకే దశలో అభివృద్ధి చెందుతాడు మరి ఆ వ్యక్తి ప్రగతి మార్గం చేపట్టి దీన్నిబట్టి సమాజాన్ని బాగా అభివృద్ధి చెందిన వైవిధ్యభరితమైన వ్యక్తిత్వం పెంపొందించలేని ... ఈ సిద్ధాంతాన్ని చాలా వింతగా ... అసంగతమూ అయిన స్వభావం ఉన్నప్పటికీ దాన్నుంచి బహుముఖ పర్యవసానాలు కలిగిన కొన్ని పెద్ద నిర్ధారణలు గ్రహించబడినాయి. నిరంకుశ రాజరికం నియంతృత్వానికి వ్యతిరేకం, సామాజిక అన్యాయానికి వ్యతిరేకం, వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు కల్పించబడే వ్యవస్థ కోసం, ఉమ్మడి, సమిష్టి ప్రయోజనం ఆధారపడిన నూతన సామాజిక వ్యవస్థ కోసం పోరాటానికి ఈ సిద్ధాంత పిలుపునిచ్చింది. ఈ సిద్ధాంతంలో ఊహాజనిత స్వర్గానికి సంబంధించిన అంశం కూడా ఉన్నప్పటికీ, ఆనాటి కాలంలో సామాజిక అభివృద్ధి కోసం పోరాడుతున్న వారికి ఈ సిద్ధాంతంలోని అభిప్రాయాలు ఉత్తేజం కలిగించాయి. సామాజిక పరిస్థితి నియమాలకు మిఖైలోవస్కీ వ్యక్తి కోణం నుండి భాష్యం చెప్పాడు. దాన్ని ఆయన ప్రగతి సిద్ధాంతంగా వర్గీకరించాడు. మిఖైలోవస్కీ భావాలు 1870 దశాబ్ది చివరలో, 1880 దశాబ్ది మొదటిలో నరోద్నిక్ ఉద్యమ సైద్ధాంతిక మూలాధారాల్లో ఒకటిగా ఉపయోగపడ్డాయి. రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి పట్ల వ్యతిరేక వైఖరి ప్రదర్శించాడు. రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ ఇంకా పిండదశలో ఉందిగనుక, దేశ ఆర్థిక జీవితాన్ని చైతన్యపూర్వకంగా ప్రభావితం చేయడం, తమ సొంత ఆర్థిక వికాసపు స్వభావాన్ని ఎంపిక చేసుకోవడం సాధ్యమని ఆయన చెప్పాడు. ఈ సమస్యపై ఒక నమూనా ప్రాయమైన భావవాద వైఖరి రష్యాలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిని గుర్తించిన మార్క్సిస్టు దృక్పథం పట్ల ఆయన ప్రతికూలత అందుకే.

1894లో లెనిన్ 'ప్రజల మిత్రులు ఎవరు?" అనే తన ప్రసిద్ధ రచనలో మిఖైలోవస్కీ అభిప్రాయాలపై కూలంకషమైన విమర్శ చేశాడు. మిఖైలోవస్కీతో వాదోపవాదాల్లో, ప్రపంచాన్ని గుర్తించడంలోనూ, ప్రపంచాన్ని విప్లవకరంగా మార్చడంలోనూ మార్క్సిజానికి ప్రపంచవ్యాపిత చారిత్రక ప్రాముఖ్యత ఉందని లెనిన్ నిరూపించాడు.

మిఖైలోవస్కీని గురించి లెనిన్ చారిత్రకంగా వాస్తవిక దృష్టితో అంచనా వేసేందుకు ప్రయత్నించాడు. స్వేచ్ఛ కోసం జరిగిన పోరాట చరిత్రలో ఆయన స్థానాన్ని లెనిన్ నిర్ధారించడంలో పద్దెనిమిదేళ్లకు పైగా వారి మధ్య సాగిన వాదోపవాదాలు అవరోధం కాలేకపోయాయి. మిఖైలోవస్కీ భావవాద రచనలనూ, విప్లవాత్మక నరోద్నిజం సంప్రదాయాన్ని తిరస్కరించడాన్నీ, యువ లెనిన్ ఉదారవాద విశ్వాసాలు చెయ్యడాన్ని లెనిన్ విమర్శిస్తూ కూడా విప్లవోద్యమానికి ఆయన చేసిన సేవలను ప్రస్తుతించాడు.

చమత్కారం, మరో సమ్మోహకమైన ఆయన రచనలు. రోజువారీ సమస్యలను పురోగామి ఆదర్శాలతో ముడిపెట్టే సామర్థ్యాన్ని, జీవితంలోని దోషాలను ధైర్యంగా విమర్శించడాన్ని, పీడితులను సమర్థించే విషయంలో ఆయన నిరంతర సంసిద్ధతను లెనిన్ ప్రశంసించాడు. భూదాస్య వ్యవస్థకూ, బ్యూరోక్రసీ పద్ధతులకు వ్యతిరేకంగా నిజాయితీగా, నిపుణతతో పోరాటం సాగించినందుకు మిఖైలోవస్కీకి లెనిన్ గౌరవాభివందనాలు చెప్పారు. అంతేగాని మిఖైలోవస్కీ బూర్జువా, ప్రజాతంత్ర భావాలకు కాదు. మిఖైలోవస్కీ 1904 జనవరి 28న గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. పీడిత ప్రజల సమర్థకుడికి గౌరవాంజలిని ఘనంగా ఘటించారు.



మార్క్సిజం గుడ్డినమ్మకం కాదు, ఆచరణకు కరదీపిక

\- జె.డి. బెర్నాల్

"....ఈ ప్రపంచ భవిష్యత్తును ఊహించే మంత్రదండం మార్క్సిస్టుల దగ్గర లేదు. సామాజిక, ఆర్థికాభివృద్ధి ధోరణులు ఇలా ఉండబోతున్నాయని ముందుగానే ఊహించడానికి ఉపయోగపడే విశ్లేషణా పద్ధతులు మార్క్సిస్టుల దగ్గర రడీమేడ్‌గా ఉంటాయని కొందరనుకుంటారు. విమర్శనా రహితంగా ఇటువంటి నిర్ధారణలకు రావడమంటే మార్క్సిజాన్ని మరో మతభావన కింద మార్చడమే అవుతుంది. సామాజిక, ఆర్థిక పురోగమనం ఎలా జరుగుతుందో మార్క్స్ ముందుగానే ఒక మ్యాపు తయారు చేసిపెట్టినట్లూ, ప్రజలు ఎలాగోలా ఆ మార్గాన వెళితే సరిపోతుందన్నట్లూ భావిస్తారు. ఇది పూర్తిగా అవగాహనా రాహిత్యం. మార్క్సిస్టు భవిష్యద్దర్శనం అటువంటి పథకాలపై ఆధారపడి జరగదు. పైగా ముందుగానే సిద్ధం చేసుకున్న పథకం ప్రకారం సమాజం నడక సాగించబోదని మార్క్సిజం చెబుతుంది. కాల గమనంలోని ఏ క్షణంలోనైనా మనకు కనిపించేది అప్పటి వివిధ ఆర్థిక, సామాజిక శక్తుల కలయిక, వాటి మధ్య ఘర్షణ, దాని వల్ల ఏర్పడే కొత్త పరిస్థితులు మాత్రమేనని మార్క్సిజం చెబుతుంది. దీనికి మించి మనం చూడగలిగే క్రమం ఒక్కటే, అదేమంటే ఆ క్రమం అంతం కాదు, అది మరో కొత్త రూపాన్ని - మనం ముందుగా ఊహించలేని రూపాన్ని - తీసుకుంటుంది అనేదే. అందువల్ల మార్క్సిజం అనేది ఒక పద్ధతి. కార్యాచరణకు ఒక కరదీపిక. ఆ విధంగా మాత్రమే దానికి విలువ వస్తుంది మినహా ఒక గుడ్డినమ్మకంగానో, లేదా జోతిష్యంగానో దాన్ని పరిగణించకూడదు.

"సైన్సు అభివృద్ధితో మార్క్సిజానికి సైద్ధాంతికంగానూ, ఆచరణాత్మకంగానూ సంబంధం ఉంది. సైన్సు అనేది దేనికీ సంబంధం లేని అమూర్తభావనగా మారిపోకుండా మార్క్సిజం దాన్ని కాపాడుతుంది. మానవుని ఆర్థిక, సామాజికాభివృద్ధిలో సైన్సును ఒక భాగంగా, అత్యంత కీలకమైన భాగంగా చేస్తుంది మార్క్సిజం. దాని దృష్టిలో ఆచరణ, అవగాహన ఒకదాన్నుండి మరొకటి విడదీయలేనివి. సైన్సు యొక్క సామాజిక కర్తవ్యాలు (నాటి) సోవియట్ యూనియన్ వంటి సోషలిస్టు దేశాల్లో మాత్రమే పూర్తిగా నెరవేరుతాయి. సమాజపరమైన పరిశ్రమలతోనూ, మానవ సంస్కృతితోనూ శాస్త్ర పరిశోధన పూర్తిగా మిళితం కావడం అనేది సోషలిస్టు సమాజంలోనే సాధ్యమవుతుంది. పెట్టుబడి దారీ దేశాల్లో సైన్సు క్రమంగా బడా వ్యాపారుల చేతుల్లోకి పోతుంది. కాని ఈ వర్గం సైన్సు యొక్క సామాజిక కర్తవ్యాలను అర్థం చేసుకోలేదు కాబట్టి దాని సేవలు చాలా నాసిరకంగా ఉంటాయి, చాలా వ్యర్థమైపోతాయి. లాభాలకోసం జరిగే ఉత్పత్తి, సైన్సు యొక్క పూర్తి సామర్థ్యాన్ని ఎదగనివ్వదు. ఇక్కడ సైన్సు సామర్థ్యం మరింత ఎక్కువగా వినియోగించబడేది వినాశనకర కార్యకలాపాలకు మాత్రమే. మార్క్సిస్టు అవగాహన సైన్సును సమాజసేవకోసం వినియోగిస్తుంది. దాని దృష్టిలో అది కేవలం కొద్దిమంది సొత్తుకాదు, ప్రజలందరి సాంస్కృతిక వారసత్వంలో ఒక భాగం...."

(జె.డి. బెర్నాల్ రాసిన "డయలెక్టికల్ మెటీరియలిజం అండ్ మోడర్న్ సైన్సు", 1937 వ్యాసం నుండి)

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KRSA102M109
పుస్తకం పేరు	మార్క్సిస్టు
తారీఖు	23 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	37
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Saranya
పేజీలు విడదీసినది	Suri
స్కాన్ చేసినది	Prasad
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good